RNI Reg-No.APTEL/2005/19204

ESTD : 1996

# నేటి మనదేశమ్

తెలుగు దినపత్రిక

Simultaneously published from Tirupati, Vijayawada, Visakhapatnam & Hyderabad

సంపుటి :21 సంచిక 149 తిరుపతి సంపాదకులు: కె.యస్.రంగశాయి శనివారం 30-5-2026 పేజీలు :8 వెల: 1-00

శ్రీ పరాభవ నామ సంవత్సరం, ఉత్తరాయణం, వసంత రుతువు,వైశాఖ మాసం, తిథి॥ చతుర్దశి ఉ॥11.05, విశాఖ మ॥12.55, వర్జ్యం సా॥5.19 - 7.05, దుర్ముహూర్తం ఉ॥ 5.37-7.18, శుభ సమయం ఉ॥ 6.00-7.30, రాహుకాలం ఉ॥9.00-10.30, సూర్యోదయం ఉ॥ 5.30, సూర్యాస్తమయం సా॥ 6.21 గం॥

## పీజీసెట్ ఫలితాలు విడుదల

– విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ 'ఎక్స్' వేదికగా వెల్లడి



**అమరావతి, మే 29 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** ఏపీ పోస్టు గ్రాడ్యుయేట్ కామన్ ఎంట్రన్స్ టెస్ట్ (ఏపీపీజీసెట్-2026) ఫలితాలు విడుదలయ్యాయి. మే 8 నుంచి 11 వరకు జరిగిన ఈ పరీక్షల ఫలితాలను ఏపీ విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ 'ఎక్స్' వేదికగా వెల్లడించారు. ఈ పరీక్షకు మొత్తంగా 19,118మంది దరఖాస్తు చేసుకోగా.. 16,406 మంది పరీక్షకు హాజరయ్యారు. వీరిలో 15,020 మంది (91.55 శాతం) ఉత్తీర్ణత సాధించినట్లు అధికారులు తెలిపారు. ఈ పరీక్షలో అర్హత సాధించిన వారికి రాష్ట్రంలోని 17 యూనివర్సిటీల్లో 30 సబ్జెక్టులకు పీజీ కోర్సుల్లో ప్రవేశాలను కల్పించనున్నారు. ఈ ఏడాది పరీక్షను తిరుపతిలోని శ్రీ వెంకటేశ్వర యూనివర్సిటీ నిర్వహించిన విషయం తెలిసిందే. ఈ పరీక్షలో అర్హత సాధించిన అందరికీ మంత్రి లోకేశ్ అభినందనలు తెలిపారు. అద్భుతమైన ఉత్తీర్ణత శాతం విజేతల కృషి, పట్టుదలకు నిదర్శనమన్నారు. విజయం సాధించిన ప్రతి అభ్యర్థికీ ఉన్నత విద్య, పరిశోధన రంగాల్లో ఉజ్వల భవిష్యత్తు ఉండాలని ఈ సందర్భంగా ఆకాక్షించారు.

## కాలుష్య రహితంగా గోదావరి పుష్కరాలు

❍కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలి ❍స్వచ్ఛ గోదావరిపై జూన్ 25 నాటికి పూర్తిస్థాయి నివేదిక
❍అధికారులను ఆదేశించిన డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్



**అమరావతి, మే 29 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** 'స్వచ్ఛ గోదావరి- పవిత్ర పుష్కరాల' నేపథ్యంలో అధికారులకు ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ కీలక ఆదేశాలు జారీ చేశారు. కాలుష్యరహిత గోదావరి పుష్కరాల నిర్వహణకు కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని అధికారులను ఆదేశించారు. నదిలోకి పారిశ్రామిక వ్యర్థాలు, మురుగు నీరు చేరకుండా పటిష్ట చర్యలు తీసుకోవాలని సూచించారు. దీని కోసం జూన్ 25 లోపు పూర్తి స్థాయి నివేదికతో 'స్వచ్ఛ గోదావరి' ప్రణాళికను సిద్ధం చేయాలని అధికారులను పవన్ ఆదేశించారు. గోదావరి పుష్కరాల నేపథ్యంలో ఆరు జిల్లాల పరిధిలో 262 పుష్కర పంచాయతీలను గుర్తించారు. వీటిని మురుగురహిత పంచాయతీలుగా తీర్చిదిద్దాలని, మురుగునీరు నేరుగా గోదావరిలో కలవకుండా కఠిన చర్యలు తీసుకోవాలని డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్ అధికారులను ఆదేశించారు. మురుగు నీటి నిర్వహణ, పారిశ్రామిక వ్యర్థాల కాలుష్యంపై పర్యవేక్షణ కోసం ప్రత్యేకంగా కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేయాలని సూచించారు. పరిశ్రమల వ్యర్థాలు నదిలో కలవకుండా కాలుష్య నియంత్రణ మండలి అధికారులు కఠినంగా వ్యవహరించాలని, మురుగు నీటిని శుద్ధి చేశాకే నదిలోకి వదలాలని పవన్ స్పష్టం చేశారు. మున్సిపాలిటీ సామర్థ్యానికి తగిన విధంగా మురుగు శుద్ధి ప్లాంట్ల నిర్మాణం చేపట్టాలని సూచించారు. పీసీబీ మంజూరు చేసిన రూ.100 కోట్ల నుంచి కూడా నిధుల వినియోగించాలని డిప్యూటీ సిఎం ఆదేశించారు. రోజువారీ 104 మిలియన్ లీటర్ల మురుగు నీరు జీవనదిని కలుషితం చేస్తోందన్నారు. ఇందులో గ్రామీణ ప్రాంతాల నుంచి 8.38 మిలియన్ లీటర్ల మురుగు నీరు గోదావరిలో కలుస్తోందని పేర్కొన్నారు. పారిశ్రామిక వ్యర్థాల్లో ఆంధ్ర పేపర్ మిల్లు వెదజల్లే రోజువారీ కాలుష్యమే 32 మిలియన్ లీటర్లు ఉంటుందన్నారు. నిత్యం గోదావరిలో కలిసే 13.24 మిలియన్ లీటర్ల ఆక్వా కాలుష్యం వీటికి అదనమని పేర్కొన్నారు. పారిశ్రామిక కాలుష్య నివారణకు నిరంతర తనిఖీలు చేయాలని సూచించారు.

ఆర్టీజీఎస్ తరహా కంట్రోల్ రూం ద్వారా నిరంతరం ప్రత్యక్షంగా పర్యవేక్షించాలని ఆదేశించారు. పర్యావరణ పరిరక్షణ టాస్క్ ఫోర్స్‌కి కంట్రోల్ రూం నిర్వహణ బాధ్యతలను అప్పగించారు.

## నీట్ పేపర్ లీక్ బాధ్యత ఎవరిది

– యూపిపిఎస్‌సిని చూసి నేర్చుకోండి – నీట్ పేపర్ లీక్‌పై మరోమారు సుప్రీం ఆగ్రహం




**న్యూఢిల్లీ, మే 29 (ఆర్ఎన్ఎ):** నీట్ యూజీ పరీక్ష పేపర్ లీక్ వివాదంపై సుప్రీం కోర్టు మరోసారి తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. పర్యవేక్షణా యంత్రాంగాలు, సంబంధిత కమిటీలు ఉన్నప్పటికీ ఇంత పెద్ద ఉల్లంఘన ఎలా జరిగిందని కేంద్రాన్ని ప్రశ్నించింది. ఇలాంటి సంఘటన విద్యార్థులు, వారి తల్లిదండ్రులకు తీవ్ర మానసిక క్షోభను కలిగిస్తుందని, వారిని ఇలా నిరాశపెట్టడం సరికాదని అభిప్రాయపడింది. పేపర్ లీక్ విషయంలో లోపాలకు జవాబు దారీతనం ఉండాల్సిందేనని, అప్పటి వరకు అసలు సమస్య ఆగదని వ్యాఖ్యానించింది. అయితే, యువత ఆందోళనలను ప్రభుత్వం తీవ్రంగా పరిగణనలోకి తీసుకుంటోందని సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా సుప్రీం ధర్మాసనానికి వెల్లడించారు. పరిస్థితిని ప్రధానమంత్రి కూడా వ్యక్తిగతంగా పర్యవేక్షిస్తున్నారని చెప్పారు. జూన్ 21న మరోసారి నిర్వహించే నీట్-యూజీ పరీక్ష కోసం కొత్త యంత్రాంగాలను ఏర్పాటు చేశామన్నారు. అయితే, ఈ వ్యవహారంపై ప్రతిస్పందన తెలియజేయాలని కేంద్రాన్ని ఆదేశించిన సుప్రీం ధర్మాసనం.. తదుపరి విచారణను జులై రెండో వారానికి వాయిదా వేసింది. నీట్ పేపర్ లీక్ ఉదంతంపై విచారణ చేపట్టిన సుప్రీం కోర్టు నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీపై(ఎన్‌టీఏ) పలు ప్రశ్నలు సంధించింది. ఇన్ని నిఘా వ్యవస్థలు, కమిటీలు ఉన్నా పేపర్ ఎలా మిగతా 2లో..

## మాజీమంత్రి గాదె వెంకట్‌రెడ్డి కన్నుమూత


(ఫైల్ ఫొటో)

**హైదరాబాద్, మే 29 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ మంత్రి, సీనియర్ రాజకీయ నాయకుడు గాదె వెంకటరెడ్డి కన్నుమూశారు. గతకొద్ది రోజులుగా వయోభారం, ఇతర అనారోగ్య సమస్యలతో బాధపడుతోన్న ఆయన శుక్రవారం హైదరాబాద్‌లోని నివాసంలో తుదిశ్వాస విడిచారు. వెంకటరెడ్డి మృతిని ఆయన కుటుంబ సభ్యులు ధృవీకరించారు. వెంకటరెడ్డి మరణంపై పలువురు రాజకీయ నాయకులు సంతాపం వ్యక్తం చేస్తున్నారు. 1940 జూలై 10న ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని ప్రకాశం జిల్లా ఇంకొల్లు మండలం పావులూరు గ్రామంలో గాదె వెంకటరెడ్డి జన్మించాడు. ఎల్ఎల్‌బీ పూర్తి చేసిన ఆయన కాంగ్రెస్ పార్టీ రాజకీయ అరంగ్రేటం చేశారు. 1967లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో పరుచూరు నియోజకవర్గం మిగతా 2లో..

## 'నైరుతి' రాక మరింత ఆలస్యం



**విజయవాడ, మే 29 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** మండుటెండలతో అల్లాడిపోతున్న ప్రజలకు ఇప్పుడప్పుడే ఉపశమనం లభించేలా కన్పించట్లేదు. నైరుతి రుతుపవనాల రాక మరింత ఆలస్యమవుతోంది. జూన్ 4, 5 తేదీల్లో ఈ రుతుపవనాలు కేరళ తీరాన్ని తాకే అవకాశం ఉన్నట్లు వాతావరణ శాఖ అంచనా వేస్తోంది. వాస్తవానికి మే 26వ తేదీనే నైరుతి రుతుపవనాలు కేరళ తీరాన్ని తాకే అవకాశం ఉందని తొలుత వాతావరణ శాఖ (ఐఎండీ) అంచనా వేసింది. కానీ, ఈ సారి ఎల్‌నినో ప్రభావంతో ఆ అంచనాలు తలకిందులయ్యాయి. రుతుపవనాలు నెమ్మదిగా కదులుతుండటంతో వీటి రాక ఆలస్యమవుతోంది. కేరళను తాకిన రెండు, మూడు రోజుల తర్వాత అవి తెలంగాణలోకి ప్రవేశించే అవకాశం ఉంది. గతేడాది, అంచనా వేసిన సమయానికంటే ఎనిమిది రోజులు ముందుగానే మే 24న ఈ రుతుపవనాలు కేరళ తీరాన్ని తాకాయి. ఆ తర్వాత మే 26న తెలంగాణలోకి ప్రవేశించాయి. ఇదిలా ఉండగా.. ఈ ఏడాది సాధారణం కన్నా తక్కువ వర్షపాతం నమోదయ్యే అవకాశాలు ఉన్నాయని వాతావరణ శాఖ ఇప్పటికే ప్రకటించింది. ఎల్‌నినో ప్రభావంతో దేశవ్యాప్తంగా పలు ప్రాంతాల్లో వర్షాలు తక్కువ పడొచ్చని పేర్కొంది. ఇక, జూన్‌లోనూ యూపీ, హరియాణా, పంజాబ్, బిహార్, ఆంధ్రప్రదేశ్, ఒడిశా, గుజరాత్, ఛత్తీస్‌గఢ్‌లోని పలు ప్రాంతాల్లో వడగాలులు వీచే అవకాశం ఉందని ఐఎండీ తెలిపింది.

## మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు.. ధైర్యంగా ప్రకటించిన పార్టీ తెదేపా

– మంత్రి వంగలపూడి అనిత



**అమరావతి, మే 29 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** చట్టసభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పిస్తామని ధైర్యంగా ప్రకటించిన పార్టీ తెదేపా అని మంత్రి వంగలపూడి అనిత అన్నారు. రిజర్వేషన్లపై చట్టం అమల్లోకి రాకపోయినా పార్టీ నిర్ణయం తీసుకుందని చెప్పారు. అమరావతిలో నిర్వహించిన మీడియా సమావేశంలో అనిత మాట్లాడారు. "ఎన్టీఆర్ హయాం లో మహిళలకు ఆత్మగౌరవం.. చంద్రబాబు హయాంలో వారి ఆర్థిక గౌరవం పెరిగాయి. కోటి మంది మహిళలతో డ్వాక్రా సంఘాలు విరాజిల్లుతున్నాయి. మహిళలకు 33 శాతం రిజర్వేషన్ల అంశం 33 ఏళ్లుగా నానుతోంది. మహానాడును మహిళలకు అంకితం చేస్తున్నట్లుగా స్త్రీశక్తి థీమ్‌తో నిర్వహించారు. మహిళా రిజర్వేషన్లపై చట్టం అమల్లోకి రాకపోయినా పార్టీ నిర్ణయం తీసుకుంది" అని అనిత అన్నారు.

## గాలివాన బీభత్సం..

– విద్యుత్ సరఫరా పునరుద్ధరణపై మంత్రి సమీక్ష

**అమరావతి, మే 29 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** రాత్రి నుంచి పలుచోట్ల వర్షం, ఈదురుగాలుల వల్ల వివిధ ప్రాంతాల్లో విద్యుత్ సమస్యలు తలెత్తాయని మంత్రి గొట్టిపాటి రవికుమార్ తెలిపారు. ఉమ్మడి కృష్ణా, ప్రకాశం, బాపట్ల జిల్లాల్లో కొన్నిచోట్ల విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగిందన్నారు. వర్షం కారణంగా కొన్నిచోట్ల విద్యుత్ పునరుద్ధరణకు ఆలస్యమవుతోందన్నారు. మధ్యాహ్నంలోగా విద్యుత్ సరఫరా పునరుద్ధరణకు అధికారులను మంత్రి గొట్టిపాటి ఆదేశించారు. ఏ పనికి ఎంత సమయం పడుతుందో పర్యవేక్షించాలని అధికారులకు సూచించారు. ప్రజలు విద్యుత్ ప్రమాదాలకు గురికాకుండా అప్రమత్తత సందేశాలు పంపాలని ఆదేశించారు. ప్రజలకు ఏ సమస్య ఉన్నా 1912 టోల్‌ఫ్రీ నెంబర్‌ను సంప్రదించవచ్చని సూచించారు. విజయవాడలో విద్యుత్ తీగ తెగిపడి హోంగార్డు మృతి చెందడం పట్ల మంత్రి దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. హోంగార్డు కుటుంబాన్ని అన్నివిధాలా ఆదుకుంటామని హామీ ఇచ్చారు. ఉభయగోదావరి జిల్లాల్లో ఒకటి, రెండు గ్రామాలు మినహా విద్యుత్ సరఫరా పునరుద్ధరించామని అధికారులు మంత్రికి వివరించారు. మిగిలిన ప్రాంతాల్లో మధ్యాహ్నంలోపు పునరుద్ధరిస్తామని అధికారులు తెలిపారు.

## 'వేస్ట్ టు ఎనర్జీ' ప్లాంట్ల విస్తరణ

కొత్తగా మరో ఆరు ప్లాంట్ల ఏర్పాటు: పురపాలక మంత్రి నారాయణ వెల్లడి



**విజయవాడ, మే 29 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** ఆంధ్రప్రదేశ్‌లో మున్సిపాలిటీలను డంపింగ్ యార్డుల రహితంగా మార్చేందుకు కృషి చేస్తున్నామని మంత్రి పొంగూరు నారాయణ తెలిపారు. ప్రస్తుతం విశాఖపట్నం, గుంటూరులో 'వేస్ట్ టు ఎనర్జీ' ప్లాంట్లు ఉన్నాయని, కొత్తగా మరో ఆరు ప్లాంట్లను నెలకొల్పుతున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఈ లోగా 107 మున్సిపాలిటీల్లో ఉత్పత్తి అయ్యే చెత్త నిర్వహణ కోసం ఫ్రెష్ వేస్ట్ ప్లాంట్లు ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు. ఈ ప్లాంట్ల ద్వారా ప్రతి రోజూ 5,385 టన్నుల చెత్తను కంపోస్ట్, బయోగ్యాస్‌గా మారుస్తామని తెలిపారు. ఎన్టీఆర్ జిల్లా కొండపల్లి, ఇబ్రహీంపట్నంలో మంత్రి నారాయణ, ఎమ్మెల్యే వసంత కృష్ణ ప్రసాద్ పర్యటించారు. కొండపల్లిలో కొత్తగా నిర్మిస్తున్న ఫ్రెష్ వేస్ట్ ప్లాంట్‌ను పరిశీలించగా, ఇబ్రహీంపట్నంలో కంప్రెస్డ్ బయోగ్యాస్ ప్లాంట్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి నారాయణ మాట్లాడుతూ.. 'ఏపీ ప్రజల నుంచి గత ప్రభుత్వం చెత్త పన్ను వసూలు చేసింది. అయినా 150 లక్షల టన్నుల చెత్తను వదిలి వెళ్లిపోయింది. ఆ చెత్తను కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత తొలగిస్తున్నాం. వచ్చే నెలాఖరు నాటికి అన్ని ప్లాంట్లు పూర్తి చేసి అందుబాటులోకి తీసుకువస్తాం. ఐదు కంప్రెస్డ్ బయోగ్యాస్ ప్లాంట్ల కోసం ఏపీ ప్రభుత్వం రూ.59.85 కోట్లు మంజూరు చేసింది. రాజమహేంద్రవరం, నెల్లూరు, గుంటూరు, ఒంగోలు, ఇబ్రహీంపట్నంలో నూతన సీబీజీ ప్లాంట్లు ఏర్పాటు చేస్తున్నాం. విజయవాడలో ఉన్న ప్లాంట్‌ను కూటమి ప్రభుత్వం మిగతా 2లో..

## సిద్ధరామయ్య రాజీనామా ఆమోదించిన గవర్నర్



**బెంగుళూరు, మే 29 (ఆర్ఎన్ఎ):** కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య రాజీనామాకు గవర్నర్ థావర్‌చంద్ గహ్లోత్ ఆమోదం తెలిపారు. సీఎం పదవికి సిద్ధరామయ్య నిన్న రాజీనామా చేసిన విషయం తెలిసిందే. గవర్నర్ మధ్యప్రదేశ్‌లో ఉండటంతో లోక్‌భవన్‌కు వెళ్లిన సిద్ధరామయ్య.. గవర్నర్ ప్రత్యేక కార్యదర్శి ప్రభుశంకర్‌కు రాజీనామాపత్రం సమర్పించారు. అర్ధరాత్రి మధ్యప్రదేశ్ నుంచి తిరిగి బెంగళూరు చేరుకున్న గవర్నర్ థావర్‌చంద్ గహ్లోత్ శుక్రవారం ఉదయం సిద్ధరామయ్య రాజీనామాను ఆమోదించారు. తదుపరి సీఎం ఎంపిక వరకు ఆపద్ధర్మ సీఎంగా ఆయనే కొనసాగనున్నారు. కర్ణాటక ముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేసిన సిద్ధరామయ్య పలువురు సీనియర్ నేతలతో కలిసి గురువారం సాయంత్రం ఢిల్లీ వెళ్లారు. ఢిల్లీ పర్యటనలో భాగంగా కాంగ్రెస్ అగ్రనాయకులతో భేటీ కానున్నారు. కర్ణాటకలో తదుపరి ముఖ్యమంత్రి ఎంపిక, మంత్రివర్గ కూర్పుపై చర్చించే అవకాశాలు ఉన్నట్లు సమాచారం.

## సెక్స్ వర్కర్లపై దాడులు సరికాదు

– ఆధార్ కార్డులు ఇవ్వాలి : సుప్రీం కోర్టు స్పష్టీకరణ



**న్యూఢిల్లీ, మే 29 (ఆర్ఎన్ఎ):** స్వచ్ఛందంగా ప్రాస్టిట్యూషన్‌ను ఎంచుకోవడం, మానవ అక్రమ రవాణా బారినపడి సెక్స్ వర్క్‌లోకి దిగడం మధ్య స్పష్టమైన తేడా ఉందని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. ఇష్టపూర్వకంగా సెక్స్ వర్క్ చేసే వయోజనులను వేధించవద్దని పోలీసులకు ఆదేశాలు జారీ చేసింది. సెక్స్ వర్కర్లకు చట్టపరంగా సమాన రక్షణ ఉండాలని పేర్కొంది. దాడుల సమయంలో వారి గుర్తింపును వెల్లడించొద్దని మీడియాకు కూడా వార్నింగ్ ఇచ్చింది. దేశంలో మానవ అక్రమ రవాణాను అరికట్టేందుకు సమగ్ర మార్గదర్శకాలు జారీ చేసింది. స్వచ్ఛందంగా సెక్స్ వర్క్‌ను ఎంచుకున్న వారికి, మానవ అక్రమ రవాణా ముఠాల బారిన పడి ఈ రొంపిలో కూరుకుపోయిన బాధితులకు మధ్య తేడాను గుర్తించాలని సర్వోన్నత న్యాయస్థానం ఆదేశించింది. సొంత ఇష్టంతో సెక్స్ వర్క్ నిర్వహించే వయోజనులపై దాడులు చేయడం, క్రిమినల్ కేసులు పెట్టడం చట్టవిరుద్ధమని పేర్కొంది. రాజ్యాంగంలోని ఆర్టికల్ 21 ప్రకారం ప్రతి ఒక్కరికీ గౌరవంగా జీవించే హక్కు ఉందని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. కేవలం లైంగిక వృత్తిలో తల్లి ఉందనే ఏకైక కారణంతో ఆమె నుంచి బిడ్డను బలవంతంగా వేరు చేయలేరని కూడా సుప్రీం కోర్టు పేర్కొంది. రెస్క్యూ ఆపరేషన్ల సమయంలో సెక్స్ వర్కర్ల ఫోటోలు, మిగతా 2లో..

అత్యున్నత సత్యాలు, అభ్యాస యోగ్యాలై ఆచరించే సమాజమే శ్రేష్ఠమైన సమాజం. అనంతమైన ఓర్పు, అనంతమైన పవిత్రత, అనంతమైన పట్టుదల ఇవే సత్కర్మ సఫలమవటంలోని రహస్యాలు.

## నేటి మనదేశమ్ సంపాదకీయం

# కాలంతో పోరాడలేక చతికిల పడ్డ కమ్యూనిస్టులు


కేరళ సిఎంగా ఉండగానే పినరయ్ విజయ్‌పై ఆరోపణలు వచ్చాయి. కూతురికి లబ్ధి చేకూర్చేందుకు ప్రభుత్వ ధనం దుర్వినియోగం చేశారన్న అభియోగాలు వచ్చాయి. ఇందులో ఆనాటి నుంచే కేసు నడుస్తోంది. తాజాగా ఇప్పుడు ఇడి రంగంలోకి దిగడంతో ఇది కాంగ్రెస్, బిజెపిల కుట్ర అని, లెఫ్ట్ పార్టీని దెబ్బతీసే కుయుక్తి అంటూ విమర్శలు చేస్తున్నారు. చాలా విచిత్రంగా ఈ రెండు పార్టీలు కలుస్తాయా అన్నది కమ్యూనిస్టులే చెప్పాలి. మరో విషయమేమంటే ఎన్నికల సందర్భంగా రాహుల్ తన ప్రచారంలో బిజెపి లెఫ్ట్‌తో కుమ్మక్కయిందని ఆరోపించారు. కాంగ్రెస్– బిజెపి రెండూ కూడబలుక్కొని కేరళంలో సిపిఎం ప్రతిష్టను దెబ్బతీయటానికి బరి తెగించాయని విమర్శలు చేస్తున్నారు. ఎన్నికలకు ముందు ఇడి నోటీసులు ఇవ్వటంతో వ్యవహారం మొదలైంది. దేశంలో ప్రతిపక్ష పార్టీలపైనా, నాయకులపైనా అవినీతి ఆరోపణలు గుప్పించడం, ఆ తరువాత తన గుప్పిట్లో పెట్టుకున్న దర్యాప్తు సంస్థల చేత దాడులు చేయించడం కేంద్రంలోని మోడీ–షా ప్రభుత్వం చాలాకాలంగా అనుసరిస్తున్న విధానం అని దాదాపు అన్ని పార్టీలు చేస్తున్న ఆరోపణలే. ఢిల్లీలో అరవింద్ కేజ్రీవాల్, జార్ఖండ్‌లో హేమంత్ సోరెన్‌ల మీద సాగించిన దాష్టీకం, ఇందులో భాగమని సిపిఎం ఆరోపణ. అవినీతి పంకిలం అంటించి రాజకీయ లబ్ధి పొందాలనే బిజెపి కుట్రపూరిత వ్యూహం అత్యంత దిగజారుడుతనానికి నిదర్శనంగా ఇప్పుడు సిపిఎం ఆరోపిస్తోంది. కేరళంలో అధికారం కోల్పోయాక సిపిఎం బహుశా కనుమరుగైనట్లుగానే భావించాలి. కేరళంలో కొంత మిణుకుమిణుకుమంటున్నా,దేశంలోని అనేక రాష్ట్రాల్లో అసలు ఉనికి లేకుండా పోయింది. ముఖ్యంగా కమ్యూనిస్టులు నేలవిడిచి సాము చేయడం, పడికట్టు సిద్ధాంతాల నుంచి బయటపడక పోవడం, గతంలో లాగా పోరాటలకు దూరంగా ఉండడం వంటివన్నీ వారిని తుడిచిపెట్టేలా చేశాయి. కేరళంలో విజయన్ కుమార్తె నిర్వహణలోని సంస్థ అందించిన సేవల నిమిత్తం పొందిన ప్రతిఫలాన్ని వివాదాస్పదం చేసి, మనీ లాండరింగ్ సెక్షన్లు బనాయించిందన్నది సిపిఎం ఆరోపణగా ఉంది. రాహుల్ గాంధీ ఇంకో రెండడుగులు ముందుకేసి, పినరయి విజయన్‌ను ఎందుకు అరెస్టు చేయరంటూ ప్రశ్నించాడట. కేరళంలో అధికారంలోకి వచ్చిన మరు క్షణం నుంచి ఒకపక్క కాంగ్రెస్, మరోపక్క సంఘ్ పరివార్ శక్తులూ సిపిఎంపై దాడులకు తెగబడుతున్నాయన్న వాదనను సిపిఎం తెరపైకి తెచ్చింది. విజయన్ ఇంటిపై కుట్రపూరిత దాడుల గురించి తెలిసిన వెంటనే దేశమంతా వెల్లువెత్తిన నిరసనలే ఎర్రజెండా పట్ల ప్రజల నమ్మకానికి నిదర్శనం అంటోంది. నిజానికి ఈ కేసు చాలా చిన్నది. దీనిని కోర్టులో తేల్చుకోవచ్చు. కానీ అలా చేయడం లేదు. లెఫ్ట్ రాజకీయాలకు వస్తే బెంగాల్లో 35 ఏళ్లపాటు అధికారంలో ఉండి చేసిందేమీ లేదు. కేరళలోనూ ప ఎద్దగా అభివృద్ధి జరిగిన దాఖలాలు లేవు. తరిపురలోనూ అలాగే చేశారు. అందుకే ప్రజలు వీరిని ఇంటికి పంపించారు. ఈ దెబ్బతో దేశంలో ఇక లెఫ్ట్ పార్టీలకు కాలం చెల్లినట్లే. అభివృద్ధి చెందిన దేశాల్లో, అంటే సంపన్న, వలసవాద, పారిశ్రామిక దేశాల్లో కమ్యూనిస్టు భావజాలం అంతగా విస్తరించలేకపోయింది. వలస విముక్తి ఉద్యమాలు జోరందుకున్న లేదా నవస్వతంత్ర దేశాల్లో మాత్రం దండిగా మార్మోగింది. అలాంటి దేశాల్లో భారత్ మొదటి వరుసలో ఉంటుంది. సాంప్రదాయిక భావజాల ప్రతినిధి అయిన ఆర్ఎస్ఎస్ ఆవిర్భవించిన 1925లోనే కమ్యూనిస్టు పార్టీ ఊపిరిపోసుకుంది. ఆర్ఎస్ఎస్ కుటుంబానికి చెందిన బీజేపీ తన అధికారాన్ని పటిష్టపరచుకుంటున్న తరుణంలో కమ్యూనిస్టులు కనుమరుగైపోతుండటం ఓ వైచిత్రి. రాజ్యాంగం అమలులోకి వచ్చిన తర్వాత 1951 –52 నాటి తొలి ఎన్నికల్లో వారు గణనీయమైన విజయాలు సాధించారు. నల్గొండ నుంచి కమ్యూనిస్టు నేత రావి నారాయణరెడ్డి, తొలి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూను మించిన మెజారిటీ సాధించడం గురించి అప్పట్లో గొప్ప గా చెప్పుకొన్నారు. తాజాగా ఐదు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల ఫలితాల తర్వాత దేశంలో కమ్యూనిస్టుల పలుకుబడి అడుగంటిన సూచనలు కనిపిస్తు న్నాయి. సు మారు 50 ఏండ్లలో ఏ రాష్ట్రంలోనూ కమ్యూనిస్టు ప్రభుత్వం లేని పరిస్థితి వచ్చింది. కేరళలో పినరయి విజయన్ ప్రభుత్వ ఓటమి కీలక పరిణామమే. దీంతో దేశ రాజకీయాల్లో కమ్యూనిస్టుల శకం అంతరించినట్టేననే వ్యాఖ్యానాలు వినిపిస్తుండటం గమనార్హం. ఒకప్పుడు కమ్యూనిస్టులు ప్రజల కోసం ఉద్యమాలు చేసేవారు. ఇప్పుడా పరిస్థితులు లేకుండ పోయాయి. కేరళ తర్వాత బెంగాల్, త్రిపుర ఇలా మొత్తం మూడు రాష్ట్రాల్లో వామపక్ష ప్రభుత్వాలు సుదీర్ఘకాలం కొనసాగాయి. కానీ ఇప్పుడదంతా గత వైభ వం. మారిన పరిస్థితుల్లో దానిని తిరిగి రాబట్టుకోవడం అంత సులభం కాదని మాత్రం చెప్పవచ్చు. కేంద్రంలో కాంగ్రెస్ ఆధిపత్యం వీగిపోయి, సంకీర్ణ ప్రభుత్వాల కాలంలో కమ్యూనిస్టులు హస్తినలో మంత్రి పదవులూ చేపట్టారు. ఓ దశలో కమ్యూనిస్టు సీనియర్ నేత జ్యోతిబసును ప్రధాని పదవి చేపట్టే అవకాశమూ తలుపు తట్టింది. అంతటి ఉన్నతస్థితి నుంచి, నేడు ఏమాత్రం ప్రాముఖ్యం లేని స్థాయికి కమ్యూనిస్టులు పడిపోయారు. కేరళంలో తమను ఓడించిన కాంగ్రెస్‌తో తెలంగాణలో అంటకాగడం, ఒకటి రెండు స్థానాల కోసం వెంపర్లాడటం వారి దైన్యాన్ని కండ్లకు కడుతున్నది. భారత్‌లో పార్లమెంటరీ పంథాలో వెళ్లిన కమ్యూనిస్టులు కనుమరుగవుతుంటే, మరోవైపు సాయుధ పోరాటాన్ని ఎంచుకున్న కమ్యూనిస్టులు కగార్ ధాటికి నేలకొరుగుతున్నారు. కమ్యూనిస్టుల 'చారిత్రిక తప్పిదాలు', ప్రజల్లో పెరిగిన వినిమయతత్వం అందుకు దారితీశాయి అనేది అక్షరసత్యం. ప్రజలిప్పుడు డబ్బు సంపాదించటం, ఖర్చు పెట్టటం గురించి తప్ప విప్లవాలు, ఉద్యమాల గురించి ఎక్కువగా ఆలోచించటం లేదు. కాలం చెల్లిన వ్యూహాలు, ఎత్తుగడలూ కమ్యూనిస్టుల మహాప్రస్థానానికి బ్రేకులు వేశాయి. మొత్తంగా ఇప్పుడు కమ్యూనిస్టుల భవిష్యత్ ఏంటన్నది కాలమే చెప్పాలి. పినరయ్ విజయ్ లాంటి వారు కూతురుకు మేలు చేయడం కోసం అవినీతి బురద తొక్కడం కూడా కాల వైచిత్రమే.

# రెండ్రోజుల మహానాడు దిగ్విజయం

### స్త్రీ శక్తి థీమ్‌కు అర్థం చెప్పేలా 33 శాతం రిజర్వేషన్లు... విజయవంత చేసిన ప్రతి ఒక్కరికీ పేరుపేనా కృతజ్ఞతలు

### మహానాడు విజయవంతంపై మీడియాతో మంత్రి లోకేశ్

**అమరావతి, మే 29 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** తెలుగుదేశం పార్టీ రెండు రోజుల పాటు నిర్వహించిన మహానాడు 2026 విజయవంతంగా పూర్తయింది. ఈ నేపథ్యంలో ఆ పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు, మంత్రి నారా లోకేశ్ శుక్రవారం స్పందించారు. మహానాడు 2026 విజయవంతం కావడానికి కృషి చేసిన ప్రతి ఒక్కరికి పేరుపేరునా కృతజ్ఞతలు తెలియజేస్తున్నానని తెలిపారు. స్త్రీ శక్తి థీమ్‌కు అసలైన అర్థం చెప్పేలా మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ చేసిన తీర్మానానికి అందరి ఆమోదం లభించడం.. ఇది దేశవ్యాప్తంగా చర్చనీయాంశం కావడం ఈ మహానాడు సాధించిన మరో గొప్ప విజయం అని మంత్రి నారా లోకేశ్ అభివర్ణించారు. కార్యకర్తలే అధినేత నినాదాన్ని పార్టీ జాతీయ అధినేత అమలు చేసిన ఈ మహానాడు చరిత్రలో నిలిచిపోతుందన్నారు. రెండు రోజుల మహానాడుకు ఒక్క మైటీడీపీ యాప్‌లో 24.50 లక్షల డిజిటల్ అటెండెన్స్ నమోదు కావడం మరో రికార్డు అని తెలిపారు. తెలుగుదేశం పార్టీ నేతలు, కార్యకర్తలు, మహానాడు కమిటీలు, పార్టీ కార్యాలయ యంత్రాంగం, బ్యాక్ ఆఫీస్, సాంకేతిక సిబ్బంది, ఓజిఆఖ, ఎ÷ఆఖ, అనుబంధ సంఘాలు, మీడియా మిత్రులు, సోషల్ మీడియా అభిమానులు, ఎన్ఆర్ఐలు, మిత్రపక్షాలు, ప్రజలు, భద్రతా సిబ్బంది అందరికీ కృతజ్ఞతాభివందనాలు తెలిపారు. మహానాడు 2026 విజయం మీ అందరికీ అంకితం చేస్తున్నానని మంత్రి లోకేశ్ స్పష్టం చేశారు. ఇది మీ విజయం అని మంత్రి లోకేశ్ వెల్లడించారు. మీ కృషికి శిరస్సు వంచి



నమస్కరిస్తున్నానని చెప్పారు. తెలుగుదేశం పార్టీ కోట్లాది కుటుంబసభ్యుల ఆశీస్సులతో తాను టీడీపీ జాతీయ కార్యనిర్వాహక అధ్యక్షుడిగా ఎంపికైన తర్వాత జరిగిన తొలి మహానాడు ఇదని ఆయన వివరించారు. ఈ మహానాడు ఘన విజయం టీడీపీ టీం కృషి అని స్పష్టం చేశారు. సమష్టిగా పనిచేస్తే ఎన్ని అద్భుతాలు చేయగలమో టీడీపీ కుటుంబం నిరూపించిందని పేర్కొన్నారు. అంతర్జాతీయ ఉద్రిక్త పరిస్థితుల నేపథ్యంలో గౌరవ ప్రధాని నరేంద్ర మోదీ ఇచ్చిన పిలుపుతో నెల్లూరులో జరగాల్సిన మహానాడు 2026ను అందరి ఆమోదంతో హైబ్రిడ్ విధానంలోకి మార్చామని మంత్రి లోకేశ్ గుర్తు చేశారు. తెలుగుదేశం రాజకీయ పాఠశాలలో గురువు చంద్రబాబు నాయుడు సంక్షోభాలను అవకాశాలుగా మలచుకోవడం మనకు నేర్పారని చెప్పారు. ఆ నేర్పును ఇంటర్నేషనల్ క్రైసిస్‌లో కూడా ఎవరూ ఊహించని విధంగా హైబ్రిడ్ మహానాడును ఒక అవకాశంగా తీసుకుని విజయవంతం చేశారని సంతోషం వ్యక్తం చేశారు. గతంలో మాదిరి ఒకచోట జరిగే మహానాడుకు తెలుగు రాష్ట్రాల నుంచి టీడీపీ కుటుంబసభ్యులు తరలివచ్చేవారని పేర్కొన్నారు. తెలుగుదేశం నా బాధ్యత అంటూ ఇప్పుడూ ప్రతి పల్లె, ప్రతి ఇల్లూ మహానాడుకు వేదిక అయి.. పసుపు జెండాలతో రెపరెపలాడిందన్నారు. కార్యకర్తలే అధినేతలై.. నేతలే మార్గదర్శులై రాష్ట్రవ్యాప్తంగా 1875 క్లస్టర్ల బాధ్యతలను తామే తీసుకుని మహానాడు 2026ను కనివినీ ఎరుగనీ రీతిలో విజయవంతం చేశారని చెప్పారు.

## ఎట్టకేలకు వట్టిచెరుకూరు గ్రామ సమస్యకు పరిష్కారం

### మంత్రి అనగాని ప్రసాద్ చొరవతో దక్కిన ఊరట

**అమరావతి, మే 29 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** గుంటూరు జిల్లాలోని వట్టిచెరుకూరు గ్రామ సమస్యకు ఎట్టకేలకు పరిష్కారం లభించింది. ఏపీ రెవెన్యూ, రిజిస్ట్రేషన్, స్టాంప్స్ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ చొరవతో 120 ఏళ్లుగా కొనసాగుతున్న సమస్యకు చెక్ పెట్టారు. సిఎం చంద్రబాబు ఆదేశాల మేరకు అధికారులు సమగ్రంగా పరిశీలించి, శతాబ్ద కాలంగా 22ఏ నిషేధిత జాబితాలో ఉన్న గ్రామాన్ని ఆ జాబితా నుంచి తొలగించేందుకు చర్యలు చేపట్టారు. దీంతో గ్రామంలోని 515 కుటుంబాలకు భారీ ఊరట లభించింది. వివరాల్లోకి వెళితే.. క్రీ.శ.1134 నుంచే వట్టిచెరుకూరు గ్రామం ఉనికిలో ఉన్నట్లు వెల్లడైంది. 1931 నుంచే ఈ ఊరు గ్రామపంచాయతీగా కొనసాగుతూ వస్తోంది. గ్రామస్థులు అప్పటి నుంచే పన్నులు చెల్లిస్తున్నప్పటికీ, 2006లో జరిగిన ఆర్ఎస్ఆర్ నమోదులో పొరపాటున గ్రామాన్ని 'ఊరి ముందరి చెరువు'గా పేర్కొన్నారు. అనంతరం 2008లో రిజిస్ట్రేషన్ చట్టంలోని 22ఏ(1)(బి) కింద మొత్తం గ్రామాన్ని నిషేధిత జాబితాలో చేర్చారు. దీంతో గ్రామస్థులు తమ భూములను కొనుగోలు, విక్రయాలు చేయలేక ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత గ్రామస్థుల వినతిపై స్పందించిన మంత్రి అనగాని సత్యప్రసాద్, సమస్యను ప్రత్యేకంగా పరిశీలించాలని అధికారులను ఆదేశించారు. ఈ పరిశీలనలో గ్రామాన్ని పొరపాటున ఊరి ముందరి చెరువుగా నమోదు చేసినట్లు తేలింది. ప్రస్తుతం అక్కడ ఎలాంటి నీటి వనరులు లేవని నివేదికలో స్పష్టం చేశారు.

ఈ నేపథ్యంలో గ్రామ విస్తీర్ణంలో ఉన్న 25.37 ఎకరాలను గ్రామకంఠంగా ప్రకటిస్తూ, నిషేధిత జాబితా నుంచి తొలగించాలని రెవెన్యూ శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ నిర్ణయంతో గ్రామస్థులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ సందర్భంగా మంత్రి అనగాని సత్యప్రసాద్ మాట్లాడుతూ.. 'ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న అనేక రెవెన్యూ సమస్యలను ప్రభుత్వం దశలవారీగా పరిష్కరిస్తోంది. ప్రజలకు న్యాయం చేయడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యం' అని అన్నారు.

## అత్తను హత్య చేసిన కోడలు అరెస్ట్

**అనకాపల్లి, మే 29 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** అనకాపల్లి జిల్లా చోడవరం మండలం వెంకన్నపాలెం గ్రామంలో అత్త పాసలమ్మను హత్య చేసిన కేసులో నిందితురాలైన కోడలు నాగమణిని పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ మేరకు కేసుకు సంబంధించిన వివరాలను అనకాపల్లి ఏఎస్పీ శ్రావణి మీడియాకు వెల్లడించారు. నిందితురాలు వెంకన్న పాలెంలోని తన పుట్టింట్లో ఉండగా అరెస్ట్ చేసినట్లు చెప్పారు. నిందితురాలిని కోర్టులో హాజరుపరిచి రిమాండ్‌కు తరలించినట్లు ఏఎస్పీ తెలిపారు. అత్తను కర్రతో తీవ్రంగా కొట్టి చంపినట్లు ఏఎస్పీ పేర్కొన్నారు.

## హాస్టల్ భవనం నిర్మాణానికి వినతి

### ప్రభుత్వం దృష్టి కి తీసుకు వెళ్తానని ఎంపీ సానా సతీష్ బాబు హామీ

**కాకినాడ, మే 29 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** విజయవాడ తూర్పు నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే వంగవీటి రాధాకృష్ణ సూచన మేరకు వ రాయల్ సర్వీస్ ట్రస్ట్ నున్న గ్రామ పరిధిలో గ్రామీణ ప్రాంత పేద, మధ్యతరగతి విద్యార్థుల కోసం ప్రతిపాదించిన హాస్టల్ భవన నిర్మాణానికి అనుమతులు మంజూరు చేసేలా ప్రభుత్వానికి సిఫార్సు చేయవలసిందిగా కోరుతూఎంపీ సానా సతీష్ బాబు కు వినతిపత్రం సమర్పించారు. శుక్రవారం ఎంపీ నీ కలిసి సమస్య పరిష్కారానికి త్వరితగతిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ సందర్భంగా పేద విద్యార్థులకు విద్యా, వసతి సౌకర్యాలు కల్పిస్తూ సేవలందిస్తున్న ట్రస్ట్ సభ్యుల సేవలను ఎంపీ సతీష్ బాబు అభినందించారు. వారి వినతిపై సానుకూలంగా స్పందించి, తగిన చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. ఈ సమావేశంలో రాష్ట్ర శాసన సభ మాజీ ఉప సభాపతి బూరగడ్డ వేదవ్యాస్ మాజీ ఎమ్మెల్యే వంగవీటి రాధాకృష్ణ,ట్రస్ట్ సభ్యులు పెటేటి పుల్లయ్య , సీతాళం రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

# పోలవరం అడవుల్లో పులి సంచారం

### అధికారులను అప్రమత్తం చేసిన పవన్

**అమరావతి, మే 29 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** పోలవరం అడవుల్లో పులి సంచారం నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం అప్రమత్తమైంది. తిమ్మాపురం రిజర్వ్ ఫారెస్ట్ పరిధిలో పులి కదలికలు గుర్తించిన అధికారులు, పులి సమీప గ్రామాల వైపు సంచరిస్తోందని వెల్లడించారు. ఈ విషయంపై డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించారు. పులి కదలికలను నిరంతరం పర్యవేక్షించాలని, అవసరమైతే హనుమాన్ ప్రత్యేక బృందాలను రంగంలోకి దించాలని అధికారులను ఆదేశించారు. మనుషులు, పశువుల ప్రాణాలకు ఎలాంటి హాని కలగకుండా తక్షణ చర్యలు తీసుకోవాలని అటవీ శాఖకు స్పష్టం చేశారు. అవసరమైతే అదనపు హనుమాన్ బృందాలను పంపాలని కూడా సూచించారు. చికిలింత పంచాయతీ పరిధిలోని ఒక పశువుల పాకపై పులి దాడి చేయగా, ఈ ఘటనలో 9 దూడలు మృతి చెందినట్లు అధికారులు తెలిపారు. అలాగే అడవికి సుమారు 300 మీటర్ల దూరంలో ఉన్న ఆయిల్ ఫామ్ తోటలో కూడా పశువులపై దాడి జరిగినట్లు వెల్లడించారు. పులి సంచారంపై ఆధునిక సాంకేతికతతో నిఘా ఏర్పాటు చేయాలని పవన్ కల్యాణ్ సూచించారు. అటవీ సరిహద్దు గ్రామాల్లోఅప్రమత్తత కొనసాగించాలని, ప్రజలకు ఎప్పటికప్పుడు సమాచారం అందించాలని ఆదేశించారు. మొత్తం ఆపరేషన్‌పై స్వయంగా పర్యవేక్షణ చేయాలని, అవసరమైతే కేంద్ర కార్యాలయం నుంచి సీనియర్ అధికారిని ఘటనాస్థలికి పంపాలని పవన్ కల్యాణ్ పేర్కొన్నారు. వన్యప్రాణి సంరక్షణ నిబంధనలకు అనుగుణంగా చర్యలు తీసుకోవాలని ఆయన సూచించారు. పులి సంచారం ఉన్న గ్రామాల్లో అవగాహన శిబిరాలు నిర్వహించాలని, ప్రజలు అనవసరంగా అడవుల్లోకి వెళ్లకూడదని హెచ్చరించాలని అధికారులను ఆదేశించారు. అలాగే పశువులను అడవి సమీపంలో కట్టివేయకుండా రైతులకు సూచనలు ఇవ్వాలని చెప్పారు.

## ఉద్యోగిగా రైతులకు సేవలు అందించడం దేవుడు ఇచ్చిన గొప్ప వరం

### - మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి

**పుట్టపరి, మే 29 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** పుట్టపర్తి సాయి ఆరామంలో శుక్రవారం నిర్వహించిన బొల్లంపల్లి సుదర్శన్ పదవీ విరమణ ఆత్మీయ సన్మాన కార్యక్రమానికి మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఏపీ ఎంఐపీ ప్రాజెక్టు అధికారిగా బొల్లంపల్లి సుదర్శన్ రైతులకు విశిష్టమైన సేవలు అందించారని ప్రత్యేకంగా అభినందించారు. ప్రభుత్వ ఉద్యోగిగా సుమారు 36 సంవత్సరాల పాటు ప్రజలకు అంకితభావంతో సేవలందిస్తూ, ప్రజల్లోనూ, ప్రభుత్వ వర్గాల్లోనూ, జిల్లా ఉన్నతాధికారుల దృష్టిలోనూ మంచి పేరు సంపాదించుకున్నారని కొనియాడారు. ఒక ప్రభుత్వ ఉద్యోగిగా రైతులకు సేవ చేయడం దేవుడు ఇచ్చిన గొప్ప వరమని పేర్కొన్నారు. ఉద్యోగ జీవితంలో సుదీర్ఘకాలం విజయవంతంగా కొనసాగడానికి ఆయన కుటుంబ సభ్యుల సహకారం ఎంతో ముఖ్యమైందని తెలిపారు. ఈ సందర్భంగా సుదర్శన్ సతీమణికి, కుటుంబ సభ్యులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. భవిష్యత్తులో బొల్లంపల్లి సుదర్శన్ ఆయురారోగ్యాలతో కుటుంబ సభ్యులతో కలిసి ఆనందంగా జీవించాలని మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పలువురు అధికారులు, ప్రజాప్రతినిధులు, స్నేహితులు, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

## మహిళలకు 33% రిజర్వేషన్ పట్ల హర్షం

**కాకినాడ, మే 29 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** మహిళలకు 33శాతం రాజకీయ రిజర్వేషన్లు ప్రకటించడం పట్ల తెలుగు మహిళలు హర్షం వ్యక్తం చేశారు. కాకినాడజిల్లా తెలుగుదేశంపార్టీ కార్యాలయంలో టీడీపీలో మహిళలకు 33% సీట్లు కేటాయిస్తామని ప్రకటించిన జాతీయ అధ్యక్షుడు, మంత్రి నారా లోకేష్ కి కృతజ్ఞతలు తెలుపుతూ, జిల్లా మహిళా నేతల ఆధ్వర్యంలో "థాంక్యూ లోకేష్ అన్నా" కార్యక్రమం నిర్వహిశీచారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీలో అనాదిగా మహిళలకు ఎప్పుడూ సముచిత స్థానం కల్పించబడినదని, రాజకీయాల్లో కూడా 33శాతం అమలు చేయాలని మహానాడు తీర్మానించిందని హర్షం వ్యక్తం చేశారు. ఈసందర్భంగా ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ, మాజీ ఎమ్మెల్యే పిల్లి అనంతలక్ష్మి, అధికార ప్రతినిధి సుంకర పావని తిరుమల కుమార్, కలగా శివరాణి,అధిక సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.

# మొదటి పేజీ తరువాయి

## నీట్ పేపర్ లీక్ బాధ్యత ఎవరిది

లీకైందని ప్రశ్నించింది. యూపీఎస్సీలో ఇలాంటి ఉదంతాలు ఎప్పుడూ వెలుగుచూడలేదని సర్వోన్నత న్యాయస్థానం పేర్కొంది. యూపీఎస్సీని చూసి నేర్చుకోవాలని ఎన్టీఏకు సూచించింది. నీట్ వ్యవస్థ ప్రక్షాళనకు కేంద్రం ఏర్పాటు చేసిన హైలెవెల్ కమిటీ చైర్మన్, ఇస్రో మాజీ చీఫ్ డా. రాధాకృష్ణన్ కూడా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎన్టీఏ, డా. రాధాకృష్ణన్ దాఖలు చేసిన అఫిడవిట్‌లను సర్వోన్నత న్యాయస్థానం పరిశీలించింది. కేంద్రం తన ఎఫిడవిట్ దాఖలు చేసేందుకు న్యాయస్థానం అదనపు గడువు ఇచ్చింది. ఈ సందర్భంగా న్యాయమూర్తి జస్టిస్ నరసింహ మాట్లాడుతూ పేపర్ లీక్‌కు ఆస్కారం కల్పించిన పరిస్థితులు ఏమిటని డా. రాధాకృష్ణన్‌ను కోర్టు ప్రశ్నించారు. గతంలో అనేక రక్షణలను ఏర్పాటు చేసినా పేపర్ లీక్ ఎలా అయ్యిందని అన్నారు. ఇందుకు డా. రాధాకృష్ణన్ బదులిస్తూ పేపర్ సెట్టింగ్ పక్రియలో సమస్య ఉందని అన్నారు. ప్రస్తుతం ఆ లోపాలను సరిదిద్ది వ్యవస్థను మరింత బలోపేతం చేశామని అన్నారు. పరీక్ష నిర్వహణలో ఎలాంటి సమస్య తలెత్తకుండా గతంలో మొత్తం 101 సూచనలు చేశామని చెప్పారు. వాటిల్లో 60 తాత్కాలిక సూచనలను 2025–26 పరీక్ష కోసం ప్రత్యేకంగా రూపొందించినట్టు చెప్పారు. ఇతర మార్గదర్శకాలు కూడా త్వరలో పూర్తిస్థాయిలో అమలవుతాయని చెప్పారు. మరోసారి ఇలాంటివి జరగవని ధీమా వ్యక్తం చేశారు. సంస్కరణలే తమ లక్ష్యమని పేర్కొన్నారు. కేవలం సంస్కరణలతో పరిస్థితి చక్కబడదని కోర్టు వ్యాఖ్యానించింది. తప్పు జరిగినప్పుడు బాధ్యత ఎవరిదనే దానిపై స్పష్టత ఉండాలని పేర్కొంది. బాధ్యత ఎవరు తీసుకుంటారనేది తేల్చకుండా ఎన్ని కమిటీలు, మీటింగ్‌లు ఏర్పాటు చేసిన ఫలితం ఉండదని వ్యాఖ్యానించింది. ఇక ఈ అంశంపై సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా స్పందిస్తూ పేపర్ లీక్‌పై విచారణ జరుగుతోందని అన్నారు. జూన్ 21 నాటి పరీక్ష నిర్వహణ కోసం కొత్త వ్యవస్థలను ఏర్పాటు చేశామని అన్నారు. ప్రభుత్వం ఈ విషయాన్ని సీరియస్‌గా తీసుకుందని చెప్పారు. ప్రధాని స్వయంగా ఈ అంశాన్ని పర్యవేక్షిస్తున్నారని కోర్టుకు తెలిపారు.

## వేస్ట్ టు ఎనర్జీ' ప్లాంట్ల విస్తరణ

రూ.9.45 కోట్లతో ఉన్నతీకరిస్తోంది. మొత్తం ఐదు ప్లాంట్ల ప్రాసెసింగ్ సామర్థ్యం రోజుకు 125 టన్నులు. ప్రతి యూనిట్‌ను రోజుకు 25 టన్నుల సామర్థ్యంతో రూపకల్పన చేశాం. ఒక్కో నూతన ప్లాంట్‌కు రూ.12.60 కోట్ల వ్యయం అవుతుందని అంచనా. ఇందుకు కేంద్రం, రాష్ట్రం, పట్టణ స్థానిక సంస్థలు, ప్రైవేట్ డెవలపర్లు నిధులు సమకూర్చనున్నారు. పురపాలక వ్యర్థాలను స్వచ్ఛమైన శక్తిగా మార్చడమే ప్రభుత్వ లక్ష్యం. పట్టణ వ్యర్థాల నిర్వహణలో విప్లవాత్మక మార్పు తీసుకొస్తాం. సుస్థిర వ్యర్థాల నిర్వహణ, స్వచ్ఛమైన ఇంధన ఉత్పత్తి దిశగా కీలక అడుగు వేశాం. డంపింగ్ యార్డుల భారాన్ని తగ్గించేందుకు సీబీజీ ప్లాంట్లు దోహదపడతాయి. పట్టణ ఇంధన భద్రతను బలోపేతం చేసే ప్రాజెక్టుగా సీబీజీ ప్లాంట్లు ఉపయోగపడతాయి. దీర్ఘకాలిక పర్యావరణ, ఆర్థిక సుస్థిరతకు ఈ ప్రాజెక్ట్ భరోసా ఇస్తుంది. స్వచ్ఛాంధ్ర లక్ష్య సాధనలో భాగంగా సీబీజీ ప్లాంట్లు ఏర్పాటు చేస్తున్నాం. వ్యర్థాల నుంచి సంపద సృష్టించడమే కూటమి ప్రభుత్వ విధానం' అని మంత్రి పేర్కొన్నారు.

## మాజీమంత్రి గాదె వెంకట్‌రెడ్డి కన్నుమూత

నుండి పోటీ చేసి తొలిసారి ఎమ్మెల్యేగా గెలిచాడు. ఆ తరువాత 1972లో కాంగ్రెస్ అభ్యర్థిగా.. 1978లో జనతా పార్టీ అభ్యర్థిగా పోటీ చేసి రెండు సార్లు మద్దుకూరి నారాయణ రావుపై ఓడిపోయారు. 1983, 1985,1989 ఎన్నికల్లో వరుసగా ఓటమి చవిచూశారు. తిరిగి 1991 ఉప ఎన్నికల్లో అలాగే 1994 సార్వత్రిక ఎన్నికల్లో పరుచూరు ఎమ్మెల్యేగా విజయం సాధించారు. నేదురుమల్లి జనార్ధనరెడ్డి, కోట్ల విజయభాస్కరరెడ్డి మంత్రివర్గంలో మంత్రిగా పనిచేశాడు. 1999లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి పాలయ్యారు. 2004, 2009 అసెంబ్లీ ఎన్నికల్లో బాపట్ల నుంచి ఎమ్మెల్యేగా గెలిచి వైఎస్ రాజశేఖర్ రెడ్డి, కొణిజేటి రోశయ్య మంత్రివర్గంలో దేవాదాయ శాఖ మంత్రిగా పనిచేశాడు. ఆంధ్రప్రదేశ్ విభజన తరువాత జరిగిన 2014 ఎన్నికల్లో ఆయన పోటీ చేయలేదు. సుదీర్ఘకాలం పాటు కాంగ్రెస్?లో పని చేసిన ఆయన 2016 ఏప్రిల్ 29ను హస్తం పార్టీకి వీడ్కోలు పలికి టీడీపీలో చేరారు. నాలుగేండ్ల తర్వాత టీడీపీకి రిజైన్ చేసి 2020 మార్చి 16న వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరాడు. వయోభారం, అనారోగ్య సమస్యతలతో గత కొద్ది రోజులుగా ఆయన క్రియాశీల రాజకీయాలకు దూరంగా ఉంటున్నారు.

## సెక్స్ వర్కర్లపై దాడులు సరికాదు

వీడియోలు ప్రసారం చేయడం నేరమని పేర్కొంది. నివాస ధ్రువీకరణ పత్రాలు లేకపోయినప్పటికీ సెక్స్ వర్కర్లందరికీ తక్షణమే ఆధార్ కార్డులు జారీ చేయాలని కూడా ఆదేశించింది. స్వచ్ఛందంగా ఈ మార్గాన్ని ఎంచుకున్న వారిని వదిలి, మహిళలు, మైనర్లను అక్రమ రవాణా చేసే మాఫియాపై కఠిన చర్యలు తీసుకోవాలని కూడా సుప్రీం కోర్టు ఆదేశించింది.

## తిరుపతి జిల్లా

## ఎండ తీవ్రత తగ్గించేలా తివాచీ



**శ్రీకాళహస్తి,మే 29 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** వాయు లింగేశ్వరుడి దర్శనార్థం వచ్చే భక్తులకు ఎండ తీవ్రతకు ఉపశమనం కల్పించే విధంగా ఆలయ అధికారులు ఏర్పాట్లు చేపట్టారు. ముసు పెన్నడూ లేని విధంగా తేరు వీధి పొడవునా ఓవైపు తివాచీని అందుబాటులోకి తీసుకువచ్చారు. ఎక్కువమంది భక్తులు పాదరక్షలు, లగేజీలు కౌంటర్లల్లో పెట్టి ఈ రోడ్డు లోనే వెళ్తుంటారు. అలాంటి భక్తులకు కాళ్లు కాలకుండా ఉండేందుకు వీలుగా ఈ ఏర్పాట్లు చేశారు. నీటితో తడు పుతున్నారు. భక్తులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

## స్వయం సహాయక సంఘాలకు రుణాలు సకాలంలో మంజూరు చేయాలి

**-జిల్లా జాయింట్ కలెక్టర్**

**తిరుపతి,మే 29 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** వార్షిక జీవనోపాధి ప్రణాళిక ప్రకారం డిజిటల్ ఎం సి పి ద్వారా స్వయం సహాయక సంఘాలకు రుణాలు మంజూరు చేయాలని జిల్లా జాయింట్ కలెక్టర్ ఆర్ గోవిందరావు బ్యాంకర్లను ఆదేశించారు.శుక్రవారం స్థానిక జిల్లా కలెక్టరేట్లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ లో జరిగిన జిల్లా స్థాయి బ్యాంకర్స్ కమిటీ సమావేశంలో చైర్మన్ హోదాలో జిల్లా జాయింట్ , ఆర్బిఐ ఎల్డీఓ రవీంద్ర బాబు,నాబార్డ్ డీడీఎం చంద్రశేఖర్, ఎల్డీఎం గుంటూరు రవి కుమార్, యూనియన్ బ్యాంక్ రీజినల్ హెడ్ సామంచి శర్మ ,వివిధ బ్యాంకు అధికారులుతో కలిసి సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ వార్షిక జీవనోపాధి ప్రణాళిక ప్రకారం డిజిటల్ ఎం సి పి ద్వారా స్వయం సహాయక సంఘాలకు రుణాలు మంజూరు చేయాలని,తిరుపతి జిల్లాలో పలు విశ్వవిద్యాలయాలు ఉన్నాయని, విద్యకు సంబంధించిన రుణాల విషయంలో ప్రత్యేక ప్రాధాన్యతగా రుణాలు మంజూరు చేయాలని తెలిపారు.అన్ని విద్యాలయాల్లో విద్యా రుణాలకు సంబంధించిన ప్రత్యేక అవగాహన కార్యక్రమాలను నిర్వహించాలని.రుణాల మంజూరు శాతం పెంచాలన్నారు.పి ఎం జి పి పథకం రుణాలు మంజూరైన యూనిట్లు అన్ని గ్రౌండింగ్ అయ్యే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు.కొన్ని ప్రైవేటు బ్యాంకులు రుణాల మంజూరు విషయంలో వెనకబడి ఉన్నాయని ఎలాంటి జాప్యం చేయకుండా రుణాలు మంజూరు చేయాలన్నారు.బ్యాంకర్లందరూ రుణాల మంజూరు లో నిర్దేశించబడిన లక్ష్యాలను అందిపుచ్చు కోవాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వము ఎన్టీఆర్ భరోసా పథకమును ప్రాధాన్యతగా తీసుకుంటుందని, ఎన్టీఆర్ భరోసా పెన్షన్ పంపిణీ కి సంబంధించి బ్యాంకర్లు ఎలాంటి అలసత్వం లేకుండా నగదు సకాలంలో అందేలా చూడాలన్నారు. జిల్లాలో ఫైనాన్షియల్ లిటరసీ కార్యక్రమంలో భాగంగా డిజిటల్ లావాదేవీల పై ప్రజలకు అవగాహన కల్పించేలా ప్రత్యేక శిబిరాలను నిర్వహించాలని తెలిపారు. ఈ సమావేశంలో సంబంధిత జిల్లా అధికారులు, బ్యాంక్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## నివాస గృహాల మధ్య గోవధ

**- ఆగ్రహించిన జనం - పోలీసులకు ఫిర్యాదు**

**మదనపల్లె,మే 29 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** మదనపల్లె నివాసగృహాల మధ్యనే విచ్చలవిడిగా గోవధకు పాల్పడడం తీవ్ర కలకలం రేపింది. గతంలో ఎన్నడు లేని విధంగా పట్టణ నడిబొడ్డున నివాసగృహ సముదాయాల మధ్యనే కొందరు గోవులను వధించడంతో స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేశారు. విశ్వహిందూ పరిషత్, బీజేపీ, టిడిపి, జనసేన నాయకులకు సమాచారం అందించారు.వారు వెంటనే వన్ టౌన్ పోలీసులను వెంటబెట్టుకొని స్థానిక శాస్త్రి వీధికి చేరుకొన్నారు. గోవధకు పాల్పడ్డ వారిని అదుపులోకి తీసుకుని పోలీస్ స్టేషన్ కు తరలించారు. అనంతరం మోతి నగర్ లోని ఓరి ఇంటిలో గోవధ జరుగుతోందని తెలిసి పెద్ద ఎత్తున అక్కడికి చేరుకున్నారు. అప్పటికే అక్కడ ఓ వర్గం వారు గోవును వధించి ఉండడంతో స్వల్ప ఉద్రిక్త వాతావరణం చోటుచేసుకుంది. విషయం తెలుసుకున్న పోలీసులు అక్కడికి చేరుకొని పరిస్థితిని అదుపులోకి తీసుకొచ్చారు. అలాగే గోవధ పాల్పడిన వారిని అదుపులోకి తీసుకొని పోలీస్ స్టేషన్ కు తరలించారు.ఈ సందర్భంగా విశ్వహిందూ పరిషత్, ఆర్ ఎస్ స్ , బిజెపి, టిడిపి నేతలు మాట్లాడుతూ... గతంలో ఊరికి దూరంగా గోవధ చేసే వారిని. నేడు గతంలో ఎన్నడూ లేని విధంగా ఇలా చేయడం ఒక వర్గం వారిని రెచ్చగొట్టే విధంగా వుందని ఆరోపించారు. భవిష్యత్తులో మళ్లీ ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చూడాలని ఉన్నతాధికారులను కోరారు.

## రుతు పరిశుభ్రతపై అవగాహన



**రేణిగుంట, మే 29 (నేటి మన దేశమ్ ప్రతినిధి) :** రేణిగుంట మండల వైద్యాధికారి డాక్టర్ చక్రపాణి ఆదేశాల మేరకు హెల్త్ సూపర్వైజర్ కామరాజు ఆరోగ్య సిబ్బందితో కలిసి రేణిగుంటలోని వేణుగోపాలపురంలో మహిళలు, యుక్తవయస్సు బాలికల కోసం ప్రపంచ ఋతు పరిశుభ్రత దినోత్సవం సందర్భంగా అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా హెల్త్ సూపర్వైజర్ కామరాజు మాట్లాడుతూ ప్రతి సంవత్సరం మే 28న ప్రపంచ ఋతు పరిశుభ్రత దినోత్సవాన్ని నిర్వహిస్తారని తెలిపారు. ఋతుస్రావం అనేది యుక్తవయస్సు నుంచి మహిళలలో సహజంగా జరిగే జీవ ప్రక్రియ అని, ఈ సమయంలో వ్యక్తిగత పరిశుభ్రత పాటించడం అత్యంత అవసరమని పేర్కొన్నారు. ఋతుచక్ర సమయంలో శానిటరీ ప్యాడ్లు లేదా మెన్స్ట్రువల్ కప్పులను ప్రతి ఆరు గంటలకు ఒకసారి మార్చాలని, జననేంద్రియాలను రోజుకు కనీసం రెండుసార్లు శుభ్రం చేసుకోవాలని సూచించారు. సువాసన సబ్బులు, రసాయన ఉత్పత్తులను ఉపయోగించరాదని, గాలి బాగా ఆడే పత్తి లోదుస్తులు ధరించడం మంచిదని తెలిపారు. వాడిన ప్యాడ్లను కాగితంలో చుట్టి చెత్తబుట్టలో వేయాలని, మరుగుదొడ్లలో వేయరాదని సూచించారు. అలాగే గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ నివారణకు హెచ్పీవీ టీకా ప్రాముఖ్యతను వివరించారు. పోషకాహారం తీసుకోవడం, తగిన విశ్రాంతి, పరిశుభ్రత పాటించడం ద్వారా అనేక ఆరోగ్య సమస్యలను నివారించవచ్చని చెప్పారు. మహిళలు, బాలికలలో ఋతుస్రావంపై ఉన్న అపోహలు, సామాజిక కళంకాలను తొలగించడం, పరిశుభ్రతపై అవగాహన పెంపొందించడమే ఈ దినోత్సవ ప్రధాన ఉద్దేశమని తెలిపారు. ప్రభుత్వం మరియు వైద్య ఆరోగ్య శాఖలు గ్రామీణ ప్రాంతాల్లో శానిటరీ నాప్కిన్ల లభ్యత, వాటి సురక్షిత పారవేత కోసం వివిధ కార్యక్రమాలు అమలు చేస్తున్నాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎన్ఎం లోహిత, ఆశా కార్యకర్తలు లక్ష్మీప్రసన్న, శశిరేఖతో పాటు మహిళలు, యుక్తవయస్సు బాలికలు పాల్గొన్నారు.

## హాకీ టోర్నమెంట్ ప్రారంభించిన కమిషనర్




**గూడూరు, మే 29 (నేటి మన దేశమ్ ప్రతినిధి) :** గూడూరు పట్టణం లోని అల్లూరు ఆదిశేషారెడ్డి ప్రభుత్వ స్టేడియంలో జరుగుతున్న ఎమ్మెల్యే కప్ 2026 లో భాగంగా ముఖ్య అతిథిగా వచ్చిన కమీషనర్ మాట్లాడుతూ ఎమ్మెల్యే సునీల్ కుమార్ స్నేహితుల ఆధ్వర్యంలో జరుగుతున్న ఎమ్మెల్యే కప్ 2026 ను మొదటి రోజు మన జాతీయ క్రీడ హాకీ తో ప్రారంభించడం మంచి పరిణామమని ఎమ్మెల్యే స్టేడియంలో చేసిన అభివృద్ధికి కృతజ్ఞతగా వారి స్నేహితులందరూ ఐదు రోజులపాటు క్రీడా పోటీలు నిర్వహించడం ఒక ప్రత్యేకమైనదని ఎమ్మెల్యే మీద వారికున్న అభిమానాన్ని, గౌరవాన్ని తెలుపుతుందని చెప్పారు. అదేవిధంగా క్రీడాకారులందరూ క్రమశిక్షణతో ఆడాలని ఎమ్మెల్యే మనందరి కోసం అభివృద్ధి చేసిన ఈ స్టేడియాన్ని అందరం కాపాడుకోవాల్సిన బాధ్యత కూడా మన అందరి మీద ఉందని తెలిపారు. ఎమ్మెల్యే స్నేహితులు జరిపే కార్యక్రమంలో నన్ను కూడా భాగస్వామిని చేసినందుకు అందరికీ ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వేగూరు రాజేంద్రప్రసాద్, రజనీకాంత్, శనగ మస్తాన్, సుమన్ రెడ్డి , సుబ్రహ్మణ్యం, హాకీ కోచ్ దీపక్, సునీల్ తదితరులు పాల్గొన్నారు.

## ఆరోగ్యకర పట్టణం కోసం కంకణబద్ధులవుదాం


**- మున్సిపల్ మేనేజర్ ఉరుకుందమ్మ**



**నాయుడుపేట,మే 29 (నేటి మన దేశమ్ ప్రతినిధి) :**నాయుడుపేట ఆరోగ్యకరమైన పట్టణ నిర్మాణం కోసం అందరూ కంకణబద్ధు లవుదామని మున్సిపల్ మేనేజర్ ఉరుకుందమ్మ పిలుపునిచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'ఆపరేషన్ క్లీన్ స్వీప్ – ఒక రాష్ట్రం, ఒక పరిశుభ్రత లక్ష్యం' కార్యక్రమాన్ని శుక్రవారం ఉదయం నిర్వహించారు.మున్సిపల్ మేనేజర్ ఉరుకుందమ్మ ఆధ్వర్యంలో గడియారం సర్కిల్ నుంచి ప్రారంభమైన ఈ కార్యక్రమశీ పట్టణంలోని ప్రధాన వీధుల మీదుగా ర్యాలీ కొనసాగింది. అలాగే మున్సిపల్ కార్మికులు వీధులను శుభ్రం చేయడంతో పాటు, మురుగు కాలువల్లో పేరుకుపోయిన పూడికను తొలగించి, సేకరించిన చెత్తను మున్సిపల్ వాహనాల ద్వారా తరలించారు.ఈ సందర్భంగా మేనేజర్ ఉరుకుందమ్మ మాట్లాడుతూ స్వచ్ఛమైన ఆరోగ్యకరమైన పట్టణ నిర్మాణానికి ప్రజల భాగస్వామ్యం అత్యంత ఆవశ్యకమని పేర్కొన్నారు. ప్రజలు చెత్తను రోడ్ల మీద వేయకుండా నిర్దేశిత ప్రదేశాల్లోనే వేయాలని, తడి––పొడి చెత్తను వేర్వేరుగా వేరు చేసి మున్సిపల్ సిబ్బందికి అందించాలని కోరారు. వర్షాకాలం సమీపిస్తున్న నేపథ్యంలో వ్యాధులు ప్రబలకుండా వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాలను కూడా పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. 'ఆపరేషన్ క్లీన్ స్వీప్'లో భాగంగా పట్టణంలోని అన్ని వార్డుల్లో మురుగు కాలువల శుభ్రతను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేస్తామని, నాయుడుపేటను పరిశుభ్రంగా, అందంగా తీర్చిదిద్దేందుకు మున్సిపాలిటీ కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. ఇందుకు ప్రజలు సహకరించాలని ఆమె కోరారు. కార్యక్రమంలో సచివాలయ, మున్సిపల్ సిబ్బంది వర్క్ ఇన్స్పెక్టర్ రవి, లీలా మోహన్, పెంచుల ప్రసాద్, శ్రీనివాసులు, రాజా, నాగార్జున, రాజేంద్ర, ప్రజారోగ్య శాఖ మేస్త్రీ లు రవీంద్ర, సురేష్ , శీనయ్య, వేణుగోపాల్, మున్సిపల్ కార్మికులు, పుర ప్రజలు పాల్గొన్నారు.

## వేర్వేరు చోరీ కేసుల్లో నిందితుడు గోవర్ధన్ రెడ్డి అరెస్టు

**- 23 గ్రాముల బంగారం,30 గ్రాముల వెండి,ఒకద్విచక్ర వాహనం స్వాధీనం**



**సత్యవేడు,మే 29 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** సత్యవేడు మండలం, కాలమ నాయుడుపేట పంచాయతీ, గాంధీపురంలో చోటు చేసుకున్న చోరీతోపాటు, నాగలాపురం మండలం కారని, నాగలాపురం చోరీ కేసులకు సంబంధించి నిందితుడైన యువకుడు గోవర్ధన్ రెడ్డిని(23) స్థానిక పోలీసులు అరెస్టు చేశారు.సత్యవేడు పోలీస్ స్టేషన్లోనూ, నాగలాపురం పోలీస్ స్టేషన్లోను,నమోదైన చోరీ కేసుల్లో నిందితుడు గోవర్ధన్ రెడ్డి నుంచి 23 గ్రాముల బంగారం,30 గ్రాముల వెండి,ఒక ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు.శుక్రవారం స్థానిక పోలీస్ స్టేషన్లో ఎస్సై సాయినాథ్ చౌదరి,లావణ్య ఆధ్వర్యంలో నిందితున్ని మీడియా ముందు ప్రవేశపెట్టారు.ఎస్సై సాయినాథ్ చౌదరి కథనం మేరకు వివరాలు ఇలా..సత్యవేడు మండలం, కాలమ నాయుడుపేట పంచాయతీ, గాంధీపురంలో నివసిస్తున్న హిమజ వర్మ ఇంటిలో మే 17వ తేదీన పగలు సమయంలోనే చోరీచోటు చేసుకుంది. దీనిపై ఫిర్యాదు అందడంతో మే 18వ తేదీన కేసు నమోదు చేశారు. స్థానిక సిఐ మురళి నాయుడు సూచన మేరకు దర్యాప్తు ప్రారంభించారు.ఇందులో భాగంగా పట్టణంలోనని చెన్నై మార్గంలో మే 28వ తేదీన వాహనాలు తనిఖీ చేస్తుండగా అనుమానితుడ్ని అదుపులోకి తీసుకొని విచారించగా అసలు విషయం బయటపడింది.ఈ నేపథ్యంలోనే గాంధీ పురం చోరీకి సంబంధించి నేరం చేసినట్టు విచారణలో తేలడంతో అనుమానుతున్ని అరెస్ట్ చేశారు.మధనంబేడు గ్రామానికి చెందిన మణి కుమారుడు,గోవర్ధన్ రెడ్డిగా గుర్తించామన్నారు. ఇదేగాక నాగలాపురం పట్టణంలో ఒక ద్విచక్ర వాహనాన్ని,కారని గ్రామంలో ఇంట్లో చొరబడి మూడు గ్రాముల బంగారు చోరీకి నిందితుడు గోవర్ధన్ రెడ్డి పాల్పడినట్టు విచారణలో తేలింది.ఈ క్రమంలో నిందితుడి నుంచి నాలుగు లక్షల 50 వేల రూపాయలు విలువ చేసే బంగారం,వెండితోపాటు,హీరో హోండా ఫ్యాషన్, మోటార్ సైకిల్ను స్వాధీనం చేసుకున్నారు. గత రెండేళ్లుగా నిందితుడు గోవర్ధన్ రెడ్డి వేర్వేరు ప్రాంతాల్లో చోరీకి పాల్పడ్డారు.ఇప్పటికే తమిళనాడు, పాదర్వేడు,శ్రీసిటీ, మధనంబేడు, విఆర్ కండ్రిగ వంటి ప్రాంతాల్లో చోరీకి సంబంధించి గత ఏడాది నిందితుడు గోవర్ధన్ రెడ్డి జైలుకు వెళ్లి వచ్చారు. అతని పై పై ఐదు చోరీ కేసులు నడుస్తుండగా తాజాగా మరో మూడు కేసులు నమోదు అయ్యాయి.జైలుకు వెళ్లడం, జైలు నుంచి బయటకు రాగానే యధావిధిగా చోరీలకు పాల్పడడం గోవర్ధన్ రెడ్డికి షరా మామూలుగా మారింది.గంజాయి వినియోగం,మద్యం సేవించడం వంటి దురఅలవాట్లకు బానిస కావడంతో ఒంటరిగానే చోరీలకు పాల్పడుతున్నట్టు ఈ సందర్భంగా ఎస్ఐ సాయినాథ్ చౌదరి చెప్పారు. ఉన్నతాధికారి దృష్టికి తీసుకెళ్లి నిందితుడు గోవర్ధన్ రెడ్డి పై పీడీ యాక్ట్ అమలు చేయడానికి ప్రయత్నిస్తామన్నారు. అయితే ఎవరైనా సరే ఊరుకు వెళ్ళేటప్పుడు స్థానిక పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు.దీంతోపాటు ఆర్థిక స్థోమత ఉన్న వారందరూ ఇంటి లోపల బయట సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని కోరారు.ఏదైనా అత్యవసరం అనిపిస్తే 112 కు ఫోన్ చేయాలని ఆయన పేర్కొన్నారు.నిందితుడు గోవర్ధన్ రెడ్డిని చిత్తూరు కోర్టులో ప్రవేశపెట్టి రిమాండ్ కు తరలిస్తున్నట్టు ఆయన వివరించారు. నిందితుణ్ణి పట్టుకున్న అధికారులను జిల్లా పోలీసు ఉన్నతాధికారులు అభినందించారు.

## అట్టహాసంగా 'బడి పిలుస్తోంది'




**వరదయ్యపాలెం,మే 29 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య అందుతుందని ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం స్పష్టం చేశారు. వరదయ్యపాలెం జిల్లా పరిషత్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శుక్రవారం నాడు నిర్వహించిన బడి పిలుస్తోంది కార్యక్రమం అట్టహాసంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యేకు విద్యార్థులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు ఘన స్వాగతం పలికారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో నిష్ణాతులైన ఉపాధ్యాయులు సేవలందిస్తున్నారని, వారు బోధించే విద్య విద్యార్థుల భవిష్యత్తుకు బలమైన పునాది వేస్తోందని పేర్కొన్నారు. ప్రభుత్వం విద్యార్థులకు నాణ్యమైన మధ్యాహ్న భోజనం, ఉచిత పాఠ్య పుస్తకాలు, ఆటవస్తువులు తదితర సదుపాయాలను అందిస్తోందని తెలిపారు. అలాగే "తల్లికి వందనం" పథకం ద్వారా ప్రతి పేద విద్యార్థికి ఏటా రూ.15 వేల ఆర్థిక సహాయం అందజేస్తూ ప్రభుత్వం విద్యాభి వృద్ధికి ప్రాధాన్యత ఇస్తోందన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో లభిస్తున్న అన్ని అవకాశాలను తల్లిదండ్రులు సద్విని యోగం చేసుకొని తమ పిల్లలను ప్రభుత్వ బడుల్లో చేర్పించి వారి బంగారు భవిష్యత్తును నిర్మించాలని ఎమ్మెల్యే కోరారు.ఈ సందర్భంగా పదవ తరగతిలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులను ఎమ్మెల్యే ప్రశంసాపత్రాలు అందజేసి ఘనంగా సత్కరించారు. అనంతరం బడి పిలుస్తోంది ప్రచార వాహనాన్ని పచ్చ జెండా ఊపి ప్రారంభించారు. ఉపాధ్యాయులతో కలిసి ఇంటింటికి వెళ్లి తల్లిదండ్రులను ప్రభుత్వ పాఠశా లల్లో పిల్లలను చేర్పించాలని అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి కెవిన్ కుమార్ వరదయ్యపాలెం ఎమ్మార్వో సుదీర్, ఎంపీడీవో, ఎంఈఓ సరస్వతి, స్థానిక ఎస్సై మల్లికార్జున నాయుడు,ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు, అధికారులు, ప్రజాప్రతినిధులు, కూటమి పార్టీల నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

## పదిపుట్లబైలు రైతులు హర్షం

**చంద్రగిరి,మే 29 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** చంద్రగిరి నియోజకవర్గం, పాకాల మండలంలో సగటున ఒక గ్రామంలో ఉన్న భూ సమస్యలను పరిష్కరించేందుకు 'ఒక నెల,ఒక గ్రామం,నాలుగు దఫాలుగా గ్రామ సందర్శనలో భాగంగా పదిపుట్ల బైలు పంచాయతీ రైతు సేవా కేంద్రంలో గ్రామ రైతులు తో గ్రామ సభ నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమం పాకాల తహశీల్దార్ ఎ.శివరాం సుబ్బయ్య ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయనమాట్లాడుతూ నాలుగో సందర్శనలో భాగంగా సదరు గ్రామ సభలో ఇదివరకే మూడు దపాలలో సదరు కార్యక్రమంలో స్వీకరించిన అర్జీలకు సంబంధించి పరిష్కారం చూపడం జరిగినదని తెలిపారు. ప్రజలు తమ సమస్య లకు సంబంధించి పరిష్కారం లభించినందున సదరు రైతులు హర్షం వ్యక్తం చేశారు.ఒక నెల,ఒక గ్రామం కార్యక్రమంలో భాగంగా రెవెన్యూ అధికారులు తహశీల్దార్,రెవెన్యూ ఇన్స్పెక్టర్,మండలసర్వేయర్,ఎంపీడీఓ,జలవనరులు,పంచాయతీరాజ్,గ్రామీణాభివృద్ధి శాఖలఇంజనీర్లు, అటవీ,దేవదాయ శాఖల అధికారులు బృందంలో సభ్యులుగా ఉండి,ఒక నెలలో నాలుగు దఫాలుగా అధికారుల బృందం మండలంలో ఓ గ్రామానికి వెళ్లి సమస్యలు పరిష్కారానికి కృషి చేశారు. ఈ కార్యక్రమం లో ఆర్.ఐ వినోద్ రాయ్,వి.ఆర్.ఓ వి.వెంకట రాజేష్,సర్వేయర్ డి.దామోదర్, రైతులు పాల్గొన్నారు.

## వేసవి శిబిరం




**తొట్టంబేడు, మే 29 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో కిశోర వికాసం వేసవి శిబిరం కార్యక్రమం తొట్టంబేడు బీడీకాలనీ నందు శ్రీకాళహస్తి ఐసిడిఎస్ సిడిపిఓ శాంతి దుర్గ ఆధ్వర్యంలో కిశోర వికాసం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ గ్రామం నందు విద్యకు దూరమైన మహిళలకు విద్య యొక్క విలువ తెలిసే విధంగా అవగాహన కల్పించారు.. శాంతిదుర్గ చెప్పిన అవగాహన వల్ల అక్కడున్న గ్రామ మహిళలు ఇకపై తాము ఉన్నత విద్యలు చదువుకునే విధంగా కార్యాచరణ చేపడతా మని ఐసిడి సిడిపిఓ శాంతి దుర్గకు హామీని ఇచ్చారు.ఈ సందర్భంగా శ్రీకాళహస్తి ఐసిడిఎస్ సిడిపిఓ శాంతి దుర్గ మాట్లాడుతూ యుక్త వయసు బాలికలు ఈ వేసవి ప్రత్యేక శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కిషోర్ బాలికలు వేసవి ఎండల్లో బయట తిరగకుండా తమ సమయాన్ని వృధా చేసుకోకుండా ఈ శిబిరాలలో అంగన్వాడీ కార్యకర్తలతో కలిసి చర్చా గోష్టులు, వివిధ సంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గనాలని కోరారు.బాలికల భద్రత, హక్కులు, అప్రమత్తతపై విలువైన సూచనలు అందించమని అలాగే సమతుల్య ఆహారం తీసుకోవడం ద్వారా ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని తెలియజేశారు. బాలికలకు ఆరోగ్య, భద్రత అంశాలపై అవగాహన కల్పించారు.కిశోర బాలికల సాధికారత అందరి బాధ్యత అని,బాలికలు చిన్ననాటి నుంచే దృఢంగా ఉండాలన్నారు. పౌష్టికాహారం తీసుకోవాలన్నారు. కిషోర్ బాలికలకు వ్యక్తిగత రుతు స్రావ పరిశుభ్రత లైంగిక వేధింపుల నుండి రక్షణ బాల్యవివాహాలను అరికట్టుట మానవ అక్రమ రవాణా ఆత్మరక్షణ నైపుణ్యం ఉపాధి లింగ వివక్షత గురించి విషయాలను తెలియపరిచారు. ఈ కార్యక్రమంలో సూపర్వైజర్ మారియమ్మ, అంగన్వాడి టీచర్, తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్ర స్థాయి శిక్షణ తరగతులను జయప్రదం చేయాలి : రామకృష్ణ




**రేణిగుంట, మే 29 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** అఖిల భారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్) ఆధ్వర్యంలో పల్నాడు జిల్లా కోటప్పకొండలో జూన్ 1 నుంచి 5వ తేదీ వరకు నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి యువజన విద్యా–సాంస్కృతిక శిక్షణ తరగతులను యువత జయప్రదం చేయాలని ఏఐవైఎఫ్ తిరుపతి జిల్లా ప్రధాన కార్యదర్శి రామకృష్ణ పిలుపునిచ్చారు. శుక్రవారం రేణిగుంట సర్కిల్ అంబేద్కర్ విగ్రహం వద్ద శిక్షణ తరగతులకు సంబంధించిన కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ రాష్ట్ర నలుమూలల నుంచి సుమారు 600 మంది యువజనులు ఈ శిక్షణ తరగతుల్లో పాల్గొంటారని తెలిపారు. యువతలో రాజకీయ అవగాహన, సామాజిక బాధ్యత, శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించేందుకు ఈ శిక్షణ తరగతులు ముఖ్య వేదికగా నిలుస్తాయని పేర్కొన్నారు. ఈ శిక్షణ శిబిరంలో సినీ ప్రముఖులు, మేధావులు, రాజకీయ విశ్లేషకులు, విద్యావేత్తలు, సామాజికవేత్తలు పాల్గొని యువతకు మార్గనిర్దేశనం చేయనున్నారని తెలిపారు. అలాగే గ్రూప్ చర్చలు, కార్యశాలలు, సాంస్కృతిక కార్యక్రమాలు, ఉద్యమ అనుభవాల పంచిక వంటి కార్యక్రమాలు కూడా నిర్వహించనున్నట్లు చెప్పారు. ప్రస్తుత పరిస్థితుల్లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు యువత పట్ల నిర్లక్ష్య వైఖరి అవలంబిస్తున్నాయని ఆయన విమర్శించారు. ఆంధ్రప్రదేశ్లో యువతకు తగిన ఉపాధి అవకాశాలు కల్పించడంలో ప్రభుత్వాలు విఫలమయ్యాయని ఆరోపించారు. నిరుద్యోగ సమస్య రోజురోజుకు పెరుగుతుండటంతో ఉపాధి కోసం యువత ఇతర రాష్ట్రాలకు వలస వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడిందని ఆందోళన వ్యక్తం చేశారు. పెద్ద సంఖ్యలో యువత ఈ శిక్షణ తరగతులకు హాజరుకావాలని ఆయన పిలుపునిచ్చారు. గ్రామ, మండల, నియోజకవర్గ స్థాయిలో యువజనులను చైతన్యపరచి కోటప్పకొండకు తరలించే ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా సహాయ కార్యదర్శి నాగరాజు, ఏఐవైఎఫ్ నాయకులు భాను, వెంకటేష్, కుప్పయ్య, మద్దిలేటి, మనోహర్, భాషా, సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

## యోగా క్లాసులను వినియోగించుకోండి

**చంద్రగిరి, మే 29 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** నియోజక వర్గం పరిధిలోని పాకాల మండలం, పాకాల పంచాయతీ రామకృష్ణ మందిరం వద్ద ఆదివారం మే 31వ తేదీ ఉదయం 6 గంటల నుండి 7 గంటల వరకు ఉచిత యోగ క్లాసులు నిర్వహించబడునని యోగ మాస్టర్ ప్రకాష్ తెలి పారు. యోగ గురువు నిర్మలా నంద స్వామి శిష్యులచే జూన్ 21వ తేదీ వరకు క్లాసులు నిర్వహించబడునని చెప్పారు.యోగ ఒత్తిడిని తగ్గించి బీపీ,షుగర్,థైరాయిడ్,గ్యాస్, మలబద్ధకం వంటి సమస్యలు దూరం అవుతాయని చెప్పారు.యోగా క్లాసులకు హాజరయ్యే వారు యోగ మ్యాట్ లేదా బెడ్ షీట్,వాటర్ బాటిల్ తీసుకురావలెనని చెప్పారు.శారీరక ఆరోగ్యానికి మానసిక ప్రశాంతతకు యోగా ఉత్తమ మార్గమని ఈ అవకాశాన్ని అందరూ సద్వినియోగం చేసుకోవాలని యోగ మాస్టర్స్ సురేంద్రబాబు,బాలాజీ, చిట్టి,తదితరులు పేర్కొన్నారు.

## చిత్తూరు జిల్లా



## పింఛన్ల పంపిణీలో ఆలస్యం వద్దు




**రామకుప్పం, మే 29 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** మండలంలో ప్రతినెల ప్రభుత్వం పంపిణీ చేస్తున్న ఎన్టీఆర్ సామాజిక భరోసా పెన్షన్ల పంపిణీ సక్రమంగా పంపిణీ చేయాలని మండల ఎంపీడీవో ఈశ్వరన్ కోరారు , శుక్రవారం రామకుప్పం మండల ప్రజా పరిషత్ సమావేశము మందిరంలో ఎంపీడీవో స్థానిక ప్రజాప్రతినిధులు మరియు అధికారులతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో ఎక్కడ కూడా పెన్షన్లను బహిరంగంగా గుంపులు గుంపులుగా పంపిణీ చేయకూడదని ప్రతి లబ్ధిదారుని ఇంటి వద్దకి వెళ్లి వారికి ప్రభుత్వ అందిస్తున్న సహాయాన్ని ఇవ్వాలని కోరారు. ప్రతి నెల మొదటి తారీకున 100% పింఛన్లు అందరికీ పంపిణీ చేసేలా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు ప్రధాన కార్యదర్శిలు వెంకటరమణ కామరాజు నాయక్ ఎంపీపీ సులోచన గుర్రప్ప , జిల్లా తెలుగుదేశం పార్టీ ముఖ్య నేత పత్ర నారాయణ, నియోజకవర్గ ఎస్టీ సెల్ అధ్యక్షుడు నరసింహులు, కడ అడ్వైసింగ్ కమిటీ నెంబర్ రఘు ,వైస్ ఎంపీపీ వెంకట్రామగౌడ, ముఖ్య నేతలు రామమూర్తి, శ్రీనివాసరెడ్డి, నాగభూషణం, కుప్పం వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ పవన్, యూనిట్ ఇంచార్జ్ చంద్రారెడ్డి, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా ఆరోగ్యం పారిశుధ్యంతోనే సాధ్యం

**కుప్పం,మే 29 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** ప్రజల ఆరోగ్య పరిరక్షణ పారిశుద్ధ్యంతో సాధ్యమని మునిసిపల్ కమిషనర్ శ్రీనివాసరావు తెలిపారు. శుక్రవారం ఆయన పట్టణ పరిధిలో లక్ష్మీపురం ప్రాంతంలో ఆపరేషన్ క్లియర్ స్విప్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో భాగంగా పురవీధులలోని చెట్ట చదరాన్ని శుభ్రపరచడంతో పాటు మురుగు కాలువల పారిశుధ్య పనులను నిర్వహించారు. అలాగే రోడ్లపై ఉన్న మురుగు నీటి తొలగింపు పనులను చేపట్టి, పారిశుధ్య ప్రాముఖ్యతను ప్రజలకు వివరించారు. అనంతరం కమిషనర్ మాట్లాడుతూ తడి చెత్త పొడి చెత్త మధ్యగల వ్యత్యాసాలలు ప్రజలకు వివరించారు. ప్రతి ఒక్కరూ వేరు చేసిన చెత్తను చెత్త వాహనాలకు మాత్రమే అందించాలని విజ్ఞప్తి చేశారు.

## దుకాణాలలో లీగల్ మెట్రాలజీ ఇన్స్పెక్టర్ తనిఖీలు

**పెద్దపంజాణి, మే 29 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** మండల కేంద్రంలోని దుకాణాలలో పలమనేరు తూనికలు కొలతలు శాఖ ఇన్స్పెక్టర్ రమాదేవి శుక్రవారం తనిఖీలు నిర్వహించారు. దుకాణాల్లో ఎమ్మార్పీ ధరలకే వస్తువులు విక్రయించాలని, వస్తువులపై తయారీ తేదీ తప్పనిసరిగా ఉండాలన్నారు. తూనికలు కొలతల శాఖ వారిచే అనుమతి పొందిన తూనిక యంత్రాలను ఉపయోగించాలన్నారు. నిబంధనలను అధిక్రమించిన ఎడల జరిమానాల విధిస్తామని హెచ్చరించారు.

## కడపలో బాజిగర్ షార్ట్ ఫిల్మ్ పోస్టర్ ఆవిష్కరణ



**కడప కల్చరల్ , మే 29 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** నగరంలో రూపొందుతున్న "బాజిగర్" షార్ట్ ఫిల్మ్ పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమం శుక్రవారం ఘనంగా జరిగింది. దీనికి ముఖ్య అతి థులుగా టీ.డీ.పీ నగర్ అధ్యక్షుడు పీ.మన్సూర్ అలీ ఖాన్, ఖున్ కా రిష్తా చారిటబుల్ ట్రస్ట్ చైర్మెన్ యం.తారిఖ్ అలీ హాజరై చిత్ర బృందానికి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యువతలో ఉన్న ప్రతిభను ప్రోత్సహించే విధంగా షార్ట్ ఫిల్మ్ మంచి వేదికగా నిలు స్తున్నాయని పేర్కొన్నా రు. సమా జానికి ఉపయోగపడే సందేశాత్మక చిత్రాలు మరింతగా రావాలని ఆకాంక్షించారు. ఈ షార్ట్ ఫిల్మ్‌కు దర్శకుడిగా ఖాలీద్ లీ వ్యవహరి స్తుండగా, కథానాయకుడిగా సమీఉల్లా ప్రతికథనయకుడిగా ఫజల్ తమ ప్రతిభను కనబరుస్తున్నారు. పోస్టర్ ఆవిష్కరణ అనంతరం చిత్ర యూనిట్ సభ్యులు మాట్లాడుతూ ప్రేక్షకుల ఆదరణతో "బాజిగర్" షార్ట్ ఫిల్మ్ విజయవంతం అవు తుందనే నమ్మకాన్ని వ్యక్తం చేశారు. కార్యక్రమంలో అభిమా నులు,సినీ ప్రేమి కులు పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.

## సాగు ఖర్చులకు అనుగుణంగా మద్దతు ధరలు ఉండాలి




**చింతకొమ్మదిన్నె, మే 29 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** సాగు ఖర్చులకు అనుగుణంగా మద్దతు ధరలు ఉండాలన్నారు ఏపీ రైతు సంఘం కడప జిల్లా కార్యదర్శి దస్తగిరి రెడ్డి. ఏపీ రైతు సంఘం కేంద్ర,రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు శుక్రవారం కడప జిల్లా సికేదిన్నే మండలం కొలుమూలపల్లె పంచాయతీ రైతు సేవా కేంద్రం దగ్గర మోసపూరిత మద్దతు ధరల జీవో కాపీలను దహనం చేశారు. ఈ సందర్భంగా దస్తగిరి రెడ్డి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరలు పెరిగిన వ్యవసాయ ఖర్చులు,ఎరువులు, డీజిల్,పెట్రోల్, విత్తనాలు,మందులు కూలి ఖర్చులు పెరిగిన ఇతర ఖర్చులు కనుగుణంగా మద్దతు ధరలు పెంచ లేదని ఆయన తెలిపారు. ఉదా: వరికి క్వింటాలు కు 72రూ, మొక్కు జొన్న కి క్వింటాలు కు 10రూ ఇతర 14రకాలు పంట లకు నామ మాత్రం పెంచి,రైతు లకు పంటలు ధరలు పెంచి నట్లు ప్రచారం చేస్తుకేంద్ర,రాష్ట్ర ప్రభుత్వ లు రైతులను మోసం చేస్తున్నారని అన్నారు. ఎన్నికల ముందు డాక్టర్ స్వామినాథన్ కమిషన్ సిఫార సులకు అనుగుణంగా మద్దతు ధరలు పెంచుతామని హామీ ఇచ్చిన పాలకులు నేడు తుంగలో తొక్కారని ఆయన విమర్శించా రు. ఢిల్లీ రైతాంగ ఉద్యమ సందర్భంగా రాతపూర్వకంగా ఇచ్చిన హామీలను కూడా అమలు చేయడంలో కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం విఫలం చెందింద న్నారు. ఈ నిరసన కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా అధ్యక్షులు గోపాలకృష్ణయ్య మండల రైతు సంఘం నాయకులు చిన్న సిద్ద య్య,శ్రీనివాస్ రెడ్డి సుబ్బా రెడ్డి,గంగిరెడ్డి,బంకు సిద్ద య్య,హుస్సేనయ్య సుబ్బయ్య,వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## పలమనేరు వాసి కె.వి.మహేష్‌కు ఏఎస్పీగా పదోన్నతి



**పలమనేరు, మే 29 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** హిందూపురం డీఎస్పీగా ప్రస్తుతం విధులు నిర్వహిస్తున్నపలమనేరుకు చెందిన కె.వి. మహేష్ ( 2016 గ్రూప్ వన్ బ్యాచ్ ) అదనపు సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్‌గా పదోన్నతి పొందారు. ఇదివరకు కర్నూలు,నరసరావుపేట, గుంటూరులో డీఎస్పీగా పని చేశారు. ఇప్పుడు అదనపు సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్‌గా పదోన్నతిపై హిందూపురంలోనే నియమించబడ్డారు. విధి నిర్వహణలో భాగంగా జిల్లా,రాష్ట్ర స్థాయిలో పలుమార్లు ఉత్తమ సేవా ప్రశంసా పత్రాలను పొందారు. అనేక జటిలమైన కేసులను ఛేదించి, ఉన్నత అధికారుల ప్రశంసలు పొందారు. పోటీ పరీక్షలలో విజయం సాధించే దిశగా విద్యార్థులకు ప్రత్యేక కౌన్సెలింగ్ క్లాసులు నిర్వహిస్తూ అనేక ప్రాంతాలలో విద్యార్థుల అభిమానాన్ని ఆయన చూరగొన్నారు. వీరి తల్లి ఎం.విద్యారమ ఉమ్మడి చిత్తూరు జిల్లాలో ఎంపీడీవోగా నెల్లూరు జిల్లా ప్రజా పరిషత్ సీఈఓ గా పనిచేశారు. పదోన్నతి పై ప్రస్తుతం పంచాయతీ రాజ్ ఎక్స్టెన్షన్ ట్రైనింగ్ సెంటర్ శ్రీకాళహస్తిలో ప్రిన్సిపాల్ గా పని చేస్తున్నారు. ఈ సందర్భంగా పలమనేరుకు చెందిన పలువురు అధికారులు, సేవా సంఘాల నాయకులు, స్వచ్ఛంద సేవా సంస్థల నిర్వాహకులు, పలమనేరు రచయితల సంఘం, సాహిత్య సాంస్కృతిక సమితి, పలమనేరు ప్రకృతి, ఎమ్మెస్సార్ ఎడ్యుకేషనల్ ట్రస్ట్ కార్యనిర్వాహకులు మహేష్ కు అభినందనలు తెలిపారు.

## విద్యార్థినికి పలువురు అభినందనలు



**పలమనేరు ,మే 29 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** పలమనేరు పట్టణంలోని వీధిలో ఉన్న శ్రీ ఆదర్శ ఇంగ్లీష్ మీడియం హై స్కూల్ నందు మేదర 600 మార్కులకు గాను 547 మార్కులు సాధించింది. వారి తల్లిదండ్రులు తమ్మినేని గాయత్రి శ్రీకాంత్ వారి కుమార్తె 600 మార్కులుకు గాను 547 మార్కులు అత్యధికంగా సాధించిందన్నారు. అదేవిధంగా మెరిట్ స్టూడెంట్ గా వచ్చిన మన మేదర హేమామృత కి చిత్తూరు జిల్లా మేదర సంఘం అధ్యక్షులు వి.వెంకటరమణ హృదయపూర్వక అభినందనలు తెలియజేశారు. అదేవిధంగాశ్రీ ఆదర్శ ఇంగ్లీష్ మీడియం హై స్కూల్ లో చదువుకుంటున్న విద్యార్థిని ని కరస్పాండెంట్, ప్రిన్సిపాల్, శ్రీనివాసులు నాయుడు కూడా ఆ విద్యార్థినిని అభినందించారు.

## రేపు ఎమ్మెల్యేచే సాయి కిషోర్ జూనియర్ కళాశాల ప్రారంభం

**పలమనేరు , మే 29 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** మదనపల్లి రోడ్డులోని నాగలరాళ్లకు ఎదురుగా ఉన్న వీధిలో ఉన్నటువంటి "సాయి కిషోర్ జూనియర్ కళాశాల" భవనాన్ని ప్రారంభోత్సవానికి పలమనేరు ఎమ్మెల్యే ఎన్. అమర్నాథరెడ్డి చేతుల మీదుగా 31వ తేదీ ఆదివారం ఉదయం ప్రారంభోత్సవం చేయబడునని కళాశాల కరస్పాండెంట్ కే.కిషోర్ కుమార్ తెలిపారు. ఈ కార్యక్రమానికి అందరూ ఆహ్వానితులేనన్నారు.

## స్విమ్స్ పి.జి వైద్య విద్యార్థులకు ఓరియేంటేషన్




**తిరుపతి,మే 29 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** స్విమ్స్ యూనివర్సిటీ పి.జి. వైద్య విద్యార్థులకు ఓరియంటేషన్ ప్రోగ్రామ్ ను శ్రీ పద్మావతి ఆడిటోరియం లో శుక్రవారం నిర్వహించినట్లు మెడికల్ సూపరింటెండెంట్ డా॥ రామ్ తెలియజేశారు. ముఖ్యఅతిధి స్విమ్స్ సంచాలకులు/ఉపకులపతి డా॥ ఆర్.వి.కుమార్ గారు, డీన్ డా॥ అలోక్ సచన్, రిజిస్ట్రార్ డా॥ అపర్ణ ఆర్ బిట్లా, మెడిసిన్ విభాగాధిపతి డా॥ అల్లాడి మోహన్, శ్రీ పద్మావతి మహిళా వైద్య కళాశాల ఇన్ చార్జ్ ప్రిన్సిపల్ డా॥ నాగరాజ్ శ్రీ పద్మావతి మహిళా వైద్య కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డా॥ ముత్తీశ్వరయ్య కమ్యూనిటీ మెడిసిన్ అసోసియేట్ ప్రొఫెసర్ డా॥ చంద్రశేఖర్, డిప్యూటీ రిజిస్ట్రార్ డా॥ యర్రమ రెడ్డి లతో కలసి జ్యోతిని వెలింగించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం డా॥ ఆర్.వి.కుమార్ ముందుగా వైద్య విద్యార్థులకు శుభాశీస్సులు అందచేసి మాట్లాడుతూ 'మీరు ఎం.బి.బి.యస్., యు.జి వివిధ కళాశాలలో విద్యనభ్యసించి, ఈ రోజు భగవంతుని స్వరూపమైన తిరుమల తిరుపతి దేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహించబడుతున్న స్విమ్స్ హాస్పిటల్ నుండి వైద్య వృత్తిలోకి ప్రవేశించబోతున్నారని,సమాజానికి సేవా భావంతో వైద్య సేవలు అందించాలని కోరారు. రోగుల ప్రాణాలు కాపాడే దేవుడుగా డాక్టర్లను నమ్ముతారని ఆ నమ్మకాన్ని ప్రతి వైద్యుడు నిలబెట్టుకోవాలని పేర్కొన్నారు. రోగుల ప్రాణాలను కాపాడాటానికి ఎల్లప్పుడు రెడీగా వుండే వారే వైద్యులని తెలిపారు. వైద్యాన్ని ధనార్జనే ధ్యేయంగా కాకుండా సమాజసేవకు, పేదల కోసం వినియోగించాలని కోరారు. స్విమ్స్ డీన్ డా॥ అలోక్ నచన్ మాట్లాడుతూ వైద్య విద్యలోకి అడుగుపెడుతున్న వైద్యులకు కార్పొరేట్ మరియు అత్యుత్తమ వైద్య ప్రమాణాలు, రోగులతో వ్యవహరించాల్సిన తీరు, నైతిక విలువలపై అవగాహన కలిగివ ఉండాలని పేర్కొన్నారు. వైద్య విద్య నందు మంచి భవిష్యత్తు వుంటుందని, ప్రతి ఒక్క వైద్యులు మారు మూల గ్రామీణ ప్రాంతాలలో కూడా వైద్య సేవలు అందించాలని కోరారు. శ్రీ పద్మావతి మహిళా వైద్య కళాశాల ఇన్చార్జ్ ప్రిన్సిపాల్ డా॥ నాగరాజ్ మాట్లాడుతూ స్విమ్స్‌లో మంచి అధ్యాపకులు, లైబ్రరీ, రీసెర్చ్, ఆహ్లాదకరమైన వాతావారణం వుందని, ప్రతి ఒక్క పి.జి. వైద్యులు అధ్యాపకులతో గౌరవభావంతో మెలగాలని సూచించారు. కార్యక్రమంలో భాగంగా కళాశాలలో అందుబాటులో వున్న అత్యాధునిక ల్యాబ్ సదుపాయలు అత్యవసర విభాగాల పనితీరు మరియు హాస్పిటల్ గురించి వివరించారు. మెడిసిన్ విభాగాధిపతి డా॥ అల్లాడి మోహన్ మాట్లాడుతూ పి.జి. కోర్సు సమయంలో ఒత్తిడిని జయించడం, పరిశోధనలకు ప్రాధాన్యత ఇవ్వడం తదితర అంశాలపై విద్యార్థులకు సూచనలు చేశారు. 67 మంది పి.జి. వైద్య విద్యార్థులకు రెసిడెన్స్ మ్యాన్యువల్ ను అందజేశారు. ఈ కార్యక్రమంలో స్విమ్స్ విభాగాధిపతులు, అధ్యాపకులు, పి.జి.వైద్యులు, తదితరులు పాల్గొన్నారు.

## భూమి మాది.. ఆక్రమణ మరొకరిది


**- అన్ని రికార్డులు నిరూపించడానికి సిద్ధం - అధికారులు న్యాయం చేయాలి**

**-బాధితుల వేడుకోలు**



**మదనపల్లె, మే 29 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** భూములు మావి, రికార్డులన్నీ మా పేరునే ఉన్నాయి. కానీ మరొకరు ఆక్రమిం చుకుని తీవ్ర ఇబ్బందులకు చేస్తున్నారంటూ కురబలకోట మండలం చేనేత నగర్ కు చెందిన రావూరి అమరనాథ్ రెడ్డి, ఎర్రజేనువారి పల్లెకు చెందిన రెడ్డెమ్మ ఆర్ అమరనాథ్ రెడ్డి దంపతులు, నందిరెడ్డిగారిపల్లెకు చెందిన ఫైరోజ్ ఖాన్ లు ఆవేదన వ్యక్తం చేశారు. శుక్రవారం వారు ప్రెస్ క్లబ్ తమ ఆవేదనను వెలిబుచ్చారు. ఎర్రజేనువారిపల్లి గ్రామ పరిధిలోని సర్వే నెంబర్లు 605-1, 606, 677 భూ వివాదంకు సంబంధించి అన్ని రికార్డులు తమ వద్ద ఉన్నాయని రావూరి అమర్నాథ్‌రెడ్డి తెలిపారు. నిబంధనల మేరకు కొనుగోలు చేసిన స్థలంలోకి తమను రానివ్వకుండా కబ్జాదారులు ఎం. బాలకృష్ణారెడ్డి, వెంకటరమణారెడ్డి లు అధికార పార్టీ అండతో అడ్డుకుంటున్నారని ఆరోపించారు. తన వద్ద ఉన్న రికార్డులను నిరూపించడానికి సిద్ధంగా ఉన్నానని తెలిపారు. ఈ భూవివాదంతో గతంలో పిజిఆర్ఎస్ లో ఫిర్యాదు చేయగా రెవెన్యూ అధికారులు రికార్డులను పరిశీలించి సర్వే రిపోర్టును ఇచ్చారన్నారు. వై. అమర్నాథరెడ్డి, రెడ్డమ్మ దంపతులు మాట్లాడుతూ తమకు వారసత్వంగా వచ్చిన భూమిని దాయాదులు వెంకట్రమణ రెడ్డి కబ్జా చేసి భూమిలోకి రానివ్వకుండా అడ్డుకుంటున్నారన్నారు. ఆ వ్యక్తి రెండు ఖాతాలను తయారు చేసుకుని, తమ భూములను ఆక్రమించుకున్నాడన్నారు. అధికారుల రీ సర్వేలో తమకే కేటాయించిన దౌర్జన్యం చేస్తున్నారని, ఇటీవలే తనపై దాడి చేశారన్నారు. వారి నుంచి తమకు ప్రాణహాని ఉందని, రక్షణ కల్పించాలని కోరారు. 605-1 లో తమకు వారసత్వంగా 8.80 ఎకరాల భూమి ఉందని, బాలకృష్ణారెడ్డి, జయరామి రెడ్డి లు కబ్జా చేసి తమను పొలంలోకి రానివ్వడం లేదని ఫైరోజ్ ఖాన్ ఆరోపించాడు. పిజిఆర్ఎస్ లో ఫిర్యాదు చేయగా, రీ సర్వే చేయనివ్వకుండా బాలకృష్ణారెడ్డి, జయరామిరెడ్డి లు అధికారులను అడ్డుకుంటున్నారన్నారు. ఉన్నతాధికారుల స్పందించి తమకు న్యాయం చేయాలని కోరాడు.

## ఎమ్మెల్యే దంపతులకు పెళ్లి రోజు శుభాకాంక్షలు



**కడప అర్బన్ , మే 29 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** కడప ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆర్ మాధవి రెడ్డి ఆర్ శ్రీనివాసులు రెడ్డి (వాసు) పెళ్లి రోజు సందర్భంగా తెలుగు దేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు శుక్రవారం శుభాకాంక్షలు ఇందులో భాగంగా తెలుగుదేశం పార్టీ ముస్లిం మైనారిటీ నాయకుడు లయన్ పటాన్ ఖాదర్బాషాలు మాట్లాడుతూ అన్యోన్య దాంపత్యంతో నిండు నూరేళ్లు అష్ట ఆరోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు. రాముడు, సీత జంట లాగా చిరకాలంగా చిరునవ్వుతో ఉండాలని తెలిపారు.

## క్రికెట్‌ను ప్రారంభించిన మాజీ మంత్రి పెద్దిరెడ్డి



**పుంగనూరు,మే 29 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** మండల పరిధిలోని సుగాలి మిట్ట గ్రామం నందు మిధున్ దళం పేరుతో శుక్రవారం నిర్వహించిన క్రికెట్ టోర్నమెంట్ను మాజీ మంత్రి పుంగనూరు నియోజకవర్గ ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీ రెడ్డప్ప, ఎంపీపీ భాస్కర్ రెడ్డి, మున్సిపల్ చైర్మన్ అలీమ్ భాష, కొండవీటి నాగభూషణం, రాష్ట్ర యువజన ప్రధాన కార్యదర్శి కొత్తపల్లి చెంగారెడ్డి , పిచ్చుగుండ్లపల్లి రాజశేఖర్‌మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ అమర్నాథ్ రెడ్డి ,బండ్లపల్లి సంతోష్ రెడ్డి పెద్ద సంఖ్యలో నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## రోడ్డు విస్తరణకు సహకరించండి



**కుప్పం,మే 29 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** కుప్పం పట్టణ టిడిపి అధ్యక్షులు కాణిపాకం వెంకటేష్, కడ అడ్వైజరీ కమిటీ సభ్యులు రాజ్ కుమార్ అధికారులతో కలిసి రోడ్డు విస్తరణ పరిసరాలను పరిశీలిం చారు. ఈ సందర్భంగా రోడ్డు విస్తరణలో భవనాలు కోల్పోతున్న బాధితులను కలిసి వారితో చర్చించి, పట్టణంలో రోడ్డు విస్తరణ పనులకు సహకరించాలని కోరుతూ వారి భవనాలను పరిశీలించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పట్టణ అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళిక రూపొందించి, కృషి చేస్తున్నారని తెలిపారు. పట్టణ అభివృద్ధి కొరకు ముఖ్యమంత్రికి సహకరించాల్సిన బాధ్యత కుప్పం ప్రజలపై ఉందన్నారు. రోడ్డు విస్తరణలో భవనాలు కోల్పోయే బాధితులు సైతం కుప్పం ప్రజల భవిష్యత్తులో దృష్టిలో ఉంచుకొని సహకరించాలని కోరారు.

## రోడ్లపై చెత్త వేయకుండా ప్రజల్లో అవగాహన కల్పించండి

**- కమిషనర్ (ఎఫ్.ఏ.సి.) శారదా దేవి**



**తిరుపతి,మే 29 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** నగరంలో రోడ్లపైన, కూడళ్ళలో చెత్త వేయకుండా ప్రజల్లో అవగాహన కల్పించాలని ఆరోగ్యశాఖ అధికారులు, సిబ్బందిని నగరపాలక సంస్థ కమిషనర్ (ఎఫ్.ఏ.సి.) శారదా దేవి సూచించారు. ఆపరేషన్ క్లీన్ స్వీప్ లో భాగంగా నగరంలోని ప్రగతి నగర్, ఉపాధ్యాయ నగర్, తిమ్మినాయుడుపాలెం, ఎన్జీవోస్ కాలనీ, జూ పార్క్ రోడ్డు తదితర ప్రాంతాల్లో జరుగుతున్న పారిశుధ్య పనులను శుక్రవారం ఉదయం కమిషనర్ పరిశీలించారు. రోడ్లపక్కన, కాలువల్లో, కూడళ్ళలో చెత్త వేయకుండా మీ ఇంటి వద్దకు వచ్చే మా సిబ్బందికి ఇవ్వాలని ప్రజలకు తెలిపారు. కాలువల్లో ఎక్కడా చెత్త పేరుకుపోకుండా ఇంజినీరింగ్ అధికారులు జేసిబి ల ద్వారా చెత్త, మట్టి ఎప్పటికప్పుడు తొలగించాలని అధికారులను ఆదేశించారు. శ్రీవారి సన్నిధి దగ్గర రోడ్డు పై పొంగుతున్న మురుగునీటిని చూసి వెంటనే పరిష్కరించాలని సిబ్బందిని ఆదేశించారు. పార్కుల్లో ఎక్కడ చెత్త వేయకూడదని, పార్క్ చుట్టూ ఉన్న చెత్తను, రోడ్డు ఇరువైపుల ఉన్న కలుపు మొక్కలను తొలగించాలని సిబ్బందిని ఆదేశించారు. ఉపాధ్యాయ నగర్ పెద్ద డ్రైనేజ్ కాలువలో చెత్త తొలగించి, తిరిగి ఎవ్వరూ చెత్త వేయకుండా చూడాలని తెలిపారు. ఈ కార్యక్రమం లో డిప్యూటీ కమిషనర్ అమరయ్య, హెల్త్ ఆఫీసర్ యువ అన్వేష్, శానిటేషన్ సూపర్వైజర్లు చెంచయ్య, సుమతి మరియు సిబ్బంది పాల్గొన్నారు.

## 'చిరునవ్వు' పుస్తకావిష్కరణ





**తిరుపతి,మే 29 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** కర్నూలు జిల్లా నందవరం మండల పరిధిలోని నాగలదిన్నె జడ్పీహెచ్ స్కూల్‌లో గణితోపాధ్యాయుడుగా పనిచేస్తున్న బాలబంధు గద్వాల సోమన్న కలం నుండి జాలువారిన "చిరునవ్వు" పుస్తకావిష్కరణ తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం ఘనంగా జరిగింది. పాత్రికేయ మిత్రుల సమక్షంలో ముఖ్య అతిథి, జర్నలిస్టుల ఫోరం అధ్యక్షులు అరవ జైపాల్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో చిరునవ్వు తొలి ప్రతిని మంగళం డిపోలో సేఫ్టీ డ్రైవింగ్ ఇన్‌స్ట్రక్టర్‌గా పనిచేస్తున్న గుండ్లూరు సుబ్రమణ్యం అందుకున్నారు. ఈ సందర్భంగా పుస్తక రచయిత సోమన్న మాట్లాడుతూ తాను ఇదివరకు సమాజానికి పనికి వచ్చే 96 పుస్తకాలు రచించి ఆవిష్కరించడం జరిగిందని 97వ పుస్తకంగా చిరునవ్వు ను తీసుకువచ్చినట్లు తెలిపారు. తదుపరి పుస్తకాలు నందన వనం,శతమానం భవతి లను త్వరలో ముద్రించనున్నట్లు చెప్పారు. చిరునవ్వు పుస్తకాన్ని తిరుమల శ్రీవారి పాదాల చెంత తిరుపతి లో ఆవిష్కరించడం ఆనందంగా ఉందన్నారు. అనంతరం ఆత్మీయ అతిథులు డా. శివకుమార్, రెడ్డి కుమార్, పోతాని సుధాకర్, సువర్ణ ఆనంద, సాహితీవేత్తలు అర్. సి. కృష్ణస్వామి రాజు ఇతర పుర ప్రముఖులు బహు గ్రంథకర్త గద్వాల సోమన్నను ఘనంగా సన్మానించారు.

## వైష్ణవి స్టడీ సెంటర్ విద్యార్థిని కీర్తనను అభినందించిన మంత్రి మండిపల్లి



**రాయచోటి, మే 29 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** ఎస్.ఎస్.సి 2026 ఫలితాల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి 600 మార్కులకు గాను 591 మార్కులు సాధించిన వైష్ణవి స్టడీ సెంటర్ విద్యార్థిని జి. కీర్తనను రాష్ట్ర మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి ప్రత్యేకంగా అభినందించారు. వివేకానంద రెడ్డి కుమార్తె అయిన కీర్తన సాధించిన ఈ అద్భుత విజయంపై హర్షం వ్యక్తం చేసిన మంత్రి, విద్యార్థిని భవిష్యత్తులో మరింత ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా కీర్తనతో మాట్లాడిన మంత్రి, ఆమె కృషి, పట్టుదల, సమయపాలన, క్రమశిక్షణ వల్లే ఈ విశిష్ట ఫలితం సాధ్యమైందని కొనియాడారు. విద్యార్థులు లక్ష్యాన్ని నిర్దేశించుకుని నిరంతర శ్రమతో ముందుకు సాగితే ఉన్నత విజయాలు సాధించవచ్చని సూచించారు. ఈ సందర్భంగా విద్యార్థిని జి. కీర్తన మాట్లాడుతూ, వైష్ణవి స్టడీ సెంటర్ ఉపాధ్యాయులు అందించిన ప్రత్యేక శిక్షణ, నిరంతర పర్యవేక్షణ, ప్రోత్సాహం వల్లే తాను ఈ స్థాయి మార్కులు సాధించగలిగానని తెలిపింది. తన విజయానికి తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల సహకారం ఎంతో కీలకమైందని పేర్కొంది. కార్యక్రమంలో టీడీపీ నాయకులు సాంబశివారెడ్డి, కొండారెడ్డి, వైష్ణవి స్టడీ సెంటర్ ఉపాధ్యాయులు శివ, రామకృష్ణ, శ్రీనివాసులు తదితరులు పాల్గొని విద్యార్థినిని అభినందించారు. కీర్తన సాధించిన విజయంతో వైష్ణవి స్టడీ సెంటర్‌లో ఆనందోత్సాహాలు నెలకొన్నాయి. విద్యార్థిని భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించి విద్యాసంస్థకు మంచి పేరు తీసుకురావాలని పలువురు ఆకాంక్షించారు.

## వైయస్సార్సీపి మేధావుల ఫోరం స్టేట్ జాయింట్ సెక్రటరీగా మయూరి రఘునాథ్ రెడ్డి





**మదనపల్లె,మే 29 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** వైయస్సార్సీపి మేధావుల ఫోరం రాష్ట్ర సంయుక్త కార్యదర్శిగా మదనపల్లె కు చెందిన మయూరి రఘునాథ్ రెడ్డి నియమితులయ్యారు. ఈ మేరకు శుక్రవారం ఆయన్ను వైసిపి. జిల్లా చేనేత విభాగం అధ్యక్షులు శీలం రమేష్,ఎస్టీ సెల్ స్టేట్ జాయింట్ సెక్రటరీ ఆవుల మల్లికార్జున,జిల్లా విద్యార్థి విభాగం ఈసీఎం గుదిటి చరణ్,సి.సుధాకర్, చిన్నా,గోవర్ధన్, ఉదయ్,అరవింద్ తదితరులు పుష్పగుచ్ఛం అందజేసి,శాలువావతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా మయూరి రఘునాథ్ రెడ్డి వైకాపా అధినేత,మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి,మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి,ఎంపీ పెద్దిరెడ్డి మిథున్ రెడ్డి,అన్నమయ్య జిల్లా అధ్యక్షుడు ఆకేపాటి అమరనాథ్ రెడ్డి, తంబళ్లపల్లె ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి, వైకాపా సమన్వయకర్త నిస్సార్ అహ్మద్,పీలేరు నియోజకవర్గం ఇంచార్జ్ చింతల రామచంద్రా రెడ్డి, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ దేశాయ్ తిప్పారెడ్డి ఇతర పార్టీ ప్రముఖులకు పేరుపేరునా కృతజ్ఞతలు తెలియజేశారు.

## అట్టహాసంగా 'అట్లుంటది మనతోని' సినిమా షూటింగ్ ప్రారంభం




**మదనపల్లె, మే 29 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** 'అట్లుంటది మన తోని' చలన చిత్రం శుక్రవారం మదనపల్లె పట్టణంలోని శ్రీ యోగ భోగేశ్వర స్వామి ఆలయంలో లాంఛనంగా షూటింగ్ ప్రారంభమైంది.అనంతరం స్థానిక సొసైటీ కాలనీలోని కార్యాలయం నందు ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో సినిమా దర్శకులు, హీరో హీరోయిన్, నిర్మాతలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా చిత్ర దర్శకులు రామ్ సుంకర మాట్లాడుతూ ఈ చిత్రం వినోదాత్మక, యువతకు సందేశాత్మక ప్రేమకథా చిత్రంగా తెరకెక్కించడం జరుగుతుందని తెలిపారు. ఇందులో కథానాయకగా ముంబయికి చెందిన రిచా జోషి, కథా నాయకుడిగా వినయ్ నటిస్తున్నారని తెలిపారు. అంతే కాకుండా చలనచిత్ర పరిశ్రమలో మంచి గుర్తింపు పొందిన నటులు ఈ చిత్రంలో నటించబోతున్నారన్నారు. హీరో, హీరోయిన్ లు మాట్లాడుతూ ఈ అవకాశం కల్పించిన చిత్ర నిర్మాత రవితేజనాయుడు కు ధన్యవాదాలు తెలిపారు. ఈ చిత్రం ప్రేక్షకుల మనసును దోచుకుని గుర్తింపు పొందుతుందని విశ్వాసం వ్యక్తం చేశారు.చిత్ర నిర్మాత రాటకొండ రవితేజ నాయుడు మాట్లాడుతూ చిత్ర నిర్మాణంలో అన్ని అంశాలను పరిగణలోనికి తీసుకొని, రాజీపడకుండా,మంచి చిత్రంగా ప్రేక్షకుల ముందుకు తీసుకురావటం జరుగుతుందన్నారు..తాను పుట్టినగడ్డ మదనపల్లె కు గుర్తింపు తేవాలనే ఉద్దేశంతో ఈ చిత్రాన్ని మదనపల్లె, పరిసర ప్రాంతాలలో ఎక్కువ శాతం చిత్రీకరణ జరుపుతామన్నారు.

## సమస్యల రహిత గ్రామంగా వెంకప్పకోట




**మదనపల్లె, మే 29 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** వెంకప్పకోట గ్రామాన్ని సమస్యల రహిత ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ నిశాంత్ కుమార్ పేర్కొన్నారు. శుక్రవారం మదనపల్లె మండలం, వెంకప్పకోట గ్రామంలో ఒక నెల-ఒక నియోజకవర్గం-నాలుగు సందర్శనలు కార్యక్రమం రెండవ వారం జరిగింది. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్, ఎమ్మెల్యే షాజహాన్ భాష, జాయింట్ కలెక్టర్ శివ్ నారాయణ శర్మ, సబ్ కలెక్టర్ చల్లా కళ్యాణి పాల్గొని ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.ఈ సదస్సులో భూ సంబంధిత సమస్యలు, పట్టాదార్ పాసు బుక్, సబ్ డివిజన్ లోపాలు, పేర్లలో పొరపాట్లు, వారసత్వ మ్యుటేషన్లు, 22ఎ సమస్యలు, డాటెడ్ ల్యాండ్స్ సమస్యలు, గ్రామానికి సంబంధించిన సమస్యలు, తదితర అంశాలను నమోదు చేసి, వచ్చే రెండు వారాల్లోగా పూర్తిస్థాయిలో పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. మొదటి విడతలో వచ్చిన అర్జీలను పరిశీలించి ఆరుగురు రైతులకు వన్-బి పత్రాలు, ఒకరికి కొత్త రేషన్ కార్డు అందజేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ అధికారులు గ్రామాలకు వచ్చి సమస్యలు తెలుసుకొని వెంటనే పరిష్కరిస్తుండటం సుపరిపాలనకు నిదర్శనమన్నారు. వెంకప్పకోట రహదారి పనులు 15 రోజుల్లో పూర్తి చేయాలని అధికారులను కలెక్టర్ ఆదేశించినట్లు తెలిపారు. ప్రభుత్వ ఆసుపత్రిలో తాగునీటి సమస్యకు వెంటనే నిధులు మంజూరు చేసినందుకు కలెక్టర్‌కు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ రాజ్, విద్య, వైద్య, వ్యవసాయం, హార్టికల్చర్, గృహనిర్మాణం, డ్వామా, డిటి వెంకటస్వామి, ఎంపీడీవో తాజ్ మస్రూర్, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది, గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## పరిశుభ్రమైన గ్రామాల నిర్మాణానికి ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలి

**- 22 ఈ-ఆటో రిక్షాలు ప్రారంభం**



**మదనపల్లె,మే 29 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** పరిశుభ్రమైన గ్రామాల నిర్మాణానికి ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని కలెక్టర్ నిషాంత్ కుమార్ పిలుపునిచ్చారు. తంబళ్లపల్లె నియోజకవర్గంలోని గ్రామ పంచాయతీల్లో ఘన వ్యర్థాలు, తడి చెత్త సేకరణను సమర్థవంతంగా నిర్వహించేందుకు శుక్రవారం మదనపల్లె కలెక్టరేట్ ఆవరణలో 22 ఈ-ఆటో రిక్షాలను కలెక్టర్, ఎస్పీ ధీరజ్ కునుబిల్లి సంయుక్తంగా జెండా ఊపి ప్రారంభించారు.జిల్లా పరిషత్, మండల పరిషత్ నిధులతో ఒక్కో ఈ-ఆటో రూ.3.20 లక్షల వ్యయం చొప్పున రూ.70.40 లక్షలతో సమకూర్చినట్లు తెలిపారు. కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం గ్రామీణ పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి సారిస్తూ గ్రామాలను పరిశుభ్రంగా, ఆరోగ్యవంతంగా తీర్చిదిద్దేందుకు పలు కార్యక్రమాలు అమలు చేస్తోందన్నారు..ప్రజలు చెత్తను ఎక్కడపడితే అక్కడ వేయకుండా ఇంటి వద్దే పారిశుద్ధ్య సిబ్బందికి అందించి సహకరించాలని కోరారు. ఎస్పీ మాట్లాడుతూ పరిశుభ్రమైన గ్రామాలు ఆరోగ్యకరమైన సమాజానికి ప్రతీక అన్నారు.పారిశుద్ధ్యాన్ని ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యతగా భావించాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వం చేపడుతున్న స్వచ్ఛత కార్యక్రమాలకు ప్రజలు సంపూర్ణ సహకారం అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా పంచాయతీ అధికారి రాధమ్మ, డీఎల్డీఓ లక్ష్మీపతి, పంచాయతీ రాజ్ శాఖ అధికారులు, మండల స్థాయి అధికారులు, ప్రజాప్రతినిధులు, సర్పంచులు, గ్రామ కార్యదర్శులు, పారిశుద్ధ్య సిబ్బంది, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

## తప్పులు లేని ఓటరు జాబితా లక్ష్యం కావాలి

**- జూన్ 15 నుండి జూలై 14 వరకు జిల్లా వ్యాప్తంగా ఇంటింటి సర్వే**



**మదనపల్లె,మే 29 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** అన్నమయ్య జిల్లాలో తప్పులు లేని ఓటరు జాబితా రూపొందించడమే లక్ష్యం కావాలని.. ఇందుకు రాజకీయ పార్టీలు తమ వంతు పూర్తి సహాయ సహకారాలు అందించాలని జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ పేర్కొన్నారు. శుక్రవారం కలెక్టరేట్ కార్యాలయంలోని సమావేశపు మందిరంలో కలెక్టర్ అధ్యక్షతన వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో ప్రత్యేక సంక్షిప్త ఓటరు జాబితా సవరణ మరియు ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ కార్యక్ర మాలపై సమీక్ష సమావేశం నిర్వహించారు..ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ...జూన్ 5వ తేదీ నుండి జూన్ 14వ తేదీ వరకు ఏఈఓలు, బీఎల్ఓలు మరియు డీఈఓలకు ప్రత్యేక శిక్షణ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు.జూన్ 15వ తేదీ నుండి జూలై 14వ తేదీ వరకు జిల్లావ్యాప్తంగా ఇంటింటి సర్వే నిర్వహించి ప్రతి కుటుంబాన్ని సందర్శించనున్నట్లు తెలిపారు.ఈ సర్వేలో భాగంగా 18 సంవత్సరాలు పూర్తి అయి అర్హులైన యువతను కొత్త ఓటర్లుగా నమోదు చేయడంతో పాటు, ఫోటో మార్పులు, చిరునామా మార్పులు, కుటుంబ మార్పులు వంటి వివరాలను నవీకరించనున్నట్లు తెలిపారు.ప్రాథమిక ఓటరు జాబితా సిద్ధమైన అనంతరం జూలై 21వ తేదీ నుండి సెప్టెంబర్ 18వ తేదీ వరకు అభ్యంతరాలు, సవరణలు మరియు క్లెయిమ్స్ స్వీకరించనున్నట్లు తెలిపారు. తుది ఓటరు జాబితాను సెప్టెంబర్ 22వ తేదీన విడుదల చేయనున్నట్లు వెల్లడించారు. ఓటరు హక్కు ప్రజాస్వామ్యంలో అత్యంత విలువైన హక్కు అని, ప్రతి అర్హుడైన వ్యక్తి తప్పనిసరిగా ఓటరుగా నమోదు కావాలని జిల్లా కలెక్టర్ ప్రజలకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో డిఆర్ఓ చంద్రశేఖర్ రెడ్డి, రాయచోటి ఆర్డీఓ శ్రీనివాస్, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు, ఎలక్షన్ సెక్షన్ సూపరిండెంట్ హరి, ఎన్నికల విభాగం అధికారులు పాల్గొన్నారు.

## అన్నమయ్య జిల్లా యూనియన్ అధ్యక్షుడిగా నాగేంద్రబాబు

**రామసముద్రం, మే 29 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** రామసముద్రం మండలం చెంబకూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ల్యాబ్ టెక్నీషియన్‌గా పనిచేస్తున్న టి. నాగేంద్రబాబుకు రాష్ట్ర స్థాయి గుర్తింపు లభించింది. ఆంధ్రప్రదేశ్ హెల్త్ మెడికల్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర ఈసీ సమావేశంలో ఆయనను కొత్తగా ఏర్పడిన అన్నమయ్య జిల్లా అధ్యక్షుడిగా మూడేళ్ల కాలానికి నియమించారు. విజయవాడలో రాష్ట్ర అధ్యక్షుడు ఎ. వెంగళ్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నారు. సమావేశంలో ప్రభుత్వం వద్ద పెండింగ్‌లో ఉన్న ఉద్యోగుల సమస్యలు, జోన్, జిల్లా కేడర్ ఉద్యోగుల సమస్యల పరిష్కారంపై విస్తృతంగా చర్చించారు. ఉద్యోగుల హక్కుల పరిరక్షణకు సంఘం కట్టుబడి పనిచేస్తోందని రాష్ట్ర నాయకత్వం పేర్కొంది. మండల, జిల్లా, రాష్ట్ర స్థాయిలో ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని నాగేంద్రబాబుకు సూచించారు. ఈ సందర్భంగా నాగేంద్రబాబు మాట్లాడుతూ ఉద్యోగుల సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. తనపై నమ్మకం ఉంచి బాధ్యతలు అప్పగించిన రాష్ట్ర నాయకత్వానికి కృతజ్ఞతలు తెలిపారు.


## భూ సేకరణ ప్రక్రియ పారదర్శకంగా నిర్వహించాలి

**రైతుల అభ్యంతరాలు, సూచనలను సమగ్రంగా పరిశీలించాలి : జేసి**



**వాల్మీకిపురం,మే 29 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** వాల్మీకిపురం తాసిల్దార్ కార్యాలయంలో జాయింట్ కలెక్టర్ శివ నారాయణ శర్మ అధ్యక్షతన శనివారం వాల్మీకిపురం మండలం చింతపర్తి గ్రామానికి సంబంధించిన ఎన్‌హెచ్ఏఐ-71 ప్రాజెక్టు భూ సేకరణ అంశంపై అవార్డు ఎంక్వైరీ సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా భూ స్వాధీనం ప్రక్రియకు సంబంధించిన వివరాలు, భూ యజమానుల అభ్యంతరాలు, పరిహారం చెల్లింపులు తదితర అంశాలను సంబంధిత అధికారులతో కలిసి జేసి సమీక్షించారు. భూ యజమానులకు న్యాయం జరిగే విధంగా ప్రభుత్వం నిర్దేశించిన నిబంధనల ప్రకారం పారదర్శకంగా చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు.ప్రాజెక్టు పరిధిలో భూములు కోల్పోతున్న రైతుల సమస్యలను సానుభూతితో పరిశీలించి, వారి అభిప్రాయాలు, అభ్యంతరాలను నమోదు చేసి తగిన చర్యలు తీసుకోవాలని జాయింట్ కలెక్టర్ ఆదేశించారు. భూ స్వాధీనం ప్రక్రియలో ఎటువంటి సందేహాలు లేకుండా సంబంధిత రైతులకు పూర్తి వివరాలు తెలియజేయాలని సూచించారు.అభివృద్ధి పనులు వేగవంతంగా కొనసాగేందుకు అధికారులు సమన్వయంతో పనిచేయాలని, అదే సమయంలో రైతుల హక్కులు కాపాడబడేలా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో సంబంధిత రెవెన్యూ అధికారులు, ఎన్‌హెచ్ఏఐ ప్రతినిధులు, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

## మిట్స్ వర్సిటీలో ఉచిత మెగా వైద్య శిబిరం



**మదనపల్లె/ కురబలకోట, మే 29 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** మిట్స్ డీమ్డ్ టు బి యూనివర్సిటీ లోని ఎన్.ఎస్.ఎస్ విభాగం మరియు సత్సంగ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలోని స్వాస్థ్య హాస్పిటల్ సంయుక్తంగా ఉచిత మెగా వైద్య శిబిరాన్ని నిర్వహించారు.ఈ శిబిరంలో యూనివర్సిటీ విద్యార్థులు,అధ్యాపకులు,సిబ్బంది కి ఉచిత ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు.ఈ సందర్భంగా యూనివర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ డి. ప్రదీప్ కుమార్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఆరోగ్యం పై ప్రత్యేక శ్రద్ధ చూపించాలని అలాగే పోషక ఆహారం తీసుకోవాలని సూచనలు చేశారు.అలాగే వ్యాయామం, నిద్ర ఎంతో అవసరమని అన్నారు. స్వాస్థ్య హాస్పిటల్ నుండి వచ్చిన వివిధ విభాగాలకు చెందిన వైద్యులు ఆరోగ్య పరీక్షలు చేయించుకున్న వారికి తగు సలహాలు సూచనలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో యూనివర్సిటీ ఎగ్జిక్యూటివ్ మెంబెర్ టి.జి రవి కుమార్, రిజిస్ట్రార్ డాక్టర్ డి. ప్రదీప్ కుమార్, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ కమల్ బాషా, మెడికల్ ఆఫీసర్ డాక్టర్ చెన్నయ్య, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ పి. రాజేష్ తదితరులు పాల్గొన్నారు.



# అన్నమయ్య జిల్లా

## మాదకద్రవ్య రహిత సమాజమే లక్ష్యం

**: జిల్లా కలెక్టర్ నిశాంత్‌కుమార్**




**మదనపల్లె, మే 29 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** జిల్లాలో మాదకద్రవ్యాలను పూర్తిస్థాయిలో అరికట్టి.. మాదకద్రవ్య రహిత సమాజాన్ని నిర్మించేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ సంబంధిత అధికారులను ఆదేశించారు.శుక్రవారం కలెక్టరేట్లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్లో జిల్లా స్థాయి మాదకద్రవ్యాల కమిటీతో 'డ్రగ్స్ వద్దు బ్రో' సమీక్ష సమావేశాన్ని జిల్లా ఎస్పీ ధీరజ్ కునుబిల్లి తో కలసి కలెక్టర్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. యువత మాదకద్రవ్యాల బారిన పడకుండా వాటి వినియోగం వల్ల కలిగే అనర్థాలపై విస్తృత అవగాహన కల్పించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. "డ్రగ్స్ వద్దు బ్రో" ప్రచార పోస్టర్లలో పోలీస్ కమాండ్ కంట్రోల్ రూమ్ వాట్సాప్ నెంబర్, టోల్ ఫ్రీ నెంబర్లతో జిల్లా వ్యాప్తంగా అందరికీ తెలిసేలా ఏర్పాటు చేయాలన్నారు.జిల్లా ఎస్పీ ధీరజ్ కునుబిల్లి మాట్లాడుతూ.. జిల్లాలో మాదకద్రవ్యాల నియంత్రణకు పటిష్ట చర్యలు తీసుకుంటున్నామన్నారు.అనంతరం మాదకద్రవ్యాల నియంత్రణకు సంబంధించిన ప్రచార పోస్టర్లను అధికారులతో కలిసి కలెక్టర్, ఎస్పీ ఆవిష్కరించారు.ఈ సమావేశంలో అడిషనల్ ఎస్పీ వెంకటాద్రి, జిల్లా రవాణా శాఖ అధికారి, డీఎస్పీలు, డీఈవో, డిఎంహెచ్ఓ, మదనపల్లె ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి అడిషనల్ డి సి హెచ్ ఎస్, ప్రొబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ అధికారులు, జిల్లాఅధికారులు, డిఎస్పి, ఎస్హెచ్ఓలు తదితరులు పాల్గొన్నారు.

## శాస్త్రీయ శుభ్రత పాటించండి : డా.శ్రీగిరీష



**పీలేరు,మే 29 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** నెలసరి శుభ్రతకు అధిక ప్రాధాన్యతనిస్తే, సంబంధిత ఇన్ఫెక్షన్ల ముప్పు నుండి ప్రతి మహిళా తనను తాను కాపాడు కోవచ్చునని పి.హెచ్.సి తలుపుల ప్రధానవైద్యాధికారులు డా: శ్రీగిరీష అన్నారు. నేడు "ఋతుక్రమ ఆరోగ్యం - పరిశుభ్రత" దినోత్సవం సందర్భంగా పీలేరు పట్టణ బండ్లవంకలో యుక్త వయస్సు బాలికలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆడబిడ్డ జీవితంలో నెలసరి ప్రక్రియ ఓ.. భాగమని, శాస్త్రియంగా శుభ్రత పాటిస్తే, జననేంద్రి ఇన్ఫెక్షన్ల, మూత్ర వ్యవస్థ, చర్మ అలర్జీ, పునరుత్పత్తి సమస్య, జననాంగ క్యాన్సర్ల బారిన పడకుండా ప్రతి మహిళ తనను తాను కాపాడుకో వచ్చునని, నెలసరి కాలములో ఉపయోగించిన సాధనాలు పర్యావరణానికి హాని కలగకుండా నిర్మూలించా లని, అర్థం లేని భయాలు, అపోహాలు,వీడి ఋతుక్రమ సమయాల్లో బడి ,గుడి ఆటలు, మరియు మంచి పౌష్టికాహారం తోపాటు బాగా విశ్రాంతి తీసుకోవాలని, ఐరన్ ఎక్కువగా గల ఆహార పదార్థాలు తీసుకోవాలని, నిర్దేశించిన వ్యాయామాలు చేస్తూ నెలసరి నొప్పులను నుండి ఉపశమనం పొందాలని శ్రీగిరీష బాలికలకు సూచించారు, ఆడపిల్లకు నెలసరి అవగాహన ఇంట్లో తల్లి నుంచే మొదలవ్వాలని పిహెచ్ఎన్ కుసుమ సలహానిచ్చారు. కార్యక్రమములో డిప్యూటీ హెచ్ఈఓ కొండయ్య, పీహెచ్ఎన్ కుసుమ, ఏఎన్ఎం భార్గవి, లక్ష్మి, రెడ్డప్ప ,సిహెచ్ఓ చంద్రకళ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

## మహిళలకు అండగా నల్లారి కుటుంబం




**పీలేరు, మే 29 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** తెలుగు దేశం పార్టీ కార్యాలయంలో గురువారం మహిళలతో ప్రత్యేకంగా సమావేశమైన ఎమ్మెల్యే నల్లారి కిషోర్ కుమార్ రెడ్డి సతీమణి నల్లారి తనజా రెడ్డి వారి సమస్యలను సావధానంగా విన్నారు. ఈ సందర్భంగా మహిళలు విద్యుత్ సరఫరా, త్రాగునీటి ఇబ్బందులు, డ్రైనేజీ సమస్యలు వంటి పలు అంశాలను ఆమె దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే స్పందించిన తనజా రెడ్డి, మీ సమస్యలన్నింటినీ ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లి ప్రాధాన్యత క్రమంలో పరిష్కరించేలా చూస్తామని మహిళలకు హామీ ఇచ్చారు. "మీకు అండగా ఎమ్మెల్యే గారు, నేను ఎప్పుడూ ఉంటామని భరోసా కల్పించారు.అనంతరం, పర్వువల్ విధానంలో రెండు రోజులపాటు నియోజకవర్గంలో జరిగిన మహానాడు కార్యక్రమాన్ని విజయవంతం చేసిన మహిళలు, నాయకులు, కార్యకర్తలు, నల్లారి అభిమానులకు ఆమె ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ బలోపేతానికి మహిళా శక్తి ఎంతో అవసరమని కొనియాడారు.ఈ కార్యక్రమంలో పీలేరు మండల పార్టీ అధ్యక్షులు వారణాసి శ్రీకాంత్ రెడ్డి, మార్కెట్ యార్డ్ చైర్మన్ పురం రామమూర్తి, మండల మహిళా అధ్యక్షురాలు పురం రెడ్డెమ్మ, మొహమ్మద్ పీర్ తో పాటు పలువురు మహిళా నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## ఆసుపత్రిలో నీటి కష్టాలు తీర్చండి



**రామసముద్రం,మే 29 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** రామసముద్రం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో త్రాగునీటి సమస్య తీవ్ర రూపం దాల్చింది. ఆసుపత్రిలోని బోరు మరమ్మత్తులకు గురై రెండు నెలలుగా నీటి సరఫరా పూర్తిగా నిలిచిపోయింది. దీంతో రోగులు, వారి సహాయకులు, సిబ్బంది తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొం టున్నారు. తాగునీటి కోసం బయట నుంచి నీరు తెప్పించుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. ముఖ్యంగా ఆసుపత్రికి వచ్చే రోగులు నీటి లేక మలమూత్ర విసర్జనకూ అవస్థలు పడుతున్నారు.ఆసుపత్రి ప్రాంగణంలో పారిశుద్ధ్య సమస్యలు కూడా తలెత్తుతున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పలుమార్లు సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఇప్పటివరకు శాశ్వత పరిష్కారం చూపలేదని ఆరోపిస్తున్నారు. వేసవి కాలంలో నీటి సమస్య మరింత తీవ్రంగా మారిందని చెబుతున్నారు. ఈ విషయమై వైద్యాధికారి ప్రత్యూషను వివరణ కోరగా, బోరు మరమ్మత్తు పనులు త్వరలో పూర్తి చేసి నీటి సరఫరాను పునరుద్ధరిస్తామని తెలిపారు.

## రాయితీ విత్తనాలను సద్వినియోగం చేసుకోవాలి

**రామసముద్రం,మే 29 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** భూసారం పెంపు, పంట దిగుబడి మెరుగుదల లక్ష్యంగా ప్రభుత్వం 50 శాతం రాయితీపై జీలుగు, జనుము, పిల్లి పెసర విత్తనాలను రైతులకు అందుబాటులో ఉంచినట్లు వ్యవసాయ అధికారి జాఫర్ తెలిపారు. రామసముద్రం మండలానికి మొత్తం 110 క్వింటాళ్ల జీలుగు విత్తనాలు, 75 క్వింటాళ్ల పిల్లి పెసర విత్తనాలు, 75 క్వింటాళ్ల జనుము విత్తనాలు కేటాయించి రైతు సేవా కేంద్రాలకు సరఫరా చేసినట్లు వెల్లడించారు. జీలుగు విత్తనాల 10 కేజీల బ్యాగుకు రైతు రూ.770, పిల్లి పెసర 8 కేజీల బ్యాగుకు రూ.784, జనుము 10 కేజీల బ్యాగుకు రూ.800 చెల్లించాల్సి ఉంటుందని తెలిపారు. ఈ విత్తనాల వినియోగం వల్ల భూసారం పెరగడంతో పాటు తదుపరి పంటలకు కూడా ప్రయోజనం కలుగుతుందని చెప్పారు. రైతులు పట్టాదారు పాస్‌బుక్, ఆధార్ కార్డుతో సంబంధిత రైతు సేవా కేంద్రాల్లో సంప్రదించి రాయితీ విత్తనాలను పొందాలని సూచించారు. ప్రభుత్వం కల్పించిన ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని జాఫర్ కోరారు.

# నందిగామ ఆర్యవైశ్యుల ఆగ్రహం..పంచ్ ప్రభాకర్‌పై ఫిర్యాదు...



**నందిగామ మే29 ( నేటి మనదేశమ్ ప్రతినిధి) :** నందిగామలో ఆర్యవైశ్య సంఘం నాయకులు పంచ్ ప్రభాకర్‌పై పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఆర్యవైశ్య సామాజిక వర్గాన్ని కించపరిచేలా ఆయన మాట్లాడారని ఆరోపిస్తూ, వెంటనే చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా సంఘ నాయకులు మాట్లాడుతూ దేశవ్యాప్తంగా ఆర్యవైశ్యులకు ప్రత్యేక గుర్తింపు ఉందన్నారు. వ్యాపార రంగం మాత్రమే కాకుండా దానధర్మాలు, సేవా కార్యక్రమాలు, ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో ఆర్యవైశ్యుల పాత్ర ఎంతో గొప్పదని పేర్కొన్నారు. సమాజ అభివృద్ధికి తమ వర్గం ఎన్నో సేవలు అందిస్తోందని తెలిపారు అలాంటి గౌరవనీయమైన సామాజిక వర్గాన్ని అవమానించేలా వ్యాఖ్యలు చేయడం బాధాకరమని మండిపడ్డారు. సామాజిక వర్గాల మధ్య విభేదాలు రెచ్చగొట్టేలా మాట్లాడటం సమాజానికి మంచిది కాదన్నారు. ప్రజల్లో ద్వేషాలు పెంచే వ్యాఖ్యలను ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోమని హెచ్చరించారు. పంచ్ ప్రభాకర్ చేసిన వ్యాఖ్యలపై పూర్తి స్థాయిలో విచారణ జరిపి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని పోలీసులను కోరారు. ఈ ఫిర్యాదు కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం నాయకులు, వ్యాపారవేత్తలు, యువజన ప్రతినిధులు పాల్గొన్నారు. సమాజ గౌరవాన్ని కాపాడేందుకు అవసరమైతే ఉద్యమాలు కూడా చేపడతామని తెలిపారు.

# అనుమంచిపల్లి గ్రామంలో 20 గంటలుగా చీకట్లో గ్రామం నీటి కోసం తెలంగాణకు పరుగులు...



**నందిగామ మే29 ( నేటి మనదేశమ్ ప్రతినిధి) :** జగ్గయ్యపేట మండలం అనుమంచిపల్లి గ్రామంలో విద్యుత్ సమస్యతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గ్రామంలో విద్యుత్ సరఫరా నిలిచిపోయి 20 గంటలు గడిచినా పునరుద్ధరణ కాకపోవడంతో ప్రజల జీవనం అస్తవ్యస్తమైంది. కరెంట్ లేక బోర్లు పనిచేయక తాగునీటి కొరత తీవ్రమైంది. దీంతో గ్రామస్థులు పక్క రాష్ట్రం తెలంగాణలోని సూర్యాపేట జిల్లా నల్లగొండ గ్రామం నుంచి నీటిని తెచ్చుకుంటున్నారు. గ్రామంలో చిన్నపిల్లలు, వృద్ధులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని మహిళలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వంట చేసుకునేందుకు కూడా నీరు లేక అవస్థలు పడుతున్నామని తెలిపారు. రాత్రి సమయంలో గ్రామమంతా చీకట్లు అలుముకోవడంతో ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. విద్యుత్ సమస్యపై పలుమార్లు అధికారులకు సమాచారం ఇచ్చినా స్పందన లేదని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. ట్రాన్స్‌ఫార్మర్ లోపమా లేదా విద్యుత్ లైన్ దెబ్బతిన్నదా అన్న విషయంపై కూడా అధికారులు స్పష్టత ఇవ్వడం లేదని మండిపడుతున్నారు. మొబైల్ ఫోన్లు ఛార్జింగ్ చేసుకునే పరిస్థితి కూడా లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. వెంటనే విద్యుత్ సరఫరాను పునరుద్ధరించి, తాగునీటి సమస్యను పరిష్కరించాలని గ్రామ ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. అధికారులు స్పందించకపోతే ఆందోళనకు దిగుతామని హెచ్చరించారు

# విద్యాశాఖను భ్రష్టు పట్టించిన లోకేష్

## – మెగా డీఎస్సీ అక్రమాలపై తక్షణమే సిబిఐ దర్యాప్తునకు ఆదేశించాలి !




**పల్నాడు మే29 ( నేటి మనదేశమ్ ప్రతినిధి) :** పల్నాడు జిల్లా విద్యార్థి విభాగం ఆధ్వర్యంలో కూటమి ప్రభుత్వం నిర్వహించిన మెగా డీఎస్సీ లో జరిగిన అవకతవకలపై సిబిఐ దర్యాప్తు నిర్వహించాలని శుక్రవారం నరసరావుపేట జిల్లా కేంద్రంలోనీ స్థానిక గడియార స్తంభం వద్ద బాబాసాహెబ్ అంబేద్కర్ విగ్రహానికి వినతి పత్రం అందించారు. ఈ కార్యక్రమంలో పలనాడు జిల్లా వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ డాక్టర్ శ్రీ గోపిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి , వినుకొండ నియోజకవర్గ సమన్వయకర్త బొల్లా బ్రహ్మనాయుడు, సత్తెనపల్లి నియోజకవర్గం సమన్వయకర్త డాక్టర్ గజ్జల సుధీర్ భార్గవ్ రెడ్డి గ మరియు విద్యార్థి విభాగం పల్నాడు జిల్లా అధ్యక్షులు గుజర్లపూడి ఆకాష్ తదితరులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో పల్నాడు జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ గోపిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ.. నారా లోకేష్ విద్యా శాఖ మంత్రి కాదు ఆయన సకల శాఖ మంత్రి అని వ్యంగ్యాస్త్రాలు సంధించారు. విద్యాశాఖను లోకేష్ భ్రష్టు పట్టించాడని, ఈ కూటమి ప్రభుత్వం నిర్వహించిన మెగా డీఎస్సీ అవకతవకలతో కూడి అవినీతి మయంగా మారిందని, ఈ సందర్భంగా ఈ కూటమి ప్రభుత్వానికి సూటిగా ఐదు ప్రశ్నలు సంధించారు.. 1 కంప్యూటర్ సెక్షన్లో అవుట్సోర్సింగ్ ఉద్యోగిగా పని చేస్తున్న వ్యక్తికి కృష్ణా జిల్లా డీఎస్సీలో ఫస్ట్ ర్యాంకు ఎలా వచ్చింది? మెగా డీఎస్సీలోపేపరు లీక్ అయిన మాట వాస్తవం కాదా? పేపర్ లీక్ అయిన విషయం తెలిసి కూడా విద్యాశాఖ మంత్రి లోకేష్ మౌనంగా ఎందుకు ఉన్నారు? 2 .మెగా డీఎస్సీ మెరిట్ లిస్టు ఎందుకు రిలీజ్ చేయలేదు? మెరిట్ లిస్టు రిలీజ్ చేయకుండా మీరు ఎవరికైతే ఉద్యోగాలు ఇవ్వదలు చుకున్నారో వారికే కాల్ లెటర్స్ పంపించింది వాస్తవ కాదా? వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వ హయాంలో క్లాస్ ఫోర్ ఉద్యోగస్తులకు కూడా మెరిట్ లిస్ట్ చేసింది వాస్తవం కాదా? మెరిట్ లిస్టు రిలీజ్ చేయకుండా జాయినింగ్ లెటర్లు ఎలా ఇచ్చారు? 3 .ఆటలాడటమే తెలియని వారికి స్పోర్ట్స్ కోటా కింద 450 ఉద్యోగాలు ఒక్కొక్క ఉద్యోగం 15 లక్షలకు మీరు అమ్ముకున్నది నిజం కాదా? 4.కోర్టు మెరిట్ లిస్టు ఇవ్వమన్నా మీరు ఎందుకు స్పందించడం లేదు? 5. మేము మెగా డీఎస్సీ లో జరిగిన అవకతవకలపై సిబిఐ ఎంక్వయిరీ అడుగుతున్నా మీరు ఎందుకు వెనుకంజ వేస్తున్నారు? అని కూటమి ప్రభుత్వంపై సూటి ప్రశ్నలు సంధించారు. లోకేష్ విద్యాశాఖ మంత్రిగా బాధ్యతలు తీసుకున్న తర్వాత విద్యాశాఖను పూర్తిగా భ్రష్టు పట్టించారని , మీ కూటమి ప్రభుత్వం వచ్చి రెండు సంవత్సరాలైనా గత వైసిపి హయాంలో జగన్మోహన్ రెడ్డి నాడు నేడు కింద ప్రారంభించిన పనులను ఎందుకు పూర్తి చేయలేకపోయారని, ఉదాహరణకు నరసరావుపేట లోని మున్సిపల్ హైస్కూల్లో 2000 మంది విద్యార్థిని విద్యార్థులు చదువుతున్నారని ,గత ప్రభుత్వ హయాంలో ప్రారంభించిన పనులను ఇంతవరకు ఎందుకు పూర్తి చేయలేకపోయారని ప్రశ్నించారు? ఇది మీ చేతకానితనం కాదా? అని ప్రశ్నించారు! ఫీజు రీయింబర్స్మెంట్ చెల్లించకపోవడం వల్ల విద్యార్థులను కళాశాలలు పరీక్షలు రాయనియకుండా, హాల్ టికెట్లు ఇవ్వకుండా ఇబ్బందులు పెడుతున్నారని ,గత అసెంబ్లీ సమావేశాల్లో 1600 కోట్లు ఇస్తామని చెప్పినప్పటికీ ఇంతవరకు ఎందుకు చెల్లించలేదని ప్రశ్నించారు? లోకేష్ కి అన్ని శాఖలు కావాలని ,కానీ ఆయన శాఖలో మాత్రం అభివృద్ధి శూన్యమని, విద్యావ్యవస్థలో జగన్మోహన్ రెడ్డి చేసిన సంస్కరణ వల్ల ఈరోజు టెన్త్ క్లాస్ పరీక్షల్లో వేలాది మంది విద్యార్థులకు 500 మార్కులు దాటాయని, అది కేవలం వైఎస్ జగన్మోహన్ రెడ్డి గొప్పతనం అని తెలియజేస్తూ... మహానాడు అట్టర్ ఫ్లాప్ అయిందని ఒక్కొక్క వేదికలో 11 మంది 15 మంది 20 మంది తప్ప ప్రజలు ఎవరు ఈ మహానాడులో పాల్గొనలేదని, ఇది వాస్తవం అని, ఇది పూర్తిగా విఫలమైన ప్రభుత్వం అని ,మహానాడు ద్వారా అర్థమవుతుందని ,రాబోయే ఎన్నికల్లో వైయస్ జగన్మోహన్ రెడ్డి విజయం సాధించడం ఖాయమని, ప్రజలు తిరిగి వైఎస్ జగన్మోహన్ రెడ్డిని ముఖ్యమంత్రిగా గెలిపించుకోబోతున్నారని తెలియజేశారు ఈ కార్యక్రమంలో విద్యార్థులు ,వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు మరియు కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఈవిఎం గోడౌన్ ను తనిఖీ చేసిన జిల్లా ఇంచార్జి కలెక్టరు సంజన సింహ




**నరసరావుపేట మే29 ( నేటి మనదేశమ్ ప్రతినిధి) :** స్థానిక నరసరావుపేటలో మార్కెట్ యార్డ్ నందు ఉన్న ఎలక్ట్రానిక్ ఓటింగు మిషన్ల గోడౌన్ ను జిల్లా ఇంచార్జి కలెక్టరు సంజన సింహ శుక్రవారం తనిఖీ చేశారు. ఈవియం గోడౌన్ వద్ద సిసి కెమేరాలతో ఏర్పాటు చేసిన భద్రతా ఏర్పాట్లను ఈవియం యంత్రాలు బి.యులు, సియులు, వివిప్యాట్ లను, అక్కడి భద్రతా ఏర్పాట్లను వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలిసి పరిశీలించారు. అనంతరం పరిశీలన రిజిస్టరులో సంతకం చేశారు. కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాలు మేరకు ఈవీఎం గోడౌన్ తనిఖీలో భాగంగా ఈవియం గోడౌన్ కు వేసిన భద్రతా సీళ్లు, సిసి కెమెరాలు పనితీరు, అగ్నిమాపక దళ పరికరాలు, మొదలైనవి పరిశీలించారు. ఈ సందర్బంగా జిల్లా ఇంచార్జి కలెక్టరు మాట్లాడుతూ భారతీయ ఎన్నికల సంఘం ఆదేశాలు మేరకు ఈవియం గోడౌన్ కు పటిష్ట భద్రత కల్పించామన్నారు. ఎప్పటి కప్పుడు గౌడౌన్ ను క్షుణంగా తనిఖీ చేసి ఎన్నికల సంఘానికి నివేదిక పంపిస్తున్నామన్నారు. ఈవియం గోడౌన్ వద్ద విధులు నిర్వహిస్తున్న పోలీసు గార్డులు నిరంతరం అప్రమత్తంగా ఉండాలని జిల్లా ఇంచార్జి కలెక్టరు ఆదేశించారు.

# విజయవాడ బ్యాంక్‌లో షార్ట్ సర్క్యూట్: తప్పిన ప్రమాదం




**విజయవాడ , మే29 ( నేటి మనదేశమ్ ప్రతినిధి) :** విజయవాడ నగరంలోని ఎంజీ రోడ్డు సమీపంలో ఉన్న కోస్టల్ ఏరియా బ్యాంక్‌లోఒక్కసారిగా షార్ట్ సర్క్యూట్ సంభవించింది. ప్రమాదం జరిగిన వెంటనే బ్యాంక్ ప్రాంగణంలో దట్టమైన పొగలు అలుముకున్నాయి. దీంతో స్మోక్ అలారం మోగడంతో సిబ్బంది అప్రమత్తమయ్యారు.సమయస్ఫూర్తితో వ్యవహరించిన బ్యాంక్ ఉద్యోగులు వెంటనే కరెంటు మెయిన్స్ ఆఫ్ చేశారు. అనంతరం ఈ ప్రమాదంపై బ్యాంక్ మేనేజర్‌కు, ఫైర్ ఇంజిన్ సిబ్బందికి సమాచారం అందించారు. అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకునే లోపే సిబ్బంది అప్రమత్తతతో పెద్ద ప్రమాదం తప్పింది. అయితే, ఈ షార్ట్ సర్క్యూట్ సంభవించడానికి గల ఖచ్చితమైన కారణాలు ఇంకా తెలియాల్సి ఉందని అధికారులు పేర్కొన్నారు.

# విజయవాడ దుర్గమ్మ గుడిలో చీరల వివాదం

## : ఈవో మౌనంపై అనుమానాలు



**విజయవాడ , మే29 ( నేటి మనదేశమ్ ప్రతినిధి) :** విజయవాడ:ఇంద్రకీలాద్రిపై కొలువైన దుర్గమ్మ అమ్మవారి అలంకరణ చీరల వ్యవహారం తీవ్ర వివాదానికి దారితీసింది. ఏడాదికి రూ.10 కోట్లకు చీరల విక్రయ టెండర్ దక్కించుకున్న కాంట్రాక్టర్, భక్తులు సమర్పించే కానుకల చీరలను పక్కదారి పట్టిస్తున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. నిబంధనలకు విరుద్ధంగా కాంట్రాక్టర్ తన మనుషులకు ఐడీ కార్డులు ఇచ్చి మరీ గర్భగుడిలో ఉంచడంపై పాలకమండలి సభ్యులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు.అత్యంత పవిత్రమైన అంతరాలయంలోకి బయటి వ్యక్తులను ఎలా అనుమతిస్తారని వారు ప్రశ్నిస్తున్నారు. ఇంత జరుగుతున్నా ఆలయ ఈవో (జూ) మౌనంగా ఉండటంపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అమ్మవారి చీరల మాయంపై విచారణ జరపాలని భక్తులు డిమాండ్ చేస్తున్నారు

# కొత్తపేటలో ఘోర ప్రమాదం

## : విద్యుత్ తీగ తెగిపడి హోంగార్డు దుర్మరణం



**విజయవాడ , మే29 ( నేటి మనదేశమ్ ప్రతినిధి) :** కొత్తపేట: అకాల వర్షం, ఈదురు గాలుల కారణంగా కొత్తపేటలో ఘోర ప్రమాదం జరిగింది. స్థానిక పోలీస్ స్టేషన్‌లో పనిచేసే హోంగార్డు జానీ బక్రీద్ పండుగ సెలవులో ఉండి, గురువారం తన సొంత ఆటోలో భార్యతో కలిసి ఇంటికి తిరిగి వస్తుండగా ఈ విషాదం చోటుచేసుకుంది. కొత్తపేట పోలీస్ స్టేషన్ సమీపంలో భారీ గాలివాన కారణంగా ఒక్కసారిగా విద్యుత్ తీగ తెగి వారు ప్రయాణిస్తున్న ఆటోపై పడింది. దీంతో తీవ్ర విద్యుత్ షాక్‌కు గురై జానీ అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. ఆయన భార్య తృటిలో ప్రమాదం నుంచి తప్పించుకున్నారు. సెలవుపై వెళ్లిన సహోద్యోగి ఇలా అకాల మరణం చెందడంతో పోలీస్ సిబ్బంది, స్థానికులు తీవ్ర దిగ్భ్రాంతికి లోనయ్యారు.

# న్యాయవాదులపై దాడులకు నిరసనగా కోర్టు విధుల బహిష్కరణ




**తాడేపల్లిగూడెం మే29 ( నేటి మనదేశమ్ ప్రతినిధి) :** ఇటీవల ఏలూరులో న్యాయవాదులు పి. రమేష్, పి. పుల్లయ్యలపై జరిగిన దాడులను నిరసిస్తూ న్యాయవాదులు కోర్టు విధులను శుక్రవారం బహిష్కరించారు. సమాజంలో శాంతిభద్రతలను కాపాడే న్యాయవాదులపై దాడులు జరగడం దారుణమని, ప్రభుత్వం తక్షణమే స్పందించి న్యాయవాదులకు ప్రత్యేక రక్షణ కల్పించాలని వారు డిమాండ్ చేశారు. ఈ నిరసనలో బార్ అసోసియేషన్ అధ్యక్షులు కొవ్వూరి అప్పిరెడ్డి, ప్రధాన కార్యదర్శి కంకట శ్రీనివాసరావు, స్పోర్ట్స్ సెక్రటరీ శ్రీనుబాబు, వెంకట రామకృష్ణ, లోకేష్‌లతో పాటు పలువురు న్యాయవాదులు పాల్గొన్నారు.

# ఎండవేడికి ఉపశమనం పొందిన నగర ప్రజలు

**మామిడి రైతుల విలవిల.**

**పలుచోట్ల చెట్లు కరెంటు స్తంభాలు నేలమట్టం.**



**మచిలీపట్నం మే29 ( నేటి మనదేశమ్ ప్రతినిధి) :** నగరంలో గురువారం అర్ధరాత్రి ఎదురుగాలులతో కూడిన భారీ వర్షం కురిసింది. దాదాపు గంటకు పైగా కురిసిన వర్షం వల్ల నగర ప్రజలకు ఎండ వేడి నుండి ఉపశమనం కలిగింది. కృష్ణా జిల్లాలో అకాల వర్షం వల్ల పలు ప్రాంతాల్లో విద్యుత్ అంతరాయం కలిగింది. వర్ష బీభత్సం మామిడి రైతులకు తీవ్ర నష్టం కలిగించింది. లి గత కొన్ని రోజులుగా సూర్యుడి ప్రభావంతో మండుతున్న ఎండలతో ఉక్కిరిబిక్కిరి అయిన ప్రజలకు గురువారం రాత్రి కురిసిన భారీ వర్షం కొంత ఉపశమనాన్ని కలిగించింది. అయితే ఈ అకాల వర్షం మరోవైపు ప్రజలకు, రైతులకు తీవ్ర ఇబ్బందులను మిగిల్చింది. మచిలీపట్నం లో రోడ్లు జలమయం అయ్యాయి. అవనిగడ్డ, పామర్రు, గుడివాడ, గన్నవరం తదితర ప్రాంతాల్లో ఈదురుగాలులతో కూడిన భారీ వర్షంతో పలుచోట్ల విద్యుత్ స్తంభాలు, చెట్లు నేలకూలడంతో విద్యుత్ సరఫరా అంతరాయం ఏర్పడింది. మామిడి రైతుల ఆశలపై నీళ్లు చల్లినట్టుఅయింది. ద్విచక్ర వాహనదారులు, ఆటోలు, కారు యజమానులు, తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. అయితే తీవ్ర వేసవి తాపంతో అలసిపోయిన ప్రజలు మాత్రం వర్షం వల్ల వాతావరణం చల్లబడటంతో కొంత ఊరట పొందారు. జిల్లాలోని పలు ప్రాంతాల్లో అధికారులు అప్రమత్తమై విద్యుత్ సరఫరా పునరుద్ధరణ చర్యలు చేపట్టారు.

# సాంఘిక సంక్షేమ శాఖలో రాష్ట్ర స్థాయి ఉత్తమ అధికారిగా షేక్ షాహిద్ బాబు కి అవార్డు



**మచిలీపట్నం మే29 ( నేటి మనదేశమ్ ప్రతినిధి) :** నిరంతరం అలుపెరుగని శ్రామికునిలా, వృత్తినే దైవంగా భావించే జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ రాష్ట్రస్థాయి ఉత్తమ అధికారిగా రాష్ట్ర ప్రభుత్వం చేతుల మీందుగా అవార్డు అందుకున్నారు. ఇటీవల విడుదలైన ఇంటర్మీడియట్, ఎస్ఎస్‌సీ ఫలితాల్లో కృష్ణా జిల్లా సాంఘిక సంక్షేమ శాఖకు చెందిన విద్యార్థులు రాష్ట్ర స్థాయిలో ఉత్తమ ఫలితాలు సాధించడంతో, ఆ విజయానికి విశేష కృషి చేసిన షేక్ షాహిద్ బాబు కి ఈ అవార్డు దక్కడం పట్ల సిబ్బంది హర్షం వ్యక్తం చేశారు. సాంఘిక సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ గా కృష్ణా జిల్లాకి సంబంధించి రాష్ట్ర స్థాయి ఉత్తమ అధికారి అవార్డు షాహిద్ బాబు కి ప్రదానం చేశారు. ఈ విద్యా సంవత్సరం సాంఘిక సంక్షేమ శాఖ పాఠశాలల్లో విద్యార్థుల విద్యా ప్రగతిని ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ కిందిస్థాయి అధికారులను సిబ్బందిని అప్రమత్తం చేశారు. విద్యార్థులలో విద్యా ప్రమాణాల పెంపుకు విశేష కృషి చేశారు. అంతేగాక తరచూ సాంఘిక సంక్షేమ శాఖ హాస్టల్ లను పర్యవేక్షించి విద్యార్థులకు ఉన్న స్థితి నుండి ఉన్నత స్థితికి ఎలా ఎదగాలి అనేది ఉద్బోధించారు. విద్యలో వెనుకబడిన విద్యార్థులకు అదనపు శిక్షణా తరగతుల నిర్వహణకు కృషి చేశారు. సాంఘిక సంక్షేమ శాఖ వార్డెన్లకు, అసిస్టెంట్ సోషల్ వెల్ఫేర్ అధికారులకి, సోషల్ వెల్ఫేర్ అధికారులకి, సిబ్బందికి ఎప్పటికప్పుడు సమీక్ష సమావేశాలు నిర్వహిస్తూ విద్యార్థుల విద్యా ప్రగతిని తెలుసుకుంటూ వారి విద్యా పురోభివృద్ధికి ఎనలేని కృషి చేశారు. వీరి కృషికి గుర్తింపుగా ప్రభుత్వం ఉత్తమ అధికారిగా అవార్డు ప్రకటించడం పట్ల జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ హాస్టల్స్ వార్డెన్లు, అసిస్టెంట్ సోషల్ వెల్ఫేర్ అధికారులు, సోషల్ వెల్ఫేర్ అధికారులు, సిబ్బంది హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి బాల వీరాంజనేయ స్వామి, సాంఘిక సంక్షేమశాఖ ప్రధాన కార్యదర్శి ఎం.ఎం. నాయక్, డైరెక్టర్ లావణ్య వేణి , ఏపీ ఎస్ డబ్ల్యూ ఆర్ ఎస్ కార్యదర్శి ప్రసన్న వెంకటేష్ పలువురు ఉన్నతాధికారులు షేక్ షాహిద్ బాబును అభినందించి, వారు చేసిన సేవల్ని కొనియాడారు. విద్యార్థుల విద్యా ప్రమాణాల పెంపు, ఉత్తమ ఫలితాల సాధనకు షాహిద్ బాబు చేసిన కృషిని ప్రశంసించారు.


# పాటలు వాడినందుకు 400 కోట్లు కట్టాలా?



ప్రస్తుతం బాలీవుడ్ దృష్టంతా నెక్స్ట్ బిగ్ రిలీజ్ 'హై జవానీతో ఇష్క్ హోనా హై' మీదే ఉంది. వరుణ్ ధావన్ హీరోగా మృణాల్ ఠాకూర్, పూజా హెగ్డే కథానాయికలుగా సీనియర్ దర్శకుడు డేవిడ్ ధవన్ రూపొందించిన చిత్రమిది. భర్త, భార్య.. మధ్యలో ప్రేయసి.. ఈ తరహా ఎంటర్టైన్మెంట్ కథతో తెరకెక్కిక చిత్రమిది. జూన్ 5న రాబోతున్న ఈ సినిమాపై మంచి అంచనాలే ఉన్నాయి. దీని ప్రోమోలు, పాటలు అన్నీ జనాల్లోకి సినిమాను బాగానే తీసుకెళ్లాయి. మంచి ఎంటర్టైనర్ అవుతుందనే అంచనాలున్నాయి ఈ చిత్రం మీద. కానీ విడుదల ముంగిట ఈ సినిమాకు పెద్ద షాక్ తగిలింది. ప్రముఖ నిర్మాణ సంస్థ పూజా ఎంటర్టైన్మెంట్స్ ఏకంగా రూ.400 కోట్లకు ఈ చిత్ర మేకర్స్ మీద దావా వేయడం బాలీవుడ్లో చర్చనీయాంశంగా మారింది. తమ సంస్థలో తెరకెక్కిన ఐకానిక్ హిట్ మూవీ 'బీవీ నంబర్ 1' నుంచి బాగా పాపులర్ అయిన పాటలను, లిరిక్స్‌ను తమ అనుమతి లేకుండా వాడుకున్నారంటూ ఆ సంస్థ లీగల్ యాక్షన్‌కు రెడీ అయింది. తమకు రూ.400 కోట్ల డబ్బులు చెల్లించడమే కాక.. ఈ పాటలను సినిమా నుంచి తొలగించాలని, సినిమా టైటిల్ కూడా మార్చాలని ఆ సంస్థ డిమాండ్ చేసింది. ఒకవేళ దర్శకుడు డేవిడ్ ధావన్ ఈ డిమాండ్లను పట్టించుకోకపోతే ఇంకో రూ.100 కోట్లు అదనంగా పరిహారం చెల్లించాలని ఆ సంస్థ స్పష్టం చేసింది. ఐతే అనుమతి లేకుండా పాటలు వాడుకుంటే.. మరీ వందల కోట్ల నష్టపరిహారం కోరడమేంటి అనే ప్రశ్నలు వినిపిస్తున్నాయి. సాధారణంగా ఇలాంటి పాత పాటలను ఒక మాట చెప్పి వాడేసుకుంటూ ఉంటారు. అలా చెప్పని పక్షంలో వార్నింగ్ ఇస్తుంటారు. కానీ పూజా ఎంటర్టైన్మెంట్స్ సంస్థ మరీ ఈ స్థాయిలో డిమాండ్లు చేయడం చర్చనీయాంశం అయింది. పూజా సంస్థకు 'బడేమియా చోటేమియా' సహా కొన్ని సినిమాల వల్ల భారీ నష్టాలు వాటిల్లాయి. ఆ నష్టాలన్నింటినీ ఇలా భర్తీ చేసుకోవాలనుకుంటున్నారా అంటూ కౌంటర్లు వేస్తున్నారు నెటిజన్లు.




## జగపతికి సుకుమార్ ఇచ్చిన షాక్



విలన్, క్యారెక్టర్ పాత్రల్లోకి మారాక జగపతి బాబుకు 'ది బెస్ట్' అనదగ్గ రోల్స్ ఇచ్చిన దర్శకుల్లో సుకుమార్ ఒకరు. 'నాన్నకు ప్రేమతో'లో కృష్ణమూర్తి అనే స్టైలిష్ విలన్ పాత్రలో జగపతి ఎంతగా మెప్పించారో.. 'రంగస్థలం'లో ప్రెసిడెంట్ పాత్రలో అంతకుమించి ఆకట్టుకున్నారు. 'పుష్ప' సినిమాలో సైతం ఆయన పాత్రకు మంచి రెస్పాన్సే వచ్చింది. తనకు ఎంతో నచ్చిన దర్శకుల్లో సుకుమార్ ఒకడని చెబుతూ.. ఆయన చిన్న చిన్న విషయాలను కూడా ఎంతగా పట్టించుకుంటారో, ఎంత సూక్ష్మ పరిశీలన ఉంటుందో ఒక ఇంటర్వ్యూలో వెల్లడించాడు జగపతిబాబు. 'పుష్ప' సినిమాలో తాను చేసిన సెంట్రల్ మినిస్టర్ పాత్ర కోసం డబ్బింగ్ చెప్పాక, ఎలా ఉందో వినమంటూ వాయిస్ మెసేజ్ పంపాడట జగపతిబాబు. ఐతే అది వినగానే కూర్చుని వద్దు, నిలుచుని, నడుస్తూ డబ్బింగ్ చెప్పండి అంటూ మెసేజ్ ఇచ్చాడట సుకుమార్. తాను కూర్చుని డబ్బింగ్ చెప్పిన విషయం సుకుమార్‌కు ఎలా తెలిసిందా అని తాను షాకైపోయానని.. సుకుమార్ అబ్జర్వేషన్ ఎలా ఉంటుందో చెప్పడానికి ఇది ఉదాహరణ అని జగపతి చెప్పాడు. డబ్బింగ్ థియేటర్లో నడవడానికి అవకాశం ఉండదని.. దీంతో ఒక మైక్ తీసుకుని బయట నడుస్తూ తన వాయిస్ రికార్డ్ చేయించానని జగపతి వెల్లడించాడు. సుకుమార్ లాగే ఆయన శిష్యుడు బుచ్చిబాబు సైతం డబ్బింగ్ విషయంలో చాలా స్ట్రిక్ట్‌గా ఉంటాడని.. 'పెద్ది'లో అప్పల సూరి పాత్రకు డబ్బింగ్ చెప్పడానికి తన కెరీర్లో ఎన్నడూ పడనంత కష్టం పడ్డానని జగపతి చెప్పాడు. ఈ పాత్ర భాష, యాస చాలా భిన్నంగా ఉంటాయని.. వాటిని పట్టుకుని, పాత్రలోని ఎమోషన్‌కు తగ్గట్లు డబ్బింగ్ చెప్పడం చాలా కష్టమైందని.. రోజు మొత్తంలో రెండే రెండు డైలాగులు డబ్బింగ్ చెప్పిన సందర్భం కూడా ఉందని ఆయన చెప్పారు. తన కెరీర్లో ది బెస్ట్ క్యారెక్టర్లలో అప్పలసూరి ఒకటని ఆయనన్నారు.

## హృతిక్ తో రజిని సినిమా గుర్తుందా.. ఇప్పుడు జైలర్ 2?



సూపర్ స్టార్ రజనీకాంత్, దర్శకుడు నెల్సన్ దిలీప్ కుమార్ కలయికలో తెరకెక్కుతున్న జైలర్ 2 విడుదల తేదీ ఇప్పటిదాకా ఖరారు కాలేదు. ముందుగా ప్లాన్ చేసుకున్న ప్రకారం అయితే ఆగస్ట్ 14 రావాలి. కానీ ఇంకా షూటింగ్ కొంచెం బ్యాలన్స్ ఉండటంతో పాటు పోస్ట్ ప్రొడక్షన్ కార్యక్రమాలకు ఎక్కువ సమయం అవసరం కావడంతో మళ్ళీ వాయిదా వేశారు. ఇది పక్కాగా తెలుసుకున్న తర్వాతే సూర్య విశ్వనాథ్ అండ్ సన్స్ ఆ తేదీని అధికారికంగా లాక్ చేసుకుంది. జైలర్ 2 ప్రధాన సమస్య క్యామియోలు. శివ రాజ్ కుమార్ తో ఇబ్బంది రాలేదు కానీ ఈసారి కొత్త అతిధులను తీసుకురావాలన్న ఉద్దేశంతో ముందు బాలకృష్ణని ట్రై చేశారు. రజనితో ఎంత అనుబంధం ఉన్నా ఇప్పుడున్న పరిస్థితుల్లో అది చేయలేనని సున్నితంగా నో చెప్పారు. తర్వాత షారుఖ్ ఖాన్ ఆల్మోస్ట్ ఫిక్స్ అన్నారు. గతంలో రా వన్ లో రజిని చిన్న క్యామియో చేశారు కాబట్టి ఆ ఋణం తీర్చుకుంటారని అనుకున్నారు. కానీ కింగ్ షూట్ వల్ల డేట్స్ దొరకలేదు. ఇప్పుడు హృతిక్ రోషన్ కోసం ట్రై చేస్తున్నట్టు చెన్నై టాక్. సరిగ్గా నలభై సంవత్సరాల క్రితం 1986లో రజనీకాంత్ హీరోగా భగవాన్ దాదా వచ్చింది. అందులో చైల్డ్ ఆర్టిస్ట్ గా హృతిక్ నటించాడు. అతని తండ్రి రాకేష్ రోషన్ నిర్మాత ప్లస్ మరో ముఖ్య పాత్ర పోషించాడు. తర్వాత మళ్ళీ ఈ కలయిక సాధ్యం కాలేదు. ఇప్పుడు నిజంగా అడిగితే హృతిక్ చేస్తాడా చేయడానే దాని గురించి సినీ వర్గాలు ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. ఎందుకంటే గెస్టు రోల్స్ అంటే హృతిక్ సుముఖత చూపడు. ఈ లెక్కన వినాయక చవితికి మాత్రమే జైలర్ 2 వచ్చే ఛాన్స్ ఉంది. ముత్తువేల్ పాండియన్ జైలర్ కాక ముందు ఏం చేశాడనే ఎపిసోడ్స్ లో పైన చెప్పిన ప్రత్యేక పాత్రలు వస్తాయట. ఇది పూర్తి చేయగానే నెల్సన్ దిలీప్ కుమార్ కు ఇంకో పెద్ద బాధ్యత ఉంది. కమల్ హాసన్ -- రజనీకాంత్ మల్టీస్టారర్ ని తెరకెక్కించాలి. ఈ ప్రాజెక్టు పరంగా తను చాలా ఒత్తిడి ఎదురుకోబోతున్నాడు. ఇద్దరు దర్శకులు మారాక తన చేతికి వచ్చింది. జైలర్ 2 పెద్ద విజయం సాధిస్తే దానికి మరింత ఊపొస్తుంది.

## పైరసీని ఆపితే ప్రపంచాన్ని జయించినట్టే



వచ్చే వారం విడుదల కాబోతున్న పెద్దికి మదరాస్ హైకోర్టు యాంటీ పైరసీ ఇంజక్షన్ రక్షణ కల్పించింది. అంటే ఎవరైనా ఈ సినిమాని పైరసీ చేసి వెబ్ సైట్స్ లో పెట్టినా, ఎక్కడైనా యాప్స్ లేదా ఆన్ లైన్ ద్వారా రవాణా చేసినా వెంటనే కట్టడి చేసే స్వతంత్రం నిర్మాణ సంస్థకు ఉంటుంది. అంటే ఉదాహరణకు ఫలానా ఏబిసి సైట్ లో ఎవరో పెద్ది అప్లోడ్ చేశారనుకుందాం. న్యాయస్థానం ఆదేశాల ప్రకారం ఎలాంటి అనుమతులు అవసరం లేకుండా ఇంటర్ నెట్ సర్వీస్ ప్రొవైడర్లు వాటిని తక్షణం తీసేయాలి. ఇది నిజంగా ఫలితం ఇస్తే ప్రపంచాన్ని జయించినట్టే. ఎందుకంటే ఎన్ని చర్యలు తీసుకున్నా దశాబ్దాలుగా ఇండస్ట్రీని పైరసీ భూతం వదల్లేదు. ఆ మధ్య తమిళనాడు సీఎం విజయ్ జన నాయగన్ హఠాత్తుగా హెచ్డిలో లీకై కోలీవుడ్ ని కుదిపేసింది. నిర్మాణ సంస్థ సకాలంలో స్పందించి అన్నీ తీయించేసినా అప్పటికే లక్షల్లో జనాలు చూసేశారు. అంతకు ముందు తండేల్, హిట్ 3, గేమ్ ఛేంజర్ లాంటి ఎన్నో కొత్త సినిమాలు ఈ రాకాసి బారిన కోట్ల రూపాయల నష్టం చవి చూశాయి. ఇప్పుడు పెద్ది వంతు వచ్చింది. నిర్మాత ఈ సవాల్ ని ఎలా ఎదురుకుంటారో చూడాలి. ఒకవేళ సక్సెస్ అయితే ఇతర ప్రొడ్యూసర్లకు కూడా దారి దొరికినట్టు అవుతుంది. ఎందుకంటే జూన్ నుంచి వరసగా మంచి కంటెంట్ ఉన్న పెద్ద సినిమాలు క్యూలో ఉన్నాయి. లెనిన్, ప్యారడైజ్, విశ్వనాథ్ అండ్ సన్స్, జైలర్ 2, విశ్వంభర, స్వయంభు,భోగి లాంటివి భారీ అంచనాలతో థియేటర్లకు వస్తున్నాయి. వీటికి కూడా ఇంజక్షన్ ఆర్డర్స్ లాంటివి చాలా అవసరమవుతాయి. రవి అరెస్ట్ కాగానే ఐబొమ్మ అంతరించిపోయిదనుకున్న టైంలో ఇటీవలే మళ్ళీ రీ ఎంట్రీ ఇవ్వడం పోలీసులను సైతం షాక్ కు గురి చేసింది. బెయిలు మీద బయటికి వచ్చిన రవి తనకు సంబంధం లేదని చెబుతున్నా ఇన్వెస్టిగేషన్ అయితే జరుగుతోంది. పెద్ది మీద వందల కోట్ల థియేటర్ బిజినెస్ జరిగింది. రికవరీ జరగాలంటే అద్భుతమైన టాక్ తో పాటు పైరసీ ని అణిచివేయాలి. ఇందులో ఎంతవరకు సఫలీకృతమవుతారో ఇంకొద్ది రోజులు ఆగితే క్లారిటీ వస్తుంది.

# బిజినెస్ న్యూస్

## అందుకే.. ఒక్కసారిగా పెరిగిన గోల్డ్ రేటు!



బంగారం ధరల తగ్గుదలకు బ్రేక్ పడింది. ఈ రోజు (మే 29) గోల్డ్ రేటు ఒక్కసారిగా పెరిగింది. ఉన్నట్టుండి పసిడి ధరలు పెరగడానికి కారణాలు ఏమిటనేది ఈ కథనంలో తెలుసుకుందాం. బంగారం ధరల పెరుగుదలకు ప్రధాన కారణం.. అమెరికా-ఇరాన్ కాల్పుల విరమణ ఒప్పందం కుదిరే అవకాశం ఉందన్న వార్తలు. ద్రవ్యోల్బణం, అమెరికా వడ్డీ రేట్ల పెంపుపై కొనసాగుతున్న ఆందోళనలు కూడా పసిడి ధరలపై ప్రభావం చూపించిందని న్యూస్ ఏజెడ్ తన నివేదికలో వెల్లడించింది. మార్కెట్ వివరాల ప్రకారం.. స్పాట్ గోల్డ్ ధర 0.3 శాతం పెరిగి ఔన్స్‌కు సుమారు 4,505.57 డాలర్లకు చేరింది. అదే సమయంలో అమెరికా గోల్డ్ ఫ్యూచర్స్ కూడా పెరిగి 4,535.90 డాలర్ల వద్ద ట్రేడ్ అయ్యాయి. గోల్డ్‌సిల్వర్ సెంట్రల్ మేనేజింగ్ డైరెక్టర్ బ్రియాన్ లాన్ ప్రకారం.. కాల్పుల విరమణ ప్రకటన రాకముందు ధరలు ఇంకా పడిపోతాయని భావించారు. కానీ అమెరికా-ఇరాన్ మధ్య ఒప్పందాలకు సంబంధించిన వార్తలు బయటకు రావడంతో రలు ఒక్కసారిగా పెరిగాయి. ప్రస్తుతం మార్కెట్ పరిస్థితి చాలా అస్థిరంగా ఉందని ఆయన పేర్కొన్నారు. అమెరికా-ఇరాన్ మధ్య ఒప్పందం ప్రకారం హార్ముజ్ జలసంధి ద్వారా షిప్పింగ్‌పై ఉన్న ఆంక్షలను సడలించే అవకాశం ఉంది. ఇది ప్రపంచ చమురు మరియు వాణిజ్య రవాణాపై కూడా ప్రభావం చూపుతుంది. అయితే.. ఈ ఒప్పందం ఇంకా పూర్తిగా ఫైనల్ కాలేదు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఆమోదం ఇంకా రావాల్సి ఉంది. అదే.. సమయంలో ఇరాన్ ప్రభుత్వ మీడియా కూడా ఈ ఒప్పందం పూర్తిగా ఖరారు కాలేదని తెలిపింది.

## 'శాంతి'పై అనిశ్చితి.. సెన్సెక్స్ 1092 పాయింట్లు డౌన్



దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు భారీ నష్టాల్లో ముగిశాయి. ఉదయం స్వల్ప లాభాల్లో ప్రారంభమైన సూచీలు.. మధ్యాహ్నం వరకు స్వల్ప లాభాల్లో ట్రేడయ్యాయి. ఆఖర్లో అమ్మకాల ఒత్తిడితో భారీ నష్టాల్లోకి జారుకున్నాయి. అమెరికా- ఇరాన్ మధ్య శాంతి ఒప్పందం విషయంలో అనిశ్చితి, ఎఫ్ఐఐల విక్రయాలు కొనసాగుతుండటం సూచీలపై ప్రతికూల ప్రభావం చూపింది. దీంతో సెన్సెక్స్ ఇంట్రాడే గరిష్ఠాల నుంచి 1300 పాయింట్ల మేర నష్టపోగా.. నిఫ్టీ 23,550 దిగువన ముగిసింది. మదుపర్ల సంపద రూ.5 లక్షల కోట్లు క్షీణించి రూ.466 లక్షల కోట్లకు చేరింది. సెన్సెక్స్ ఉదయం 75,988.51 (క్రితం ముగింపు 75,867.80) పాయింట్ల వద్ద లాభాల్లో ప్రారంభమైంది. ఇంట్రాడే 76,220.02 పాయింట్ల వద్ద గరిష్ఠాన్ని తాకిన సూచీ.. ఆఖర్లో అమ్మకాల ఒత్తిడి ఎదుర్కొంది. దీంతో 74,589.11 పాయింట్ల వద్ద కనిష్ఠానికి చేరింది. చివరికి 1092.06 పాయింట్ల నష్టంతో 74,775.74 వద్ద ముగిసింది. నిఫ్టీ 359.40 పాయింట్ల నష్టంతో 23,547.75 వద్ద స్థిరపడింది. డాలరుతో రూపాయి మారకం విలువ 95.05గా ఉంది. సెన్సెక్స్ 30 సూచీలో టెక్ మహీంద్రా, హెచ్‌సీఎల్ టెక్నాలజీస్, ఎల్అండ్‌టీ, ఇన్ఫోసిస్ షేర్లు మిగిలిన షేర్లు నష్టపోయాయి. పవర్‌గ్రిడ్ కార్పొరేషన్, ఇండిగో, ఎన్టీపీసీ, మహీంద్రా అండ్ మహీంద్రా, టాటా స్టీల్ షేర్లు ప్రధానంగా నష్టపోయాయి. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 91.40 డాలర్ల వద్ద కొనసాగుతుండగా.. బంగారం ఔన్సు 4530 డాలర్ల వద్ద ట్రేడవుతోంది.

కారణాలు ఇవీ..

అమెరికా - ఇరాన్ మధ్య శాంతి ఒప్పందం విషయంలో ఇంకా స్పష్టత రాకపోవడం స్టాక్ మార్కెట్ నష్టానికి ప్రధాన కారణం. అమల్లో ఉన్న కాల్పుల విరమణ పొడిగింపు, అణు కార్యక్రమంపై చర్చలను ప్రారంభించేందుకు అమెరికా, ఇరాన్ ప్రతినిధులు ఓ తాత్కాలిక ఒప్పందానికి చేరువైనా.. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ దీనికి ఆమోదం తెలపాల్సి ఉన్నట్లు వార్తలు వస్తున్నాయి. ఓ వైపు చర్చలు జరుపుతూనే మరోవైపు ఇరు దేశాలు దాడులు, ప్రతీకార దాడులకు దిగుతుండడం మదుపర్లను ఆందోళనకు గురిచేస్తోంది. దీంతో వారాంతంలో స్టాక్ మార్కెట్‌పై ఆ ప్రభావం పడింది.

దేశీయ ఈక్విటీ మార్కెట్ల నుంచి విదేశీ మదుపర్ల తరలిపోవడమూ సెంటిమెంట్‌ను దెబ్బతీస్తోంది. బుధవారం రూ.1040 కోట్ల విలువైన ఈక్విటీ షేర్లను విక్రయించారు. 2025 ఏడాది పొడవునా విక్రయించిన దానికంటే ఎక్కువగా ఈ ఏడాది ఇప్పటికే పెద్ద మొత్తంలో ఈక్విటీ షేర్లను విదేశీ మదుపర్లు విక్రయించడమూ ప్రతికూల ప్రభావం చూపింది.

ఈ సారి వర్షాకాలం సీజన్‌లో సాధారణం కంటే తక్కువ వర్షపాతం నమోదు కావొచ్చన్న వాతావరణ శాఖ అంచనాలు కూడా స్టాక్ మార్కెట్ నష్టాలకు కారణమయ్యాయి.

## రూ.1.4 కోట్ల బిల్లు కస్టమర్లకు వాపస్!



వ్యాపారంలో లాభాల కంటే వినియోగదారుల నమ్మకమే ముఖ్యమని బార్బెక్యూ రెస్టారెంట్ తెలిపింది. తాము అందించిన ఆహారం సొంత నాణ్యతా ప్రమాణాలకు అనుగుణంగా లేదని గ్రహించిన సదరు యాజమాన్యం.. ఏకంగా కస్టమర్లకు సుమారు రూ.1.4 కోట్లు (1,62,000 అమెరికన్ డాలర్లు / 1.1 మిలియన్ యువాన్లు) తిరిగి చెల్లించింది. కస్టమర్ల నుంచి ఎలాంటి ఫిర్యాదులు రాకపోయినా సంస్థే స్వయంగా ముందడుగు వేసి ఈ నిర్ణయం తీసుకుంది. 'ది సౌత్ చైనా మార్నింగ్ పోస్ట్' నివేదిక ప్రకారం.. చైనావ్యాప్తంగా 142 అవుట్‌లెట్లతో విస్తరించిన ప్రసిద్ధ బ్రాండ్ 'వెరీ లాంగ్ అగో లాంబ్ స్కేవర్స్' ఈ నిర్ణయాన్ని తీసుకుంది.

అసలేం జరిగింది? గ్రిల్లింగ్‌లో లోపమే కారణమా?

ఈ ఏడాది ఫిబ్రవరి నెలలో కంపెనీకి చెందిన 24 అవుట్‌లెట్లలో దాదాపు 48,000 టేబుల్స్ వద్ద భోజనం చేసిన కస్టమర్లను రెస్టారెంట్ యాజమాన్యం ఈ నెల ప్రారంభంలో స్వయంగా సంప్రదించింది. అంతర్గత నాణ్యత సమీక్షలో ఒక షాకింగ్ నిజం బయటపడటమే దీనికి కారణం. ఆ సమయంలో కొత్తగా ప్రవేశపెట్టిన గ్రిల్లింగ్ పరికరాల్లో ఉష్ణోగ్రత స్థిరంగా లేకపోవడం వల్ల, మటన్ కబాబ్‌లు ఆశించిన స్థాయిలో గ్రిల్ కాలేదని కంపెనీ గుర్తించింది. కస్టమర్ల నుంచి అధికారికంగా ఎలాంటి ఫిర్యాదులు రానప్పటికీ తమ బ్రాండ్ విలువలకు కట్టుబడి సదరు మటన్ స్కేవర్ల ధరలో 50 శాతం మొత్తాన్ని ఖాతాదారులకు రీఫండ్ చేసింది.

నిజాయితీయా? మార్కెటింగ్ జిమ్మిక్కా?

ఈ భారీ వాపసు కార్యక్రమం నెట్టింట వైరల్‌గా మారడంతో భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. 'లాభాల కంటే కస్టమర్ల సంతృప్తికే ప్రాధాన్యతనిస్తూ బాధ్యతాయుతంగా వ్యవహరించిన రెస్టారెంట్ నిజాయితీ అమోఘం' అని మెజారిటీ నెటిజన్లు ప్రశంసలు కురిపిస్తున్నారు. అయితే, మరికొందరు మాత్రం ఇది బ్రాండ్ ఇమేజ్‌ను పెంచుకోవడానికి, పబ్లిసిటీ కోసం ప్లాన్ చేసిన ఒక తెలివైన మార్కెటింగ్ వ్యూహం కావచ్చునని సందేహం వ్యక్తం చేస్తున్నారు.

## టయోటా అర్బన్ క్రూయిజర్ ఎబెల్లా వచ్చేసింది.. సింగిల్ ఛార్జ్‌తో 543km



ప్రముఖ కార్ల తయారీ కంపెనీ టయోటా కిర్లోస్కర్ మోటార్ దేశంలో తొలి విద్యుత్ కారు అర్బన్ క్రూయిజర్ ఎబెల్లా (౦శీఎశ్ఞు ఖతీఃఎఖఅ జతీబఱంవతీ జుఎవశ్రీశ్రీఖ)ను లాంచ్ చేసింది. హ్యుందాయ్ క్రెటా ఎలక్ట్రిక్, ఎంజీ జడ్ఎస్, మారుతీ సుజుకీ ఇ-విటారాకు పోటీగా.. మిడ్ సైజ్ ఎస్‌యూవీ సెగ్మెంట్‌లో దీన్ని లాంచ్ చేసింది. మారుతీ సుజుకీ ఈ-విటారా ప్లాట్‌ఫామ్‌పై ఈ కారు రూపొందినప్పటికీ.. టయోటా డిజైన్ ఎలిమెంట్లను జోడించారు. దీని ధరను రూ.23.60 లక్షలుగా (ఎక్స్‌షోరూమ్) కంపెనీ నిర్ణయించింది. టయోటా అర్బన్ క్రూయిజర్ ఎబెల్లా రెండు బ్యాటరీ వేరియంట్లలో (49 కెడబ్ల్యూహెచ్, 61 కెడబ్ల్యూహెచ్) లభ్యమవుతుంది. అధిక బ్యాటరీ సామర్థ్యం కలిగిన వేరియంట్ సింగిల్ ఛార్జ్‌తో 543 కిలోమీటర్లు ప్రయాణిస్తుందని కంపెనీ పేర్కొంది. ఇందులో అమర్చిన మోటార్ 172 బీహెచ్‌పీ, 189 ఎన్ఎం టార్క్‌ను ఉత్పత్తి చేస్తుంది.

18 అంగుళాల అల్లాయ్ వీల్స్ ఇచ్చారు. ఐదు మోనోటోన్, నాలుగు డ్యూయల్ టోన్ ఎక్స్‌టీరియర్ కలర్ ఆప్షన్లతో ఈ కారు లభ్యమవుతుంది. క్యాబిన్ లోపల 10.25 అంగుళాల డిజిటల్ ఇన్‌స్ట్రుమెంట్ క్లస్టర్, 10.1 అంగుళాల ఇన్ఫోటైన్‌మెంట్ సిస్టమ్ ఇచ్చారు. ఇది వైర్‌లెస్ ఆండ్రాయిడ్ ఆటో, యాపిల్ కార్ ప్లేకు సపోర్ట్ చేస్తుంది.

పనోరమిక్ సన్‌రూఫ్, 12 కలర్ ఆప్షన్లతో కూడిన యాంబియెంట్ లైటింగ్, వెంటిలేటెడ్ ఫ్రంట్ సీట్స్ ఉన్నాయి. వైర్‌లెస్ ఫోన్ ఛార్జింగ్, జేబీఎల్ సౌండ్ సిస్టమ్, ఆటోమేటిక్ క్లయిమేట్ కంట్రోల్, మల్టిపుల్ యూఎస్‌బీ పోర్ట్స్ ఇచ్చారు. ఇన్-క్యాబిన్ ఎయిర్‌ప్యూరిఫైర్ సదుపాయం కూడా ఉంది. స్టాండర్డ్‌గా 7 ఎయిర్‌బ్యాగులు ఇస్తున్నారు. ఏబీఎస్, ఈబీడీ, ఈఎస్‌పీ, 360 డిగ్రీల కెమెరా, లెవల్-2 అడాస్ ఫీచర్లు ఉన్నాయి.

## ముక్కంటీశుని సేవలో రాజమండ్రి ఎమ్మెల్యే ఆదిరెడ్డి



**శ్రీకాళహస్తి, మే 29 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** శ్రీకాళహస్తీశ్వరాలయంలో నిర్వహించే మహిమా నిత్య రాహు కేతు దోష నివారణ పూజలను రాజమండ్రి ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ కుటుంబ సభ్యులతో కలసి ఆలయం కు విచ్చేశారు.శుక్రవారం సహస్ర లింగం వద్ద 5 వేల రూపాయల ప్రత్యేక రాహు కేతు కాల సర్ప దోష నివారణ పూజలు నిర్వహించుకున్నారు వారికి దక్షిణ గోపురం వద్ద ఆలయ ఇఓ బికె వెంకటేశులు,బోర్డు సభ్యులు స్వాగతం పలికారు తరువాత స్వామి అమ్మవార్ల ఆలయాల్లో అంతరాలయ దర్శనం ఏర్పాటు చేశారు. అనంతరం వేద పండితులచే ప్రత్యేక ఆశీర్వచనం స్వామి అమ్మవార్ల చిత్ర పటం తీర్ద ప్రసాదాలు ఆలయ ఇఓ బికె వెంకటేశులు,బోర్డు సభ్యులు గుర్రప్ప శెట్టి అందజేశారు.

## అక్షరాస్యతలో జిల్లాను అగ్రస్థానంలో నిలపాలి

### - డిఆర్ఓ నరసింహులు



**తిరుపతి,మే 29 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** తిరుపతి జిల్లాను అక్షరాస్యతలో అగ్రస్థానంలో నిలిపేందుకు అన్ని శాఖలు కలిసి కట్టుగా కృషి చేయాలని జిల్లా రెవిన్యూ అధికారి నరసింహులు పిలుపునిచ్చారు. కలెక్టరేట్‌లో అక్షర ఆంధ్ర ఉల్లాస్ కార్యక్రమం జిల్లా సమన్వయ కమిటీ సమావేశాన్ని శుక్రవారం నిర్వహించారు.సమావేశంలో పాల్గొన్న డిఆర్ఓ మాట్లాడుతూ సమిష్టి కృషితో జిల్లాలో నిరక్షరాస్యత నిర్మూలించ వచ్చునని అన్నారు. తిరుపతి జిల్లాలో ఈ ఏడాది మొత్తం 86,345 మంది నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా మార్చడమే లక్ష్యం అని ఇందుకు డిఆర్‌డిఏ,మెప్మా,డిబ్ల్యూఎంఏ,జిఎస్‌డబ్ల్యూఎస్ శాఖల సహకారం అవసరం అని అన్నారు. జిల్లా అభివృద్ధికి నిరక్షరాస్యత ఒక పెద్ద అవరోధంగా మారిందని దానిని అధిగమించే అందుకు ఎస్‌హెచ్‌సి సంఘాలలో ప్రతి మహిళను అక్షరాసులుగా తీర్చిదిద్దాలన్నారు. జూన్ 30 వరకు నిరక్షరాస్యులను వాలంటీర్లను గుర్తించి అక్షర ఆంధ్ర యాప్‌లో నమోదు చేసి జూలైలో తరగతులు ప్రారంభించి మార్చి 2027 వరకు నిర్వహించనున్నట్లు చెప్పారు. వయోజనులకు చదవడం, రాయడంతో పాటు చరవాణి వినియోగం, బ్యాంకు లావాదేవీలు, సైబర్ నేరాలపై అవగాహన పెంపొందించడం, డిజిటల్ లావాదేవీలు, చట్టాలు ఆరోగ్యంపై అవగాహనతో పాటు ప్రజాప్రయోజనకర యాప్‌ల పై అవగాహన కల్పించేలా బోధించనున్నట్లు చెప్పారు. అక్షరాంధ్ర ఉల్లాస్ పథకాన్ని విజయవంతం చేయడం లక్ష్యంగా అక్షరాంధ్ర యాప్ లో పేర్లు నమోదును ప్రారంభించామని క్షేత్రస్థాయిలో అధికారులు సిబ్బందికి అవగాహన సమావేశాలు నిర్వహించి వాలంటీర్లను ఎంపిక చేసి శిక్షణ ఇస్తామని ఆయన పేర్కొన్నారు. .

## టీటీడీకి ఔషధాలు విరాళం



**తిరుమల, మే 29 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** హైదరాబాద్ కు చెందిన ఇందు డ్రగ్స్ ప్రైవేట్ లిమిటెడ్ డైరెక్టర్ తలశిల వేంకటేశ్వరరావు శుక్రవారం తిరుపతిలోని టీటీడీ సెంట్రల్ ఆసుపత్రికి రూ.7.50 లక్షల విలువైన ఔషధాలను విరాళంగా అందించారు. ఈ మేరకు దాత తరపున టీటీడీ బోర్డు సభ్యులు నన్నపనేని సదాశివరావు తిరుమలలోని టీటీడీ చైర్మన్ క్యాంపు కార్యాలయంలో చైర్మన్ బి.ఆర్.నాయుడుకు విరాళాన్ని అందజేశారు.


## మలేరియా నిర్మూలన ప్రతి ఒక్కరి బాధ్యత



**తిరుపతి సిటీ,మే 29 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** మలేరియా వ్యతిరేక మాసోత్సవాలను పురస్కరించుకొని శుక్రవారం తిరుపతి జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ బాలకృష్ణ నాయక్ కార్యాలయములో మలేరియా వ్యతిరేక మాసోత్సవ బ్యానర్లు ఆవిష్కరించారు. డిఎంహెచ్ఓ మాట్లాడుతూ మలేరియా వ్యాధి నిర్మూలన కొరకు అందరూ కలిసి కట్టుగా కృషి చేయాలని తెలిపారు. జిల్లా లోని ఆరోగ్య కేంద్రాలు సచివాలయాలు ఆయుష్మాన్ ఆరోగ్య కేంద్రాలు,సామాజిక ఆరోగ్య కేంద్రాల్లో ఆరోగ్య సిబ్బంది మలేరియా వ్యతిరేక మాసోత్సవ కార్యక్రమాలను సక్రమంగా నిర్వహించాలని, ప్రజల దరికి మలేరియాడెంగ్యూ వ్యాధుల పట్ల అవగాహన కల్పించి మలేరియా వ్యాధి బారిన పడకుండా చూడాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా మలేరియా అధికారి డాక్టర్ రూప్ కుమార్ , డిపిఎంఓ డాక్టర్ చక్ర ప్రకాష్ రెడ్డి,జిల్లా ప్రోగ్రాం అధికారులు తదితరులు పాల్గొన్నారు.




## బోయకొండ గంగమ్మ రాహుకాల అభిషేకానికి విశేష స్పందన



**చౌడేపల్లి, మే 29 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** శక్తి క్షేత్రం బోయకొండ గంగమ్మ ఆలయంలో శుక్రవారం నిర్వహించిన రాహుకాల అభిషేకానికి విశేష స్పందన లభించింది ఉదయాన్నే బోయకొండ మనం వివిధ రకాల జలాలతో అభిషేకించి అలంకరణ చేశారు అనంతరం దంపతుల సమక్షంలో రాహుకాల అభిషేకాన్ని సాంప్రదాయపరంగా నిర్వహించారు రాహుకాల అభిషేకం చేయడం వల్ల లోకం సుభిక్షంగా ఉంటుందన్న నమ్మకంతో నిర్వహించనున్నట్లు వేద పండితులు తెలిపారు అనంతరం పాత కళ్యాణ కట్ట వద్ద భక్తులకు ఉచిత అన్నదాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు ఆలయ ఈవో ఉప కమిషనర్ ఏకాంబరం అధికార సిబ్బంది భక్తులకు మౌలిక వసతులు సమకూర్చారు.

## శ్రీవాణి దర్శన టికెట్ల కేటాయింపులో మార్పులు

**తిరుమల, మే 29 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** భక్తుల సౌకర్యార్థం శ్రీవాణి ట్రస్టుకు సంబంధించిన దర్శన టికెట్ల కేటాయింపులో పలు మార్పులు చేస్తూ టీటీడీ కీలక నిర్ణయం తీసుకుంది. ప్రస్తుతం రోజుకు 1500 శ్రీవాణి టికెట్లను టీటీడీ ఆన్ లైన్ ద్వారా అందుబాటులో ఉంచడం జరిగింది. వీటిలో 500 దర్శన టికెట్లను మూడు నెలల ముందుగా ఆన్ లైన్ లో అడ్వాన్స్ బుకింగ్ కింద అందుబాటులో ఉంచడం జరిగింది. అదేవిధంగా మరో 200 శ్రీవాణి దర్శన టికెట్లను తిరుపతి విమానాశ్రయంలో కరెంట్ బుకింగ్ కింద జారీ చేయడం జరుగుతోంది. ప్రస్తుతం రోజువారీ కరెంట్ బుకింగ్ కోటాలో అందుబాటులో ఉన్న 800 శ్రీవాణి దర్శన టికెట్లలో ఇప్పటికే రూ.10 వేలు విరాళం చెల్లించి దర్శన టికెట్ కోసం వేచి ఉన్న దాతలకు ప్రతిరోజూ 300 టికెట్లు ప్రత్యేకంగా కేటాయించాలని నిర్ణయించడం జరిగింది. ఈ సదుపాయం 2025 మే 1 నుండి విరాళం చెల్లించిన అర్హులైన దాతలకు వర్తించనుంది. ఈ టికెట్లు ప్రతిరోజూ ఉదయం 9 గంటలకు విడుదల చేయబడతాయి. మధ్యాహ్నం 1 గంటలోపు బుక్ చేసుకున్న భక్తులకు అదే రోజు సాయంత్రం 4 గంటలకు దర్శనం కల్పించబడుతుంది. కాగా ఈ విధానం జూన్ 10వ తేది నుండి అమలులోకి రానుంది. ఈ కోటాలో బుకింగ్ కాని టికెట్లను తిరిగి కరెంట్ బుకింగ్ కోటాలో కలపబడతాయి. ఈ విధానం 2027 మార్చి 31 వరకు అమల్లో ఉంటుంది.

## జాబ్‌మేళాలో ఎంపికైన వారికి స్కిల్ హబ్‌లో ఉచిత శిక్షణ : ఎమ్మెల్యే ఆరణి




**తిరుపతి,మే 29 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్య అభివృద్ధి సంస్థ, ఎంప్లాయ్‌మెంట్ ఎక్స్చేంజ్ మరియు సిడాప్ సంయుక్త ఆధ్వర్యంలో స్థానిక ఎస్‌విసిసి డిగ్రీ కళాశాలలో శుక్రవారం ఏర్పాటు చేసిన మెగా జాబ్ మేళాను ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు ప్రారంభించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి నాయకత్వంలో కూటమి ప్రభుత్వం 20 లక్షలు ఉద్యోగాల కల్పనలో భాగంగా తిరుపతి లో జాబ్ మేళా నిర్వహించడం చాలా సంతోషంగా ఉందని తెలియజేశారు. ఈ జాబ్ మేళాలో సెలెక్ట్ అయిన వారికి రూ13500 ల నుంచి 30 వేల వరకు కనీస వేతన సదుపాయం ఉంటుందన్నారు. ఇలాంటి జాబ్ మేళా లను యువతీ యువకులు సద్వినియోగం చేసుకొని వారి కుటుంబాలకు ఆర్థికంగా అండగా ఉంటూ తమ ఎదుగుదలకే బాటలు వేసుకోవాలని సూచించారు. సెలెక్ట్ కాని వారికి త్వరలో నైపుణ్యాభివృద్ధి సంస్థ ద్వారా తిరుపతి ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల లో ఏర్పాటు చేసిన స్కిల్ హబ్ లో ఉచిత శిక్షణ ఇచ్చి ఉపాధి అవకాశాలు కల్పించడం జరుగుతుందన్నారు.తిరుపతి నియోజకవర్గం లో ఇప్పటివరకు 7 మినీ జాబ్ మేళాలు మరియు 5 మెగా జాబ్ మేళాలు నిర్వహించి 1694 మందికి బహుళ జాతీయ కంపెనీలలో ఉద్యోగాలు కల్పించినట్లు చెప్పారు.తాజాగా శుక్రవారం నిర్వహించిన జరిగిన జాబ్ మేళాలో వివిధ కంపెనీలకు ఎంపికైన వారికి ఎమ్మెల్యే చేతుల మీదుగా కంపెనీ ఆఫర్ లెటర్స్ అందజేశారు.తిరుపతి అసెంబ్లీ నియోజకవర్గంలో ప్రతి మూడు నెలలకు ఒకసారి నైపుణ్యాభివృద్ధి సంస్థ ద్వారా జాబ్ మేళాలు నిర్వహించబడుతుందని,యువతీ యువకులు ఈ జాబ్ మేళాలను సద్వినియోగం చేసుకోవాలని తెలియజేశారు.ఈ కార్యక్రమంలో బిజేపీ నాయకుడు సామంచి శ్రీనివాస్,ఎస్‌విసిసి డిగ్రీ కళాశాల కరస్పాండెంట్, ప్రిన్సిపాల్ నాగరాజు,జనసేన నాయకుడు రాజారెడ్డి,జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి లోకనాథం తదితరులు పాల్గొన్నారు.

## నెల్లూరు, కడప జిల్లాల్లో గాలీ వాన బీభత్సం

### -దెబ్బతిన్న విద్యుత్ లైన్లు, స్తంభాలు, ట్రాన్స్ఫార్మర్లు -యుద్ధ ప్రాతిపదికన పునరుద్ధరణ పనులు



**తిరుపతి,మే 29 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** ఏపీఎస్పీడీసీఎల్ పరిధిలోని నెల్లూరు, కడప జిల్లాల్లో గురువారం రాత్రి బలమైన గాలి, వర్షం కారణంగా పలు గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడిందని ఆ సంస్థ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ శివశంకర్ లోతేటి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. కడప జిల్లాలోని కొండాపురం, మైదుకూరు, మైలవరం, జమ్మలమడుగు, ప్రొద్దుటూరు గ్రామీణ, దువ్వూరు, రాజుపాలెం, చాపాడు మండలాల్లోని 28 గ్రామాల్లోనూ, నెల్లూరు జిల్లాలోని కావలి గ్రామీణ, కొండాపురం, కోవూరు, ముత్తుకూరు, జలదంకి, దగదర్తి, అల్లూరు మండలాల్లోని 15 గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడిందని తెలియజేశారు. బలమైన గాలి, వర్షం కారణంగా ఈ రెండు జిల్లాల్లో 26 ఫీడర్లు, 114 కి.మీ. మేరకు విద్యుత్ లైన్లు, 213 స్తంభాలు, 131 ట్రాన్స్ఫార్మర్లు దెబ్బతిన్నాయన్నారు. తద్వారా ఈ రెండు జిల్లాల్లో 19 మండలాలల్లోని 35 గ్రామాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడగా, ఆయా సర్కిళ్ల సూపరింటెండింగ్ ఇంజనీర్ల పర్యవేక్షణలో విద్యుత్ శాఖ అధికారులు, సిబ్బంది శుక్రవారం మధ్యాహ్నానికి విద్యుత్ సరఫరాను పునరుద్ధరించినట్లు తెలిపారు.

## మహిళా సాధికారత ఎన్డీఏ ప్రభుత్వ లక్ష్యం

### - ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు

**తిరుపతి,మే 29 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** మహిళ సాధికారతకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ లు అధిక ప్రాధాన్యత ఇస్తున్నారని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు తెలిపారు. మహిళలకు స్థానిక సంస్థల్లో 50 శాతం రిజర్వేషన్ అమలు చేస్తున్న ఎన్డీఏ కూటమి ప్రభుత్వం చట్టసభల్లో 33 శాతం మహిళా రిజర్వేషన్ సాధనకు కృషి చేస్తున్నదన్నారు. 39వ డివిజన్ లోని చెన్నారెడ్డి కాలనీలో రూ.40 లక్షల వ్యయంతో నిర్మించిన మహిళా స్వశక్తి భవనాన్ని, 40,41 వార్డులో సుమారు 18 లక్షలతో నిర్మించిన మస్టర్ రూమ్ ను శుక్రవారం ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, కమిషనర్ (ఎఫ్.ఏ.సి) శారదాదేవి, గ్రీనరీ అండ్ బ్యూటిఫికేషన్ ఛైర్పర్సన్ సుగుణమ్మ, రాష్ట్ర యాదవ కార్పొరేషన్ చైర్మన్ నరసింహ యాదవ్, రాష్ట్ర నాయీ బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ రుద్రకోటి సదాశివం, తదితరులు ప్రారంభించారు. వారు మాట్లాడుతూ పట్టణ ప్రాంతాల్లో పేదరిక నిర్మూలనకు మెప్మా ద్వారా ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. మహిళా స్వశక్తి భవనాల ద్వారా డ్వాక్రా సంఘాలను బలోపేతం చేసి మహిళా సాధికారత కల్పనకు ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని ఎమ్మెల్యే చెప్పారు. మహిళల్లో నైపుణ్యాభివృద్ధి పెంపొందించేందుకు, ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలపై ప్రజల్లో అవగాహన తీసుకొచ్చేందుకు ఈ భవనాలు ఎంతో ఉపయోగపడుతాయని తెలిపారు. ఇంటికొక మహిళా పారిశ్రామిక వేత్తను తయారు చేసే లక్ష్యంతో ఎన్డీఏ కూటమి ప్రభుత్వం పని చేస్తున్నదన్నారు. ప్రతి రోజు నగరాన్ని ఎంతో సుందరంగా ఉంచేందుకు కష్టిస్తున్న పారిశుధ్య కార్మికులు సేదతీరేందుకు మస్టర్ గది ఏర్పాటు చేశామని తెలిపారు. వారికి సంబంధించిన పనిముట్లు ఉంచుకునేందుకు ఉపయోగకరంగా ఉంటుందని తెలిపారు. మరుగుదొడ్లు కూడా ఏర్పాటు చేశామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సూపరింటెండెంట్ ఇంజనీర్ శ్యాంసుందర్, మునిసిపల్ ఇంజనీర్ గోమతి, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.



## స్వర్ణ ఆంధ్ర లక్ష్య సాధనకు కార్పొరేట్, ప్రభుత్వ రంగ సంస్థల భాగస్వామ్యం కీలకం

### -జిల్లా కలెక్టర్ డా.ఎస్. వెంకటేశ్వర్

**తిరుపతి,మే 29 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** స్వర్ణ ఆంధ్ర–2047 లక్ష్య సాధనకు కార్పొరేట్ సంస్థలు, పరిశ్రమలు, ప్రభుత్వ రంగ సంస్థల భాగస్వామ్యం కీలకమని జిల్లా కలెక్టర్ డా.ఎస్.వెంకటేశ్వర్ తెలిపారు.శుక్రవారం ఉదయం స్థానిక జిల్లా కలెక్టరేట్ లోని విసి హాల్‌లో జిల్లా కలెక్టర్ డా.ఎస్. వెంకటేశ్వర్, స్వర్ణ ఆంధ్ర పి–4 ఫౌండేషన్ డైరెక్టర్ డా. వి. సాంబశివ రాజు, రాష్ట్ర ప్రధాన కార్యాలయానికి చెందిన పిఎంయూ సభ్యులు హారికానాథ్, ఎం శ్రీనివాస్ లతో కలసి జిల్లాలోని పారిశ్రామికవేత్తలు, కార్పొరేట్ సంస్థలు, పరిశ్రమల సంఘాలు మరియు ప్రభుత్వ రంగ సంస్థల ప్రతినిధులతో స్వర్ణ ఆంధ్ర పి–4,జీరో పావర్టీ కార్యక్రమం అమలు మరియు భాగస్వామ్యాలపై అవగాహన కల్పించేందుకు జిల్లా స్థాయి సమావేశాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ...ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన "స్వర్ణ ఆంధ్ర ఏ2047" లో భాగంగా "జీరో పావర్టీ –పి 4" కార్యక్రమానికి వ్యూహాత్మక భాగస్వామ్యాలు ఏర్పరచడం మరియు అవగాహన కల్పించడం ఈ సమావేశం ప్రధాన ఉద్దేశ్యమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా గుర్తించిన బంగారు కుటుంబాల అవసరాలకు అనుగుణంగా భాగస్వామ్యాల ద్వారా వీరి జీవన స్థితిగతులను అభివృద్ధి చేయడం లక్షం అన్నారు. సమగ్ర అభివృద్ధి సాధనలో ప్రభుత్వం మరియు ప్రైవేట్ భాగస్వామ్య సంస్థల సమిష్టి కృషి ఎంతో అవసరమని, స్వర్ణ ఆంధ్ర –2047 లక్ష్య సాధనలో ఏ కుటుంబమూ వెనుకబడకూడదని పేర్కొన్నారు. ప్రభుత్వ వ్యవస్థలు, ప్రైవేట్ రంగం మరియు సమాజ భాగస్వామ్యం కలిసి పనిచేస్తే పేదరిక నిర్మూలనతో పాటు స్థిరమైన సామాజిక–ఆర్థిక అభివృద్ధిధ్యమవుతుందని తెలిపారు. కార్పొరేట్ సంస్థలు మరియు ఫౌండేషన్లు తమ సిఎస్ఆర్ కార్యక్రమాలను జిల్లా అభివృద్ధి ప్రాధాన్యంతో అనుసంధానం చేసి ఆరోగ్యం, విద్య, జీవనోపాధి, మహిళా సాధికారత, శిశు సంక్షేమం, పర్యావరణం మరియు గ్రామీణాభివృద్ధి వంటి రంగాల్లో భాగస్వామ్యం కావాలని సూచించారు.డా. సాంబశివ రాజు మాట్లాడుతూ,పి–4 కార్యక్రమం కేవలం సంక్షేమ పథకం మాత్రమే కాకుండా, సమిష్టి భాగస్వామ్యం మరియు సామాజిక బాధ్యత ద్వారా స్వయం సమృద్ధి కలిగిన కుటుంబాలను నిర్మించే ప్రజా ఉద్యమమని తెలిపారు.ఈ సమావేశంలో జిల్లా పరిపాలన మరియు ఎస్ఏపిఎఫ్ అధికారులు పి–4 నమూనా లక్ష్యం, అమలు విధానం మరియు కార్యాచరణపై సమగ్ర వివరాలు అందించారు.ఈ కార్యక్రమంలో తిరుపతి జిల్లా చీఫ్ ప్లానింగ్ ఆఫీసర్ పి. రాజశేఖర్, డిప్యూటీ ఇన్స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ రామకృష్ణ, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఏఈ మదన్ మోహన్, జిల్లా పరిశ్రమల కేంద్రశీ జనరల్ మేనేజర్ చంద్రశేఖర్, వివిధ కార్పొరేట్ సంస్థలు, పరిశ్రమలు, పబ్లిక్ సెక్టార్ యూనిట్లు , చారిటబుల్ ఫౌండేషన్లు, విద్యాసంస్థలు, స్వచ్ఛంద సంస్థలు మరియు సేవాభావం కలిగిన వ్యక్తులు పాల్గొన్నారు.

## ఓటర్ల జాబితా రూపకల్పనకు అన్ని రాజకీయ పార్టీలు సహకరించాలి



**తిరుపతి,మే 29 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** స్వచ్ఛమైన నిర్దిష్టమైన ఓటర్ల జాబితా రూపకల్పనకు అన్ని రాజకీయ పార్టీలు సహకరించాలనీ జిల్లా కలెక్టర్ డా ఎస్ వెంకటేశ్వర్ కోరారు.శుక్రవారం స్థానిక కలెక్టరేట్ లోని వీడియో కాన్ఫరెన్స్ హాలు లో డిఆర్ఓ నరసింహులు తో కలిసి జిల్లాలోని గుర్తింపు పొందిన అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులతో భారత ఎన్నికల సంఘం మార్గదర్శకాలు మేరకు స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) పై కార్యక్రమంపై సమావేశం నిర్వహించారు.జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఓటర్ల జాబితా ను స్వచ్ఛంగా నిర్దిష్టంగా రూపొందించేందుకు అన్ని పార్టీలు సహకరించాలని,భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ప్రక్రియ – 2026 భాగంగా 2002 ఓటర్ల జాబితాలోని ఓటర్ల జాబితా, ప్రస్తుత ఓటర్ల జాబితాకి సంబంధించిన ఓటర్ల జాబితా మ్యాపింగ్ ప్రక్రియ ను బి ఎల్ ఓ లు నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ ప్రత్యేక కార్యక్రమం ద్వారా ఓటర్ల జాబితాలోని తప్పులను సరిదిద్దడం, కొత్త ఓటర్లను నమోదు చేయడం, మరణించిన లేదా వేరే ప్రాంతాలకు తరలిపోయిన వారి పేర్లను తొలగించడం ఓటరు జాబితా తయారీ అత్యంత కీలకమైన ప్రక్రియ అని, ఎలాంటి తప్పులు లేకుండా పారదర్శకమైన జాబితా రూపకల్పనకు పార్టీలు తమ వంతు సహకారం అందించాలని అన్నారు. ఇంటింటా సర్వే చేసే బూత్ లెవల్ అధికారులతో సమన్వయం చేసుకోవాలని తెలిపారు. ఇళ్ళ సర్వే, ముసాయిదా ఓటర్ల జాబితా ప్రకటన, అభ్యంతరాల స్వీకరణ మరియు తుది జాబితా ప్రచురణ తేదీల గురించి పార్టీలకు వివరించడం జరిగిందని.ఎన్యుమరేషన్ ఫారం లు సమర్పించిన ఓటర్ల పేర్లు ముసాయిదా జాబితాలో చేర్చడం జరుగుతుందన్నారు. ప్రజాస్వామ్యం బలోపేతం కోసం ఓటర్ల జాబితాల స్వచ్ఛతను కాపాడడం కోసం ప్రతి పౌరుడి బాధ్యత అని ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా అమలు చేద్దాం అన్నారు.

## చీఫ్ ఎలక్టోరల్ ఆఫీసర్ ఆధ్వర్యంలో పగడ్బందీగా ఎస్ఐఆర్

**తిరుపతి,మే 29 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ కార్యక్రమాన్ని ఆంధ్రప్రదేశ్‌లో కూడా చీఫ్ ఎలక్టోరల్ ఆఫీసర్ ఆధ్వర్యంలో పగడ్బందీగా అమలు చేయనున్నట్లు జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్ పేర్కొన్నారు.ఎస్ఐఆర్‌పై వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించిన అనంతరం కలెక్టర్ మీడియా సమావేశంలో మాట్లాడుతూ ఎస్ఐఆర్ ప్రక్రియపై విస్తృతంగా అవగాహన కల్పించినట్లు తెలిపారు.జూన్ 5 నుంచి రాష్ట్రవ్యాప్తంగా ఎస్ఐఆర్ ప్రక్రియ ప్రారంభం కానుందని,జూన్ 5 నుంచి జూన్ 14 వరకు బిఎల్‌ఓలు,ఆర్‌ఓలు,ఏఆర్‌ఓ లకు జిల్లా ఎన్నికల అధికారులకు శిక్షణ కార్యక్రమాలు నిర్వహించబడతాయని తెలిపారు. ఇదే సమయంలో ఎన్యుమరేషన్ ఫారాల ముద్రణ, పంపిణీకి సంబంధించిన ఏర్పాట్లు పూర్తి చేస్తామని చెప్పారు. ఇంటింటికీ ఓటర్ల మ్యాపింగ్ ప్రక్రియను మరింత వేగవంతం చేయాలని దీూలకు ఇప్పటికే ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు.జూన్ 15 నుంచి జూలై 14 వరకు దీూలు ఇంటింటికీ వెళ్లి ఓటర్ల వివరాలను సేకరిస్తారని ఇది మొత్తం ఎస్ఐఆర్ ప్రక్రియలో అత్యంత కీలకమైన దశ అని పేర్కొన్నారు. 2026 ఓటరు జాబితా ఆధారంగా ప్రతి ఓటరికి ఎన్యుమరేషన్ ఫారం అందజేయబడుతుందని, ఓటరు ఇంట్లో లేని పరిస్థితిలో రెండు ఫారాలను ఇంటివద్ద వదిలి వెళ్తారని, ఓటర్లు ఎన్యుమరేషన్ ఫారాలను పూర్తిగా నింపి బిఎల్‌ఓలకు తిరిగి అందజేయాలని కోరారు. రాజకీయ పార్టీలు బిఎల్ఏ ల ద్వారా రోజుకు గరిష్టంగా 50 ఫారాల వరకు సమర్పించవచ్చని,అలాగే నేరుగా లేదా ఆన్లైన్ ద్వారా కూడా ఫారాలు సమర్పించే అవకాశం కల్పించామని చెప్పారు.

Edited, Printed, Published and Owned by K.S. Rangasayi and published from D.No. 19-9-3A/1, Jayanagar, Ramanuja Circle, Tirupati - 517501 and Printed at SKYLINE Press, D.No. 19-9-3A/1, Jaya Nagar, Tirupati- 517501, Associate Editor: K. Neeraja, Ph:0877-2239899, email : netimanadesamdailytpt@gmail.com; Postal Reg. No TRP/139/2025-2027